కుండపోత

- పొంగిన వాగులు, నిలిచిన రాకపోకలు
- ఏలూరులో కొట్టుకుపోయిన కారు, వాగులో చిక్కుకున్న స్కూలు బస్సు

• లోపలి పేజీల్లో •

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 346 | విజయవాడ, శుక్రవారం 19 జులై 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 19 July 2024 | Rs



8వ టైటిల్‌పై హర్మన్‌ప్రీత్ గురి

- నేటినుంచి మహిళల ఆసియాకప్
- భారత్ X పాకిస్తాన్ జట్ల మధ్య తొలిపోరు

10

పైపులైన్ల లీకేజితోనే డయేరియా

- పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తాగునీటి పైపులైన్ల మరమ్మతుల సమయంలో చోటుచేసుకున్న లోపాల వల్లే డయేరియా వ్యాపించిందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. డయేరియా వ్యాప్తి, అన్న క్యాంటీన్ల ఏర్పాటు వంటి అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కొన్నిచోట్ల పైపులైన్ల రిపేర్లలో వచ్చిన లోపాల వల్ల మురుగునీరు పైపుల్లోకి చేరి డయేరియా వ్యాప్తికి కారణమైందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అనేకచోట్ల పైపులైన్లలో సమస్య ఉందని గతంలోనే ప్రజాశక్తి రాసిన విషయం తెలిసిందే. ఆ విషయాన్నే మంత్రి తాజాగా ధృవీకరించారు. ఆధునీకరణ పేరుతో తవ్వేసిన పైపులైన్లు సరిగా పూడ్చకపోవడం వల్ల కూడా మురుగునీరు అక్కడక్కడా పైపుల్లోకి వచ్చిందని చెప్పారు. ఇక ముందు అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే డ్రెయినేజీల్లో పూడికతీతకు రూ.50 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కలుషిత మైన బోరు బావులు, ఆర్‌ఓ ప్లాంట్లలో నీరు కూడా డయేరియాకు కారణంగా గుర్తించినట్లు చెప్పారు.

ఎఐఐబి ప్రాజెక్టు రెండేళ్ల పొడిగింపు

తాగునీరు, మురుగునీటి శుద్ధి, వరద నీటి పారుదల కాలువల ఏర్పాటు కోసం ఎఐఐబితో చేసుకున్న ఒప్పందం జూన్‌తో ముగిసిందని, రెండేళు పొడిగించాలని ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని రెండేళ్లు పొడిగించిందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కింద రూ.5,350 కోట్లను కేటాయించగా, గత ప్రభుత్వం రూ.250 కోట్లు మాత్రమే తమ వాటాగా కేటాయించడంతో ప్రాజెక్టు పనులు నడవలేదని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయి ఉంటే మున్సిపాలిటీల్లో కనీసం 50 శాతం తాగునీటి సమస్య ఉండేది కాదని చెప్పారు.

అన్న క్యాంటీన్ల పనులు వేగవంతం

రాష్ట్రంలో 203 అన్నా క్యాంటీన్లను ప్రారంభిస్తే 183 మాత్రమే వినియోగంలోకి వచ్చాయని, వాటి ద్వారా రోజుకు 2.23 లక్షల మంది భోజనం చేసే వారని చెప్పారు. వచ్చేనెల 10వ తేదీలోపు అన్నిటినీ పూర్తి చేస్తామని మంత్రి నారాయణ వివరించారు.

పంటల బీమా దారెటు?

- తొలుత మోడీ పథకాలకు మార్గం వేసింది టిడిపినే
- స్వంతంగా అని.. తిరిగి వెనక్కొచ్చిన వైసిపి
- పదేళ్లుగా విపత్తు రైతును ఆదుకోని స్కీమ్‌లు
- ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏం చేయబోతోంది?
- గడుస్తున్న ఖరీఫ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

గత ప్రభుత్వ హయాంలో అమలైన పంటల బీమా స్థానే రైతులకు మరింత ప్రయోజనం కలిగించేలా మెరుగైన పథకాన్ని తెస్తామని టిడిపి కూటమి సర్కారు నిర్ణయించడంతో వ్యవసాయదారుల్లో ఆసక్తి నెలకొంది. కొత్త పథకంపై అధ్యయనానికి ముగ్గురు మంత్రులతో కమిటీ వేయడంతోపాటు నెల రోజుల్లో సదరు కమిటీ నివేదిక ఇవ్వాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానించడంతో రైతుల్లో ఒకింత కుతూహలంతో పాటు పలు సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే నెలన్నర ముగియగా, ఇంకో నెల రోజుల్లో బీమా పథకంపై మంత్రుల కమిటీని నివేదిక ఇవ్వమన్నారు. నెల రోజుల్లో నివేదిక వచ్చినా, ఉత్తర్వులొచ్చి కార్యాచరణలోకి రావాలంటే మరింత సమయం పడుతుంది. కొత్త పథకం వచ్చే వరకన్నా ప్రస్తుత పథకాలు ఉంటాయా? లేదా? అనే ప్రశ్నలు తలెత్తాయి. ఒకవేళ సమయం మించిపోతే రైతులకు ప్రభుత్వం ఏ విధంగా న్యాయం చేస్తుందన్న చర్చ మొదలైంది.



అప్పుడు సై అని..

మోడీ ప్రభుత్వం 2016లో, అంతకుముందున్న పంటల బీమా పథకాలను రద్దు చేసి ఫసల్, వాతావరణ ఆధారిత బీమా స్కీంలను ప్రవేశపెట్టింది. అప్పటివరకు కేంద్ర ప్రభుత్వరంగంలోని వ్యవసాయ పంటల బీమా సంస్థ (ఎఐఎస్) ఒక్కటే క్రాప్ ఇన్సూరెన్స్‌ను నిర్వహించగా, ఆ రంగంలోకి ప్రైవేటు కంపెనీలను చొప్పించింది. అప్పుడు ఎన్‌డిఎలో ఉన్న టిడిపి మన రాష్ట్రంలోనూ ఆ పథకాలకు జైకొట్టింది. వైసిపి వచ్చాక కేంద్ర పథకాల వలన రైతులకు న్యాయం జరగట్లేదని చెప్పి స్వంతంగా పంటల బీమాను 2019 రబీ నుంచి రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించింది. అయితే కేంద్ర పథకాల గైడ్‌లైన్స్‌నే ఇక్కడా పాటించింది. రైతుల తరఫున ప్రీమియాన్ని తానే చెల్లించి ఉచిత పంటల బీమా అమలు చేసింది. అంతేకాకుండా ఎపి ప్రభుత్వం స్వంతంగా ఇన్సూరెన్స్ కంపెనీని నెలకొల్పేందుకు ప్రయత్నాలు చేయగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ వద్ద మోకాలడ్డింది. దాంతో పాటు రైతుల ప్రీమియంలో భరించాల్సిన తన వాటా నిధులివ్వకుండా బిగబట్టింది. కేంద్ర పథకాల్లో చేరాలన్న కేంద్ర ఒత్తిడికి తలొగ్గిన వైసిపి ప్రభుత్వం 2022 ఖరీఫ్ నుంచి తిరిగి కేంద్ర పథకాల్లో చేరింది. మళ్లీ ప్రైవేటు కంపెనీలు వచ్చి పడ్డాయి. కాగా ఇప్పటి వరకు 2022-23 రబీ, 2023 ఖరీఫ్, 2023-24 రబీ క్లెయిములు చెల్లించలేదు. టిడిపి హయాంలో, వైసిపి స్వంతంగా నిర్వహించిన పథకాల్లో, అనంతరం కేంద్ర పథకాల్లో విపత్తుల వల్ల వాస్తవంగా నష్టపోయిన రైతులందరికీ బీమా దక్కలేదు.

కేంద్రాన్ని కాదంటుందా?

ఇ-క్రాప్‌లో నమోదే అర్హతగా వైసిపి సర్కారు బీమాను అమలు చేయడం మూలంగా గుర్తింపునకు నోచుకోని కౌలు రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. సాంకేతిక కారణాలు, సిబ్బంది తప్పిదాలు, నిర్వహణా లోపాలు, ఎర్రర్స్ వలన పెద్ద సంఖ్యలో భూమి కలిగిన రైతులు సైతం బీమా కోల్పోయారు. ఈ అంశాలపై టిడిపి కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. రైతుల భాగస్వామ్యంతో బీమా అంటోంది సర్కారు. దాంతో ఉచిత పంటల బీమా అమలవుతుందా లేదా అన్న భయాలు రైతుల్లో కలుగుతున్నాయి. ఇ-క్రాప్‌ను ఎత్తేసి గతంలో మాదిరి బ్యాంకుల్లో రుణాలు తీసుకునే సమయంలోనే రైతుల నుంచి ప్రీమియం మినహాయించుకునే పద్ధతిని ప్రవేశపెడతారా? అలా అయితే ప్రీమియాన్ని రైతులే భరించాల్సి ఉంటుంది. బ్యాంకుల్లో లోన్లు ఇవ్వని కారణంగా కౌలు రైతులకు ఇక్కడా నష్టం వాటిల్లుతుంది. ఒక వేళ ఉచిత పంటల బీమా అయితే రైతుల వాటా ప్రీమియాన్ని ప్రభుత్వం రైతుల అకౌంట్‌లో డిబిటి పద్ధతిలో జమ చేయాల్సి ఉంటుంది. నాన్-లోనీ ఫార్మర్స్‌కు బీమా అవకాశం ఉన్నా అది రైతుల ఇష్టా ఇష్టాలపై ఆధారపడి ఉంటుంది. ఈ కేటగిరీలోకి కౌలు రైతులొచ్చినా ప్రీమియం భారం వారిపైనే పడుతుంది. ఈ కేటగిరీలో ఉన్న కౌలు రైతుల ప్రీమియాన్ని ప్రభుత్వం పెట్టుకుంటేనే వారికి న్యాయం జరుగుతుంది. ఇంకో ముఖ్య విషయం ఏంటంటే... మోడీ ప్రభుత్వం 2016లో ఫసల్ బీమాను ప్రవేశపెట్టినప్పుడు దాన్ని టిడిపి సర్కారు రాష్ట్రంలో అమలు చేసింది. వైసిపి సర్కారు ఆ పథకం వద్దన్నా ఒత్తిడి చేసి మరీ తిరిగి కేంద్ర పథకాల్లో చేర్చింది బిజెపి సర్కారు. ఇప్పుడు కేంద్ర పథకాలను కాదని ఎన్‌డిఎలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందా అనేది అతి పెద్ద సందేహం.

పరీక్షా కేంద్రం, నగరాల వారీగా నీట్- యుజి ఫలితాలు 20న వెల్లడించాలి

- అభ్యర్థుల గుర్తింపును బహిర్గతం చేయొద్దు
- ఎన్‌టిఎను ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : నీట్-యుజి పరీక్ష రాసిన అభ్యర్థుల ఫలితాలను పరీక్షా కేంద్రం, నగరాల వారీగా ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోగా ప్రకటించాలని సుప్రీంకోర్టు గురువారం జాతీయ టెస్టింగ్ సంస్థ (ఎన్‌టిఎ)ను ఆదేశించింది. అభ్యర్థుల గుర్తింపును బహిర్గతం చేయకుండా మార్కులు ప్రచురించాలని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన బెంచ్ సూచించింది. నీట్ పరీక్షలో కచ్చితంగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని రూఢి అయితేనే మిగతా 6లో

లోపలి పేజీల్లో

రామ్‌కో ఫ్యాక్టరీలో ప్రమాదం
- కార్మికుడు మృతి

భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఘోరం
- ఫార్మా ప్రమాద మృతుడి కుటుంబానికి సిపిఎం, సిఐటియు పరామర్శ

హత్యలు, అత్యాచారాల నియంత్రణకు చర్యలు
- హోంమంత్రి అనితకు ఐద్వా విజ్ఞప్తి

'వర్సిటీ'లకు ఇన్‌ఛార్జి విసిలు
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

బంగాళా ఖాతంలో అల్పపీడనం

- రెండు రోజులు భారీ వర్షాలు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణా సంస్థ ఎమ్‌డి ఆర్.కూర్మనాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం ప్రకాశం, నంద్యాల జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం వుంది. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం వుంది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం వుంది. గురువారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో అత్యధికంగా 137 మిల్లీమీటర్లు, కొయ్యలగూడెంలో 111 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. కోనసీమ జిల్లా మండపేటలో 96, తూర్పుగోదావరి జిల్లా కడియంలో 92, నిడదవోలులో 91 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని కూర్మనాథ్ పేర్కొన్నారు.



పట్టాలు తప్పిన రైలు

యుపిలో రైలు ప్రమాదం

- నలుగురి మృతి
- 30 మందికి గాయాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని గోండా సమీపంలో గురువారం మధ్యాహ్నం చండీగఢ్-దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఎనిమిది బోగీలు పట్టాలు తప్పడంతో నలుగురు ప్రయాణీకులు మృతి చెందిగా, మరో 30 మందికిపైగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి గల కారణం ఇంకా వెల్లడికాలేదు. రాష్ట్రంలోని గోండా, జిలాహి వద్ద ఉన్న పికౌర వద్ద ఈ ప్రమాదం జరిగింది. సమాచారం తెలిసిన వెంటనే సహాయక బృందాలు అక్కడకు తరలివెళ్లాయి. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో సహాయక కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది. 40 మందితో కూడిన వైద్య బృందాన్ని, 15 అంబులెన్సులు సంఘటన స్థలానికి తరలించారు. 15904 నంబర్ గల ఈ ట్రైన్ చండీగఢ్ నుంచి అస్సాంలోని దిబ్రూగఢ్ వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. రైలుకు చెందిన మొత్తం 21 బోగీల్లో ఎనిమిది బోగీలు పట్టాలు తప్పగా, ఇందులో ఐదు ఏసి బోగీలు పూర్తిగా పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదం కారణంగా ఈ మార్గంలో రైళ్ల ప్రయాణానికి తీవ్ర అంతరాయం మిగతా 6లో

గుజరాత్‌లో 'చండీపురా' విజృంభణ

- 21 మంది మృతి
- 35కి చేరిన కేసులు

అహ్మదాబాద్ : గుజరాత్‌లో చండీపురా వైరస్ విజృంభిస్తోంది. రాష్ట్ర వ్యాపితంగా చండీపురా కేసులు పెరిగిపోతున్నాయి. ఇంతవరకు ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడి 21 మంది మరణించారు. తాజాగా రాజ్‌కోట్‌లో ముగ్గురు, అహ్మదాబాద్‌లో ఇద్దరు, పంచమహల్ జిల్లాలో ఒకరు మరణించారు. 35 మంది దాకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆరోగ్య మంత్రిత్వ శాక అధికారులే చెప్పారు. గత కొన్ని రోజులుగా వైరస్ ప్రబలుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తుండడంపై అన్ని వైపుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ వైరస్ గురించి అంతగా భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య శాఖ మంత్రి రిషికేష్ పటేల్ చెప్పారు. పూణెలోని పరీక్షా కేంద్రానికి ఏడు నమూనాలను పంపగా ఒక కేసులోనే చండీపురా వైరస్ నిర్ధారణ అయిందని, అది నాలుగేళ్ల బాలికకు చెందినదని మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో చండీపురా వైరస్ కారణంగా తొలి మరణం ఇదేనని సబర్‌కాంత జిల్లా ప్రధాన వైద్యాధికారి రాజ్ సుతారియా తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన ఏడాది బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైరస్‌తో మరణించినట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ వైరస్ అహ్మదాబాద్ వరకూ విస్తరించింది. 13 జిల్లాల్లో ఈ వైరస్ ప్రభావం ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వైరస్ పరిస్థితిపై గురువారం ముఖ్యమంత్రి భుపేంద్ర పటేల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వైరస్‌ను నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు.



సబర్‌కాంత జిల్లాలో చండీపురా వైరస్ బాధితులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

చండీపురా వైరస్ అంటే...

చండీపురా వైరస్ అనేది ఒక రకమైన ఆర్బోవైరస్. ఇది రాబ్డోవిరిడె కుటుంబానికి చెందిన వెసిక్యులర్ వైరస్ జాతికి చెందినది. ప్రధానంగా ఫ్లెబోటొమైన్ శాండ్‌ఫ్లయిస్ ద్వారా, కొన్నిసార్లు పేలు, దోమల ద్వారా ఈ వైరస్ వ్యాప్తి చెందుతుంది. చిన్నారులు ఎక్కువగా ఈ వైరస్ బారిన పడుతుంటారు. ఇది మొదటిసారిగా 1965లో మహారాష్ట్రలోని చండీపురాలో బయటపడింది. ఈ వైరస్ సోకిన వారికి ముందుగా అధిక జ్వరం వస్తుంది. తీవ్రమైన తలనెప్పి, వాంతులు, మూర్ఛ వంటి లక్షణాలు కూడా కన్పిస్తాయి. మానసిక స్థితి మారిపోతుంది. దీనికి సకాలంలో వైద్యం చేయకపోతే రోగి కోమాలోకి వెళతారు. చివరికి ప్రాణాలకు కూడా ముప్పు రావచ్చని నిపుణులు చెబుతున్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు

- సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో


గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన నార్కో-కో ఆర్డినేషన్ సెంటర్ 7వ అపెక్స్ లెవెల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో వర్చువల్‌గా రాష్ట్రప్రభుత్వం తరపున ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, అడిషనల్ డిజి రవిశంకర్ అయ్యన్నార్, ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, పిసిసిఎఫ్ చిరంజీవి చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆపరేషన్ పరివర్తన పేరిట గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో గంజాయి సాగు చేయకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. నియంత్రణకు సంబంధించి ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేయడంతోపాటు పెద్దయెత్తున చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు తీసుకొచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న అమిత్‌షా

బైడెన్‌కు కోవిడ్

- పోటీ నుంచి తప్పుకుంటారా?



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షులు జో బైడెన్‌కు బుధవారం కోవిడ్-19 బారిన పడినట్లు వైట్‌హౌస్ గురువారం తెలిపింది. లాస్‌వేగాస్‌లో ఎన్నికల ప్రచారంలో వుండగా ఆయనకు ఈ వైరస్ సోకిందని, స్వల్పంగా లక్షణాలు కనిపించాయని వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కరినె జేన్ పియర్రె ఒక ప్రకటనలో తెలిపారు. డెల్వార్‌లో ఆయన ఐసోలేషన్‌లో వుంటకరాని, అక్కడ నుండే ఆయన తన విధులను నిర్వర్తిస్తారని ఆమె తెలిపారు. అధ్యక్ష పదవి రేసులో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ కన్నా ఆయన వెనక బడిపోయినట్లు సర్వేలు తెలియజేస్తున్న దరిమిలా ఆయన రెండోసారి అధ్యక్షపదవికి పోటీ నుంచి తప్పుకుని, బ్యాటన్‌ను తన అనుచరుడు కాలిఫోర్నియాకు చెందిన ఆడమ్ షిఫ్‌కు అందజేయవచ్చని ఊహాగానాలు ఊపందుకున్నాయి. బైడెన్ రెండోసారి పోటీ చేయకుండా తప్పుకుంటే మంచిదని డెమొక్రాట్లకు చెందిన మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, పెలోసి వంటి వారు బాహాటంగానే సలహా ఇస్తున్నారు. బైడెన్ ఇటీవల ఒక ప్రకటన చేస్తూ తన ఆరోగ్య పరిస్థితి సహకరించదని డాక్టర్లు నిర్ధారిస్తే రెండవసారి పోటీ చేసే విషయాన్ని పునరాలోచిస్తానని సంకేతమిచ్చారు.

ఉద్రిక్తతలు

- పుంగనూరులో మిథున్‌రెడ్డిని అడ్డుకున్న టిడిపి నేతలు
- పరస్పరం రాళ్ల దాడులు
- పలు వాహనాలు ధ్వంసం
- వినుకొండలో వైసిపి కార్యకర్త దారుణహత్య



రెడ్డెప్ప ఇంటిముందు ఇరు పార్టీల శ్రేణులకు సర్దిచెబుతున్న పోలీసులు , దగ్ధమవుతున్న రెడ్డెప్ప వాహనం (ఇన్‌సెట్‌లో)

ప్రజాశక్తి - పుంగనూరు, వినుకొండ

చిత్తూరు జిల్లా పుంగనూరులో, పల్నాడు జిల్లా వినుకొండలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం ఉదయం ఎంపి మిథున్‌రెడ్డిని టిడిపి నేతలు అడ్డుకున్నారు. దీంతో ఇరువురు కార్యకర్తలు రాళ్ల దాడికి దిగారు. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. బుధవారం రాత్రి వినుకొండలో వైసిపి యువజన నాయకుడిని దారుణంగా హత్య చేశారు.

చిత్తూరు జిల్లా పుంగనూరులో ఇటీవల కూల్చివేసిన ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించేందుకు మాజీ ఎంపి రెడ్డెప్పతో కలిసి వెళ్లేందుకు ఆయన ఇంటికి రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి వెళ్లారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు నగరంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి ప్రదర్శనగా టీచర్స్ కాలనీలోని రెడ్డెప్ప ఇంటి వద్దకు చేరుకున్నారు. అప్పటికే అప్రమత్తమైన పోలీసులు రెడ్డెప్ప ఇంటి చుట్టూ పహారా ఏర్పాటు చేశారు. ఇంటి సమీపంలోకి వెళ్లిన టిడిపి నాయకులపై వైసిపి కార్యకర్తలు రాళ్లు రువ్వారు. దీంతో రెడ్డెప్ప ఇంటిని టిడిపి కార్యకర్తలు చుట్టుముట్టి రాళ్లదాడి చేశారు. వైసిపి నాయకులకు చెందిన పలు వాహనాలను ధ్వంసం చేశారు. చిత్తూరు మాజీ ఎంపి రెడ్డెప్ప వాహనానికి నిప్పుపెట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు వరకూ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువురుని చెదరగొట్టినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో ఎంపి మిథున్‌రెడ్డి గన్‌మెన్ మూడురౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అతికష్టం మీద ఎంపిని అడిషనల్ ఎస్‌పి బయటకు తీసుకువచ్చారు. ఎంపి వెళ్లిన తర్వాత పోలీసులు ఇరువురు కార్యకర్తలను చెదరగొట్టారు. ఈ ఘర్షణలో టిడిపికి చెందిన వారు 12 మంది, వైసిపికి చెందిన వారు ఇద్దరు గాయపడ్డారు.

పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని ముళ్లమూరు బస్టాండ్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్, వైసిపి యువజన నాయకుడు షేక్ రషీద్‌ను (28) బుధవారం రాత్రి మిగతా 2లో

అరాచకాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ

- మోడీ అప్పాయింట్‌మెంట్ కోరుతూ ప్రధానికి జగన్ లేఖ

2

రామ్‌కో ఫ్యాక్టరీలో ప్రమాదం

● కార్మికుడు మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ధర్మవరప్పాడు తండాలోని రామ్‌కో సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్యారేజీలో పని చేస్తున్న జయంతిపురం గ్రామానికి చెందిన ఎం.నాగులు (45)ను ఐవిసి (రోడ్డు క్లీన్ చేసే) మిషన్ రివర్స్‌లో వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన నాగులును విజయవాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రమాదంలో మృతిచెందిన నాగులు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, జయంతిపరం గ్రామస్తులు రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళనకు దిగారు.

సాంఘిక బహిష్కరణ దారుణం

● అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏలూరు జిల్లా నూజివీడు మండలం పోతిరెడ్డి పల్లె గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్ వసుంధరను సాంఘిక బహిష్కరణ చేయడం దారుణమని, దీనికి పాల్పడిన శ్రీనివాసరావు, కుమార్, దుర్గారావు తదితరులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటికి దారిలేదంటూ ఈ నెల 9న ఆమె ఇంటికి ఇరువైపులా దౌర్జన్యంగా కంచె వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంచెను వెంటనే తొలగించి యథావిధిగా దారి ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వసుంధర కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

22 వరకు కవిత కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌పై సిబిఐ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఢిల్లీ కోర్టు మరోసారి జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. ఈ కేసులో ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది. కవితకు అస్వస్థత నేపథ్యంలో ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ సిబిఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీపై గురువారం కోర్టులో విచారణ జరిగింది. లిక్కర్ కేసులో విచారణ కోసం కవితను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జైలు అధికారులు హాజరుపరిచారు.



అల్లూరి జిల్లా కూనవరం మండలం బోదునూరు వాగులో ఒకరి చేతులు ఒకరు పట్టుకొని వాగు దాటుతున్న ఉపాధి హామీ కూలీలు



ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో వాగులో చిక్కుకున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు

కుండపోత

● పొంగిన వాగులు, నిలిచిన రాకపోకలు
● పల్లపు ప్రాంతాలు జలమయం
● ఏలూరులో కొట్టుకుపోయిన కారు, వాగులో చిక్కుకున్న స్కూలు బస్సు

ప్రజాశక్తి-యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షం కురిసింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రాత్రి వరకూ ఎడతెరపిలేని వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో ఓ వాగులో కారు కొట్టుకుపోయింది. స్థానికులు సకాలంలో స్పందించడంతో ఐదుగురు బాధితులు సురక్షితంగా బయటపడ్డారు. జంగారెడ్డిగూడెంలో ఓ స్కూలు బస్సు వాగులో చిక్కుకుంది. విస్తారంగా వర్షాలు పడడంతో వరినాట్లు, ఆకు మడులు చెరువులను తలపిస్తున్నాయి. రహదారులన్నీ మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

ఏలూరు జిల్లాలో భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏజెన్సీలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వేలేరుపాడు మండలంలోని కోయమ్మధారం గ్రామం వద్ద వాగు పొంగడంతో ఆ మార్గంలో కాజ్‌వేపై నుంచి ప్రయాణిస్తున్న కారు వాగులో కొట్టుకుపోయింది. కొద్ది దూరం వెళ్లాక కారులో ఉన్న డ్రైవర్‌తోపాటు ఇద్దరు మహిళలు, ఇద్దరు బాలురు అతికష్టం మీద కారులో నుంచి బయటకు వచ్చి వాగులోని పొదలను పట్టుకుని కాపాడాలంటూ హహకారాలు చేశారు. అతికష్టం మీద స్థానికులు బాధితులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. వీరు రాజమండ్రి నుంచి వేలేరుపాడు వెళుతుండగా ఈ ఘటన జరిగింది.

బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం మార్గంలో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు విద్యార్థులతో కాజ్‌వే దాటే ప్రయత్నంలో మధ్యలో ఆగిపోయింది. లారీ సాయంతో స్థానికులు స్కూల్ బస్సును వరద ప్రవాహంలోకి బయటకు తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బుట్టాయగూడెంలో గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లిన యాత్రికులు కొండవాగులు పొంగడంతో అక్కడే చిక్కుకుపోయారు. గుడికి సమీపంలో వాగు ప్రమాదకర రీతిలో ప్రవహిస్తుండటంతో సుమారు 400 మంది అక్కడే బిక్కుబిక్కుమంటూ గడిపారు. వాగు ఉధృతి తగ్గాక కొంతమంది యాత్రికులు అతికష్టంపై బుట్టాయగూడెం చేరుకున్నారు. సుమారు 50 మంది వరకూ ఇంకా అక్కడే చిక్కుకుపోయినట్లు సమాచారం.

చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలోని తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద నీరు పోటెత్తింది. ఇన్‌ఫ్లో 255 క్యూసెక్కులుగా ఉందని ఎఇ పరమానందం తెలిపారు. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 355 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరు బేసిన్ 335.64 అడుగులుగా ఉందని వివరించారు. జంగారెడ్డిగూడెం శివార్లలో ఉన్న కరాటం జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతుండటంతో రెండు గేట్లు ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్న ఇరిగేషన్ డిఇ దేవప్రకాష్ తెలిపారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.01. మీటర్లు ఉందని తెలిపారు. రెండు గేట్లు ద్వారా దిగువ ప్రాంతాలకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

పశ్చిమగోదావరి జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అల్లూరి జిల్లా చింతూరు డివిజన్ పరిధిలోని విలీన మండలాల్లో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. విఆర్.పురం మండలంలోని లోతట్టు గ్రామమైన శ్రీరామగిరిలో వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోయి ఇళ్లలోకి చేరింది. అడవి వెంకన్న గూడెం, నూతిగూడెం, మొద్దులగూడెం, అన్నవరం ప్రాంతాల్లోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. 60 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరిలో నీటి ప్రవాహం పెరిగింది. శబరి నది నిండుగా ప్రవహిస్తోంది. కూనవరం మండలంలోని బోదునూరు, పండరాజుపల్లి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. టేకులబోరు గ్రామానికి చెందిన ఉపాధి హామీ కార్మికులు బోదునూరు గ్రామానికి పనికి వెళ్లి తిరిగి వస్తుండగా వాగు ఎక్కువైంది. వారంతా ఒకరి చేతులు ఒకరు పట్టుకొని వాగు దాటి ప్రాణాలు దక్కించుకున్నారు. డుంబ్రిగుడ మండలంలోని సొవ్వ పంచాయతీ గొప్పులవలసలో కొర్ర నూకన్న పెంకుటిల్లు కూలిపోయింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో చిరుజల్లులు పడ్డాయి.

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో కురిసిన భారీ వర్షానికి రహదారులపై డ్రైనేజీ నీరు ప్రవహించింది. దేవరపల్లిలో ఎస్‌బిఐ బ్యాంకులోకి మూడు అడుగుల నీరు చేరింది. రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కడియం మండలాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి మోకాల్లోతు నీరు నిలిచిపోయింది. కోనసీమ జిల్లా ఆలమూరులో 100 ఎకరాల్లో వరినారుమళ్లు నీట మునిగాయి. కొత్తపేట, పి.గన్నవరం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తంలోని లంకల్లో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది.

విజయనగరం జిల్లా వ్యాప్తంగా 73.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. బొబ్బిలిలో అత్యధికంగా 9.4 మి.మీ నమోదైంది. వరి నారు మడులు ఎండిపోతున్న స్థితిలో స్వల్ప వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మన్యం జిల్లాలో కూడా చిరు జల్లులు కురిశాయి.

శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో సగటున 16.1 మి.మీ వర్షపాతం నమోదైంది. సంతబొమ్మాళి మండలంలో అత్యధికంగా 65.75 మి.మీ వర్షం కురిసింది. రణస్థలం మండలం పైడిభీమవరంలో 49.5 మి.మీ, పాతపట్నం మండలంలో అత్యల్పంగా 0.5 మి.మీ వర్షం కురిసింది. చిత్తూరు, కర్నూలు, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది.



మెప్మా ఆర్‌పిల సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

మూడేళ్ల కాలపరిమతి జిఓ రద్దు చేయాలి

● మెప్మా ఆర్‌పిల సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెప్మా ఆర్‌పిలకు మూడేళ్ల కాలపరిమితి విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓను రద్దు చేయాలని, రూ.10 వేల వేతనం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. విజయవాడ ఎంబివికెలో జరిగిన ఎపి మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఆర్‌పిలకు కనీస వేతనం చెల్లించడం లేదని పేర్కొన్నారు. వారికి నిలిపేసిన మొబైల్ లాగిన్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి మాట్లాడుతూ.. ఆర్‌పిలపై మెప్మా అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారానికి రాబోయే కాలంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం వెలగపూడి సచివాలయంలో మెప్మా సమస్యలపై మంత్రి నారాయణకు వినతిపత్రం సమర్పించారు. ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, పద్మావతి, ఉమాదేవి, రేణుక, రమాదేవి, సంతోషి ఉష, శాంతి, అనూరాధ పాల్గొన్నారు.

'వర్సిటీ'లకు ఇన్‌ఛార్జి విసిలు

● ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకూ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ల (విసి)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ జిఓ 122ను గురువారం విడుదల చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుతం కొనసాగుతున్న విసిలు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ రాజీనామాలను ఆమోదిస్తూ సౌరబ్ గౌర్ విడివిడిగా ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి విసిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వ. స	యూనివర్సిటీ పేరు	విసి పేరు
1.	శ్రీవెంకటేశ్వర	చిప్పాడ అప్పారావు
2.	శ్రీకృష్ణదేవరాయ	బి అనిత
3.	ఆంధ్రా	గొట్టపు శశిభూషణ్ రావు
4.	ఆచార్య నాగార్జున	కంచర్ల గంగాధర్
5.	జెఎన్‌టియు అనంతపూర్	హెచ్ సుదర్శన్ రావు
6.	శ్రీపద్మావతి మహిళ	వి ఉమ
7.	జెఎన్‌టియు-జివి,	డి రాజ్యలక్ష్మి
8.	జెఎన్‌టియు కె	కెవిఎస్‌జి మురళీకృష్ణ
9.	ఆదికవి నన్నయ	వై శ్రీనివాసరావు
10.	విక్రమ సింహపురి	శరంగం విజయభాస్కర్ రావు
11.	కృష్ణా	ఆర్ శ్రీనివాసరావు
12.	రాయలసీమ	ఎన్‌టికె నాయక్
13.	ద్రవిడన్	ఎం దొరస్వామి
14.	వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్	జి విశ్వనాథ కుమార్
15.	ఆంధ్ర కేసరి	డివిఆర్ మూర్తి
16.	అబ్దుల్ హక్ ఉర్దూ	పటాన్ షేక్ షావల్లిఖాన్
17.	యోగి వేమన	కె కృష్ణారెడ్డి

రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలం

● బెంగళూరు నుండి తాడేపల్లికి వచ్చిన జగన్
● నేడు వినుకొండకు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన చేసిన పోస్ట్‌లో రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని, వైసిపిని అణగదొక్కాలన్న దృష్టితో దారుణాలకు దిగుతున్నారని ఆయన పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి నెలన్నర రోజుల్లోనే రాష్ట్రం హత్యలు, అత్యాచారాలు, రాజకీయ కక్షలతో చేస్తున్న దాడులు, విధ్వంసాలకు చిరునామాగా మారిపోయిందని వ్యాఖ్యానించారు. వినుకొండ హత్య ఘటన ఈ తరహా రాజకీయాలకు పరాకాష్టగా ఆయన అభివర్ణించారు. నడిరోడ్డుపై జరిగిన ఈ దారుణ కాండకు ముఖ్యమంత్రి సహా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కొద్దిరోజులుగా బెంగళూరులో ఉన్న ఆయన వినుకొండ సంఘటన నేపథ్యంలో హుటాహుటిన తాడేపల్లికి చేరుకున్నారు. వినుకొండలో రషీద్ హత్యతో పాటు పుంగనూరులో ఎంపి మిథున్‌రెడ్డి, మాజీ ఎంపి రెడ్డయ్యలపై జరిగిన దాడులను నాయకులతో సమీక్షించారు. శుక్రవారం ఆయన వినుకొండకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రోడ్డుమార్గం మీదుగా శుక్రవారం ఉదయం తాడేపల్లి నుండి గుంటూరు, నర్సారావుపేట బైపాస్‌ల మీదుగా జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండకు వెళ్లనున్నారు. హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని ఆయన పరామర్శించనున్నారు.

అరాచకాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ

● మోడీ అప్పాయింట్‌మెంట్ కోరుతూ ప్రధానికి జగన్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ 45 రోజుల్లో పెద్దఎత్తున హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని, ఈ హింసపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోడీకి జగన్ లేఖ రాశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రతిపక్షం వుండకూడదనే లక్ష్యంతో వైసిపి కార్యకర్తలపై దాడులను ముమ్మరం చేశారని తెలిపారు. ఈ 45 రోజుల్లో 31 మంది కార్యకర్తలు హత్యకు గురయ్యారని, మరో 35 మంది వేధింపులకు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. 2,700 కుటుంబాలను గ్రామాలనుండి తరిమేశారని, 560 ఘటనలలో ప్రైవేట్ ఆస్తులను ధ్వంసం చేశారని తెలిపారు. రాజంపేట ఎంపి, చిత్తూరు మాజీ ఎంపిపై దాడికి తెగబడ్డారని పేర్కొన్నారు. తనకు అనుకూలమైన నిర్ణయాలను అమలు చేసుకునేలా 27 మంది ఐఎఎస్‌లకు, 24 మంది ఐపిఎస్ అధికారులకు పోస్టింగ్‌లను ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో అరాచకాలను వివరించేందుకు అప్పాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆ లేఖలో కోరారు.

రేపు వైసిపి పార్లమెంటరీ సమావేశం

వైసిపి పార్లమెంటరీ సమావేశం తాడేపల్లిలోని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం జరగనుంది. జగన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఉదయం 10:30 గంటలకు పార్లమెంటు సభ్యులు, రాజ్యసభ సభ్యులు తాడేపల్లికి రావాలని వైసిపి కేంద్ర కార్యాలయం సమాచారం పంపింది. పార్లమెంటు సమావేశాల్లో వైసిపి ఎంపిలు రాష్ట్రానికి సంబంధించిన, లేవనెత్తాల్సిన అంశాలపై జగన్ దిశానిర్దేశం చేయనున్నారు.

నాగార్జున యాదవ్‌ను అరెస్టు చేయం

● హైకోర్టుకు పోలీసుల హామీ

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి అధికార ప్రతినిధి యనమల సాయి నాగార్జున అలియాస్ నాగార్జున యాదవ్‌ను తదుపరి విచారణ వరకు అరెస్టు చేయబోమని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. నాగార్జునపై నమోదైన కేసుల వివరాలతో కౌంటర్ వేస్తామని చెప్పారు.

దీంతో విచారణ ఈ నెల 25కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి గురువారం ప్రకటించారు. ఒక టివి చర్చలో సిఎం చంద్రబాబుపై నాగార్జున అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ నాగార్జున దాఖలు చేసిన కేసులో పోలీసుల హామీని న్యాయమూర్తి రికార్డుల్లో నమోదు చేశారు.

తెలంగాణలో రూ.లక్షలోపు రైతు రుణాలు మాఫీ

● 11.50 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,098 కోట్లు జమ
● ఆగస్టు చివరి నాటికి పూర్తి స్థాయిలో అమలు : సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ అవసరాల కోసం బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న రూ.లక్ష లోపు రుణాలు మాఫీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష లోపు రుణాలున్న 11.50 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.6.098 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం గురువారం జమ చేసింది. లక్షన్నర రూపాయల వరకు ఉన్న రుణాలను మరో రెండు వారాల్లో మాఫీ చేస్తారు. రెండు లక్షల రూపాయల వరకు రైతు రుణాలను ఆగస్టు చివరి నాటికి రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేయనుంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ తొమ్మిది మధ్య కాలంలో రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న వ్యవసాయ రుణాలకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుంది.

రుణమాఫీ నిధులను ఇతర అప్పులకు జమ చేసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్యాంకులకు స్పష్టంచేశారు. మాఫీ అయిన మొత్తాన్ని తిరిగి రైతులకు రుణంగా అందజేయాలని ఆయన సూచించారు. డా.బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి రుణమాఫీని లాంఛనంగా ప్రారంభించారు. మహిళా రైతులకు రుణమాఫీ చెక్కులను సిఎం రేవంత్ అందజేశారు. అనంతరం ఖమ్మం, నాగర్‌కర్నూల్, మెదక్, సంగారెడ్డి, ఆదిలాబాద్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో రైతు వేదికల్లోని రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఏకకాలంలో అమలు చేస్తుందని చెప్పారు. రూ.రెండు లక్షల వరకు రైతు రుణాల మాఫీకి రూ.31వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు జమ చేస్తుందని, వ్యవసాయ రుణాల మాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదనీ.. పట్టాదారు పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకు రూ.రెండు లక్షల వరకు రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేస్తుందని సిఎం స్పష్టంచేశారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

వీర జవాన్‌కు కడసారి వీడ్కోలు

ప్రజాశక్తి - నౌపడ (శ్రీకాకుళం)

దేశ రక్షణలో ప్రాణాలర్పించిన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన వీర జవాన్ నాయక్ డొక్కరి రాజేష్ (25) అంత్యక్రియలు అధికార లాంఛనాలతో ఆయన స్వగ్రామంలో గురువారం పూర్తయ్యాయి. వీర జవాను భౌతికకాయాన్ని జమ్మూ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నం తీసుకొచ్చారు. అక్కడ నుంచి ప్రత్యేక ఆర్మీ వాహనంలో స్వగ్రామానికి తెచ్చారు. కడసారి వీర సైనికుని భౌతికకాయాన్ని చూసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కోటబొమ్మాళి మండలం కొత్తపేట నుంచి సంతబొమ్మాళి మీదుగా ర్యాలీగా చెట్లతాండ్రకు తరలించారు. దారి పొడవునా జై జవాన్... రాజేష్ అమర్ రహే... భారత్ మాతకు జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన నివాసం నుంచి శ్మశానవాటిక వరకు నిర్వహించిన అంతిమయాత్రకు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విశ్రాంత సైనికులు, స్థానికులు, నాయకులు, అధికారులు తరలివచ్చి అమర జవాన్‌కు కడసారి వీడ్కోలు పలికారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి తదితరులు భౌతికకాయానికి నివాళులర్పించారు. అధికార లాంఛనాలతో ఆర్మీ సిబ్బంది, పోలీసులు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి మున్సిపల్ కార్మికుల వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల బకాయి జీతాలు, హెల్త్ అలవెన్స్ వెంటనే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణను ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు సచివాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. డిసెంబర్, జనవరిలో జరిగిన 17 రోజుల సమ్మె సందర్భంగా కుదిరిన ఒప్పందాలు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, త్వరితగతిన వీటిని పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమ్మెకాలం సందర్భంగా రూ.1000 కానుక, 17 రోజుల సమ్మెకాలం జీతం, ఇంజినీరింగ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులతోపాటు సమానంగా జీతభత్యాలు చెల్లించాలని కోరారు. విజయవాడ, విశాఖలో పనిచేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులు, పార్కుల్లో పనిచేసే కార్మికులకు జిఓ 36 ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. కరోనా సమయంలో నియమించిన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆప్కాస్‌లో చేర్చి జీతాలు చెల్లించాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్, ప్రమాద మృతులకు చెల్లించే ఎక్స్‌గ్రేషియో పెంపు తదితర అంశాలను పరిష్కరించాలని కోరారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

● టిడిపి కార్యాలయం గ్రీవెన్స్‌లో మంత్రి ఫరూఖ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ వద్దకు వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మైనార్టీశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ తెలిపారు. మంత్రి ఫరూక్, టిడిపి ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యాన టిడిపి కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం జరిగింది. పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను వారు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ.. వైసిపి నాయకుల అరాచకాలు, దోపిడీలపై ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. ప్రభుత్వం పరిష్కరించగల ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపి వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిది తప్పుడు ప్రచారం : రాజేష్

టిడిపి కూటమి ఆధ్వర్యాన జరుగుతున్న రాష్ట్రాభివృద్ధిని నాశనం చేయాలని వైసిపి తప్పుడు ప్రచారం మొదలు పెట్టిందని టిడిపి అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ విమర్శించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం వచ్చాక యువత భవిష్యత్‌పై కొత్త ఆశలు చిగురించాయని చెప్పారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. క్షణికావేశంలో జరుగుతున్న నేరాలను చంద్రబాబు ప్రభుత్వానికి రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అసిస్టెంట్ కమిషనర్ అక్రమాలపై విచారణ

● దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతికుమారిపై వచ్చిన ఆరోపణలపై విచారణ కొనసాగుతుందని, పూర్తి స్థాయిలో నివేదికలు తెప్పించుకొని తదుపరి చర్యల కోసం సిఎం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గడిచిన నాలుగేళ్లుగా దేవాదాయ, మున్సిపల్, రెవెన్యూ శాఖలకు చెందిన భూములు ఎంత మేరకు కోల్పోయామో అధికారులు విశ్లేషణ చేస్తున్నారన్నారు. పూర్తి స్థాయి నివేదికలు అందిన అనంతరం విచారణకు ఆదేశిస్తామని తెలిపారు. దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న శాంతికుమారిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. విశాఖపట్నంలో విజయసాయిరెడ్డి చేసిన ప్రతి రెవెన్యూ దందాలో రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ న్యాయవాది సుభాష్‌రెడ్డి, శాంతిల ప్రమేయం ఉందని, దీనిపై లోతుగా విచారణ చేయాల్సి ఉందని తెలిపారు.

కొడుకును చూసుకునేందుకు తండ్రికి అనుమతి

ప్రజాశక్తి-అమరావతి

తల్లిదండ్రుల ప్రేమ.. పిల్లల కనీస మానవ హక్కు అని హైకోర్టు చెప్పింది. తల్లిదండ్రుల మధ్య విభేదాలు ఉన్నంతమాత్రాన వాళ్ల ప్రేమను తల్లిదండ్రులకు దూరం చేయకూడదని చెప్పింది. తండ్రికి తన బిడ్డను చూసే అవకాశాన్ని కల్పిస్తూ తీర్పు చెప్పింది. ప్రతి ఆదివారం రెండు గంటలపాటు తన కొడుకుతో గడిపేందుకు తండ్రికి అనుమతినిస్తూ జస్టిస్ రవినాథ్ తిల్హారీ, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. కడప జిల్లాకు చెందిన లతీఫ్ పిటిషన్‌ను అనంతపురం జిల్లా కోర్టు గతంలో కొట్టేసింది. దీనిపై దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌లో తన భార్య, ఆమె తండ్రి తన కుమారుడిని కలుసుకునేందుకు అనుమతినివ్వాలన్న అనుబంధ పిటిషన్‌పై తుది ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్రిక్తతలు

మొదటి పేజి తరువాయి

నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా జిలాని అనే వ్యక్తి నరికి చంపాడు. మెడ, తల, చేతులను నరికివేశాడు. జిలాని టిడిపి కార్యకర్త అని వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఉద్రిక్తత నేపథ్యంలో పట్టణంలో పోలీసులు 144 సెక్షన్‌ను విధించారు. ఎస్‌పి సహా పోలీసు యంత్రాంగంతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోస్టుమార్టం పూర్తయ్యే వరకూ ఆస్పత్రి వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు మోహరించారు. మృతదేహాన్ని చూడ్డానికి వచ్చిన వారిని పరిమితంగానే అనుమతిస్తున్నారు. ప్రస్తుతం మృతుని ఇంటి వద్ద, పట్టణంలోనూ పోలీసులు బందోబస్తు కొనసాగుతోంది.

రాజకీయ కోణం లేదు : గుంటూరు రేంజ్ ఐజి , పల్నాడు ఎస్‌పి

ఈ హత్య వేనుక రాజకీయ కోణమేమీ లేదని, పాత, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిందని గురువారం విలేకరుల సమావేశంలో గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు చెప్పారు. గతంలో ఇరువురు వైసిపి నాయకుడు పిఎస్ ఖాన్ గ్రూపులో తిరిగేవారని, పరస్పర విద్వేషాలతో బయటకు వచ్చారు. గతంలో కూడా ఒకరి బైక్‌ను మరొకరు ధ్వంసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి రషీద్‌ను జిలాని హత్య చేశారని ఐజి, ఎస్‌పి చెప్పారు. నిందితుడితో పాటు మరో ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.



దీక్షల్లో కూర్చున్న సిఐటియు మద్దిలపాలెం జోన్ నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని ప్రధాని ప్రకటించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని ప్రధాని మోడీ ప్రకటించాలని సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు కోరారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 1209వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కానివ్వబోమని చెబుతున్నప్పటికీ కేంద్రంపై ఏ విధమైన ఒత్తిడీ తేవడం లేదన్నారు. సొంత గనులు, రా మెటీరియల్, బ్యాంకు రుణాలు ఇవ్వకుండా కర్మాగారాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్రలను కేంద్రంలోని మోడీ సర్కారు అమలు చేస్తోందన్నారు. ప్లాంట్‌లోని కాంట్రాక్ట్ వర్కర్లకు మూడు నెలల నుండి జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. శాశ్వత ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం వల్ల వారంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రయివేటీకరణను నిలిపివేస్తున్నట్టు ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో సంఘం జోన్ కోశాధికారి వి.కృష్ణారావు, నాయకులు కె.కుమారి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు అనపర్తి అప్పారావు, పిఎన్ఎం జిల్లా నాయకులు ఎం.చంటి, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

కొండ దిగితేనే వైద్యం

- గిరి శిఖర గ్రామాల్లో జ్వరాలు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- అందని వైద్యసేవలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలోని గిరి శిఖర గ్రామాల గిరిజనులకు వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. వైద్యం అందాలంటే సుమారు పది కిలోమీటర్ల దూరం నుంచి డోలీ మోతతో కొండల పైనుంచి మైదాన ప్రాంతమైన ఎస్.కోట ఆస్పత్రికి తరలించాల్సిన దుస్థితి నెలకుంటోంది. ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సిన వైద్య సిబ్బంది సైతం కానరవడం లేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గిరి శిఖర గ్రామాలైన దారపర్తి, మూలబొడ్డవర పంచాయతీల పరిధిలో గిరిజనులకు వైద్యం అందక డోలి మోతలతో కొండ పైనుండి మైదాన ప్రాంతానికి వచ్చి ఆసుపత్రులలో వెళ్లేసరికి వ్యాధి తీవ్రమై మృతి చెందిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

మండలంలోని గిరి శిఖర గ్రామాల్లో ఏటా జ్వరాలు, వ్యాధులతో మరణాలు సంభవిస్తున్నాయి. వైద్యసేవలు అందుబాటు లేకపోవడం వల్ల గిరిజనులు ఆర్‌పిఎంలను ఆశ్రయిస్తున్నారు. వారం పదిరోజులు వరకు తగ్గకపోతే డోలీలతో కొండ దిగువకు రోగులను మోసుకొచ్చి ఎస్.కోట ఆస్పత్రికి తరలిస్తుంటారు. ఈలోగా పరిస్థితి విషమించి రోగుల ప్రాణాలు పోతున్న పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఈనేపథ్యంలోనే మూలబొడ్డవర పంచాయతీ జిల్లోడులోవ గ్రామానికి చెందిన చిన్నారి చదరంపోతురాజు (3) మలేరియా బారినపడి మృతి చెందాడు.

మండలంలోని కొట్టాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా గిరిశిఖర గ్రామాల్లో ఎక్కువగా గిరిజనులు మరణాలు సంభవిస్తున్నా యనే ఉద్దేశంతో వారికి అందుబాటులో ఉండేలా బొడ్డవర పరిసర ప్రాంతంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. అందుకు మండలంలో 18 సచివాల యాలను విడదీసి 9 సచివాలయాల పరిధిలో గిరిశిఖర గ్రామాలను కలుపుతూ బొడ్డవర పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామాల వారికి వైద్యాన్ని అందించేందుకు అదనంగా ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఒక సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్, ఎఎన్ఎంలను నియమించినప్పటికీ వారు మైదాన ప్రాంతాల్లో హెల్త్ క్యాంపుల పేరుతో గిరిజనులను గాలికి వదిలేసారు దీంతో వర్షాకాలం మొదలైన తర్వాత గిరిజనులకు అవగాహన కల్పించే వారు లేక సుమారు 150 మంది వరకు జ్వరాల బారిన పడ్డారు. వైద్య సిబ్బంది గిరిశిఖర గ్రామాలకు వెళ్లకపోవడంతో ఇదే అదునుగా ఆర్ఎంపి డాక్టర్లు గిరిజనులకు వైద్యం పేరుతో దోచుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈనేపథ్యంలో కొంతమంది రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదించగా మరి కొతమంది పట్టణంలో ఏరియా ఆసుపత్రికి వచ్చి చేరుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు చిట్టెంపాడు, గూనపాడు గ్రామాలలో వరస మరణాలు సంభవించడంతో ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు ఆ గ్రామాల్లో పర్యటించారు. మరో రెండు నెలల తర్వాత మరొక మరణం సంభవించడంతో డిఎంఅండ్‌హెచ్ పర్యటించారు. అయినప్పటికీ ఈఏడాది రెండుసార్లు మాత్రమే గిరిజన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. తరువాత గిరి శిఖర గ్రామాల వైపు కన్నెత్తి చూసే వైద్యుడే లేకపోవటంతో దారపర్తి, మూలబొడ్డవర గ్రామాల్లో గిరిజనులు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ విష జ్వరాల బారిన పడుతున్నారు. అధికారంలోకి రాకముందు చంద్రబాబు నాయుడు ఎస్.కోటలో జరిగిన సభలో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని, చిట్టెంపాడులో వరుస మరణాలు విచారకరమని అన్నారు. తాజాగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజ శిఖర గ్రామాలకు వైద్యసేవలు అందించాలని గిరిజనులు కోరుతున్నారు.

వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

మండలంలోని గిరిజన గ్రామాల్లో వ్యాధులు, జ్వరాలు ఉన్నందున వెంటనే అధికారులు స్పందించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలి. జిల్లేడులోవల తాగునీరు లేకపోవడంతో గిరిజనులంతా కలుషిత నీటిపైనే ఆధారపడు తున్నారు. దీంతో జ్వరాల బారినపడుతున్నారు. . వైద్య సిబ్బంది కూడా గ్రామాలకు వెళ్లడం లేదు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులకు తక్షణం అవగాహన కల్పించాలి.

మద్దిల రమణ, సిపిఎం నాయకుడు

బొడ్డవరలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

గిరి శిఖర గ్రామాలకు కొండ దిగువన ఉండే బొడ్డవర ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు, ఐటిడిఎ పిఒకు చాలాసార్లు వినతులు ఇచ్చాం. అనారోగ్యం బారినపడి గిరిజనులు ప్రాణాలు పోతుంటే నాయకులు, అధికారులు సానుభూతి చూపిస్తున్నారు తప్ప సమస్య పరిష్కారానికి ప్రయత్నించటం లేదు. వెంటనే గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.

పిన్నెల్లికి బెయిల్ నిరాకరణ

ప్రజాశక్తి-గుంటూరు లీగల్ : రెండు హత్యాయత్నం కేసుల్లో అరెస్టు అయ్యి రిమాండ్‌లో ఉన్న పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌ను గుంటూరు జిల్లా నాలుగో అదనపు న్యాయస్థానం తోసిపుచ్చింది. మే 13న ఎన్నికల పోలింగ్ రోజున టిడిపి ఏజెంటు నంబూరు శేషగిరిరావు, కారంపూడి సిఐ నారాయణ స్వామిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడుగా ఉన్న పిన్నెల్లి దాఖలు చేసిన బెయిల్ పిటీషన్లను న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు కొట్టివేశారు. ఈ కేసుల్లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన హైకోర్టు న్యాయవాది అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. రామకృష్ణారెడ్డికి బెయిల్ ఇస్తే దర్యాప్తునకు అవరోధం కల్పిస్తారని, సాక్షులను ప్రభావితం చేస్తారని వాదించారు.

ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి -తిరుమల

టిటిడి ఎస్‌వి అన్నప్రసాదం ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళం అందాయి. బెంగళూరుకు చెందిన ఎబియం ఇన్‌ఫ్రాటెక్ అధినేత ఎస్.ఎన్.బ్యాటేగౌడ ఈ విరాళం చెక్కును తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో ఇఒ జె.శ్యామలరావుకు అందజేశారు.

12వ రోజూ లభించని ఆచూకీ

- బాలిక కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

ప్రజాశక్తి - పగిద్యాల

నంద్యాల జిల్లా ఎల్లాల గ్రామానికి చెందిన బాలిక వాసంతి అదృశ్యమై నేటికీ 12 రోజులు కావస్తున్నా ఆచూకీ లభించలేదు. గురువారం బాలిక కోసం ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఎత్తిపోతల పథకం పంప్ హౌస్, ర్యాంపు సమీపం, సంగమేశ్వరం సమీపాన కృష్ణానదిలో పోలీస్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. 'మా బాలిక ఉందో లేదో తెలియడం లేదు. ఉంటే కనీసం మృతదేహమైనా అప్పజెప్పండి. దహన సంస్కారాలు చేసుకుంటాం' అని వాసంతి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొగ్గుబావుల వేలం రద్దు చేయాలి

- తెలంగాణ రాజ్‌భవన్ ముట్టడికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి బొగ్గుబావుల ప్రయివేటీకరణకు నిరసనగా కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు గురువారం చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఖైరతాబాద్ మెట్రోస్టేషన్, నెక్లెస్‌రోడ్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ నుంచి ప్రదర్శనగా రాజ్‌భవన్‌కు బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టు చేశారు. కనీసం రాజ్‌భవన్ వద్దకొచ్చి నిరసన తెలియజేసే అవకాశం కూడా ఇవ్వలేదు. ఖైరతాబాద్, నెక్లెస్‌రోడ్ వద్ద దొరికిన వారిని దొరికినట్టుగా అరెస్టు చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షులు జి రాంబాబుయాదవ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సీతారామయ్య, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేశ్, కూరపాటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె ఈశ్వర్‌రావు, కోశాధికారి వంగూరు రాములును పోలీసులు అరెస్టు చేసి ముషీరాబాద్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, బేగంపేట, గోషామహల్ పోలీసు స్టేషన్లకు తరలించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం పెట్టడాన్ని ఖండించారు. దాన్ని సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని బొగ్గు బావులను సింగరేణికే కేటాయించే వరకూ ఐక్యంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

తెలంగాణలో డిఎస్‌సి పరీక్షలు ప్రారంభం

- మొదటిరోజు 82 శాతం హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డిఎస్‌సి) రాత పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సారిగా ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సిబిఆర్‌టి)లో ఈ పరీక్షలను పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్నది. గురువారం మొదటిరోజు తొలివిడతకు 13,824 మంది, రెండో విడతకు 13,944 మంది దరఖాస్తు చేశారు. వారిలో సుమారు 82 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్టు తెలిసింది. ఈ పరీక్షలు వచ్చేనెల ఐదో తేదీ వరకు జరుగుతాయి. డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీఎస్సీకి 2,79,957 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సెప్టెంబర్‌లో డీఎస్సీ ఫలితాలను విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

కూతురిపై తండ్రి లైంగిక దాడి

- మేడిపల్లి పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. జీవితాంతం రక్షణగా ఉండాల్సిన కన్న తండ్రే కుమార్తెపై దారుణానికి ఒడిగట్టాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లిలోని సాయినగర్‌లో ఓ వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న అతని కూతురు ఇటీవల ఇంటికి వచ్చింది. అయితే, బుధవారం రాత్రి ఇంట్లో తల్లి లేని సమయంలో బాలికపై తండ్రి లైంగికదాడి చేశాడు.

విషయం పక్కింటి మహిళకు తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

పోలీసుల కళ్లుగప్పి ఖైదీ పరారీ

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ఎస్కార్ట్ పోలీసుల కళ్ళుగప్పి రిమాండ్ ఖైదీ పరారైన సంఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండల పరిధిలోని రాయవరం రైల్వే స్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా గుత్తి మండలం టి.కొత్తపల్లికి చెందిన నరేష్ గంజాయి రవాణా కేసులో పోలీసులకు పట్టుబడ్డాడు. గుత్తి, గుంతకల్లులోని పోలీసు స్టేషన్‌లలో గంజాయి, చోరీ కేసులు నమోదయ్యాయి. ఓ కేసు వాయిదా నిమిత్తం విశాఖ నుంచి అనంతపురానికి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో పోలీసులు తీసుకొస్తున్నారు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ప్రకాశం జిల్లా మార్కాపురం వద్ద పోలీసులు కళ్లుగప్పి తప్పించుకున్నాడు. ఖైదీ పరారైన విషయం తెలుసుకున్న పోలీసులు గిద్దలూరు పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. నిందితుడి స్వగ్రామమైన అనంతపురం జిల్లా ఉరవకొండలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సంపాదకీయం

నాణ్యత లేని చదువు

భారతదేశంలో విద్య నాణ్యతా ప్రమాణాలు దారుణంగా దిగజారుతున్నాయని ఐక్యరాజ్య సమితి బాలల సంక్షేమ విభాగం- యునిసెఫ్ తన తాజా నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు సాధారణ కూడికలు చేయలేకపోతున్నారని, సొంత భాషలో వాడుకలో ఉన్న పదాలను సైతం రాయలేకపోతున్నారని పేర్కొంది. ప్రాథమిక పాఠశాలల్లో చేరే విద్యార్థులు నేటికి 95 మంది ఉంటే- అక్కడ విద్యను పూర్తి చేయకుండానే 49 శాతం మంది ఇంటిముఖం పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. 6 - 14 సంవత్సరాల వయస్సున్న బాల బాలికలందరికీ ఉచిత నిర్బంధ విద్య గురించి 2009 నాటి విద్యాహక్కు చట్టం ఉద్ఘోషిస్తున్నా- అందరికీ విద్య అనేది ఇంకా అందని ద్రాక్షగానే ఉంది.

విద్యకు, పిల్లలకు మధ్య అంతర రేఖ అంతకంతకూ పెరగటం వెనుక అనేక సామాజిక, ఆర్థిక, భౌగోళిక కారణాలు ఉన్నాయి. ఒక్కొక్క కారణాన్ని విశ్లేషించి, అడ్డంకులను తొలగించటానికి, అవసరమైన చర్యలు తీసుకోవటానికి ప్రభుత్వాలు ప్రణాళి కాబద్ధంగా పనిచేయాలి. తగిన పథకాలతో, ప్రయత్నాలతో అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలి. స్వాతంత్ర్యానంతర కాలంలో కొంతలో కొంత అలాంటి ప్రయత్నం జరిగి, ప్రభుత్వ రంగంలో విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయి. భోజన వసతి సదుపాయాలతో కూడిన విద్యాబోధన ఎందరో సామాన్య బాలబాలికలు విజ్ఞానవంతులు కావటానికి దోహదపడింది. జనాభా పెరుగుతున్నకొద్దీ అలాంటి వసతులను మరింతగా పెంచటానికి బదులు ఉన్న వాటిని మూత వేసే వినాశక విధానాలు ఇప్పుడు అమలవుతున్నాయి.

90వ దశకం ఆరంభంలోనే మన పాలకులు తీసుకొచ్చిన ఉదార ఆర్థిక విధానాలు ప్రభుత్వ విద్యకు గండి కొట్టి, ప్రయివేటు విద్యకు పాదులు తీశాయి. తగిన సదుపాయాలు కల్పించకుండా, ఏళ్ల తరబడి ఉపాధ్యాయులను నియమించకుండా ప్రభుత్వ విద్యాసంస్థలను పాలకులు నిర్వీర్యం చేశారు. మార్కులకు, ర్యాంకులకు, మంచి భవిష్యత్తుకూ ప్రయివేటు విద్యాసంస్థలే సమర్థవంతమైనవని ఊదరగొట్టారు. తొలుత ధనిక కుటుంబాలు, తదుపరి మధ్య తరగతి కుటుంబాలూ తమ పిల్లలను ప్రయివేటుకు తరలించటం; చూస్తుండగానే రెండు, మూడు ప్రయివేటు విద్యాసంస్థలు కార్పొరేటు విద్యా సామ్రాజ్యాలుగా విస్తరించటం జరిగిపోయింది! చదువంటే సైన్సు, చరిత్ర, సామాజిక శాస్త్రాలు కాదని; విదేశాలకు తరలించుకుపోయే ఇంజినీరింగులు, టూరిజాలే గొప్పవని విస్తారమైన ప్రచారంతో మామూలు చదువులు మసిబారిపోయాయి! మాతృభాషలో విద్యాబోధన అభ్యాసనా వికాసానికి దోహదపడుతుందని అనేక అధ్యయనాలు, నివేదికలూ అరచి గీపెట్టినా ప్రాథమిక దశలోకే ఆంగ్లమాధ్యమం ప్రవేశించేసింది! పర్యవసానంగా ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు దిగజారిపోయాయి. అవగతానికి అవకాశం ఇవ్వని భాషా మాధ్యమం, ఇంగ్లీషు వస్తే చాలునన్న సామాజిక వాతావరణం ... లెక్కలు చేయడం, తప్పుల్లేకుండా రాయడం వంటి అభ్యాసాలకు గండి కొడుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని కేంద్ర, రాష్ట్ర విద్యాసంస్థల్లో స్థానిక ఉపాధ్యాయులను కాక బయటివారిని నియమించటం కూడా నష్టం చేస్తోంది. సొంత భాష, స్థానీయత లోపించటం వల్ల పాఠాలు అర్థం కాని పిల్లలు మధ్యలోనే చదువు మానేస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

బిజెపి అధికారంలోకి వచ్చాక విద్య కాషాయీకరణ పెరిగింది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే పాఠాలను తొలగించి, సంకుచిత భావాలను ప్రేరేపించే అధ్యాయాలను జోడిస్తూ పోతోంది. బాలల్లో సహజంగా ఉరకలెత్తే తార్కిక శక్తికి ఊతమివ్వడం కాకుండా నిరర్థక భావోద్వేగాలతో బుర్రలను నింపే ప్రయత్నాలు సాగిస్తోంది. విశాల భావాలతో విలసిల్లాల్సిన విశ్వ విద్యాలయాలను కాషాయ రాజకీయాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగితే- యునిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసినట్టు ప్రాథమిక, మాధ్యమిక స్థాయిల్లోనే కాదు; ఉన్నత విద్యా వ్యవస్థల్లోనూ నాణ్యతా ప్రమాణాలు ఘోరంగా దిగజారిపోయే ప్రమాదం ఉంది. మేధావులు, విద్యార్థి యువజన సంఘాలు, బాధ్యతాయుతులైన పౌరులూ నాణ్యమైన విద్య కోసం గొంతెత్తాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కడికక్కడ ఉపాధ్యాయ నియామకాలను జరిపి, సదుపాయాలను పెంచి, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి.

మంచి మాట



ఉన్నత విద్యకు ప్రాధాన్యమిస్తేనే భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది.
- మోక్షగుండం విశ్వేశ్వరయ్య

పోలవరం నిర్వాసితులకు న్యాయం దక్కేనా?

విమర్శ



ఐ. వెంకటేశ్వరరావు

కేంద్రంలో మో-షా 3.0, రాష్ట్రంలో చంద్రబాబు 2.0 పాలన నడుస్తున్న క్రమంలో మళ్ళీ పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితులకు దక్కాల్సిన న్యాయం గురించిన చర్చ జరుగుతున్నది. పారిశ్రామిక ప్రాజెక్టులు అయినా, నీటి ప్రాజెక్టులైనా, ప్రాజెక్ట్ పూర్తయినా, కాకున్నా నిర్వాసితుల సమస్యలు దశాబ్దాల తరబడి పరిష్కారం కావడం లేదనేది వాస్తవం. ఆదివాసీలు, పేద రైతులంటే ప్రభుత్వాలకు అంత చిన్న చూపు.

గత ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి పాలనలో శాసన మండలిలో పిడిఎఫ్ సభ్యులుగా ఉన్న మేము పోలవరంపై ఎన్నో ప్రశ్నలు వేశాము. లఘు చర్చలు జరగాలన్నాము. కె.ఎస్. లక్ష్మణరావు ప్రాజెక్టు గురించి మాట్లాడిన ప్రతి సందర్భంలో నిర్వాసితుల సమస్యలు ఎలుగెత్తి చాటారు. పాలకపక్షం, ప్రతిపక్షం ఎవరికి వారు పోలవరంపై వారి వారి లెక్కలు, గొప్పలు చెప్పుకోవడం, తప్పుడు సమాచారాలు చెప్పడం, ప్రాజెక్టు నిర్మాణం గురించి తప్ప నిర్వాసితుల సమస్యలు పట్టించుకోలేదు. పాలకపక్షం, ప్రతిపక్షం, కేంద్ర ప్రభుత్వాలు (2004-2024) 20 ఏళ్ల కాలంలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఓట్ల మాటలన్నీ ఏట్లో కలిసిపోయాయి. వై.యస్. రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం పేరు చెప్పి 'పోలవరం నా కల' అని ప్రాజెక్టు లేకుండానే కాలువలు తవ్వి వెళ్లిపోయారు. కేంద్రం నుండి ప్రాజెక్టు నిధులు రాబట్టి నిర్మాణం చేయాల్సి ఉండగా కేంద్రంతో రాజీ పడి విభజన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కొంత రాష్ట్ర నిధుల ఖర్చు చేసి 70 శాతం పూర్తి అయిపోయిందని ప్రజలను, విద్యార్థులను పోలవరం చూసిరండని పంపించారు. పోలవరం అంటేనే మా అయ్య కలని, నేనే పోలవరం పూర్తి చేస్తానని రివర్స్ టెండరింగ్ చేసి బడ్జెట్ కేటాయింపులు చేయకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు వెళ్తున్నట్లు నమ్మబలకడంలోనే జగన్ మోహన్ రెడ్డి పాలన గడిచిపోయింది. కాంట్రాక్టర్లు బాగుపడ్డారు. వీరి ముడుపులు పొందిన ప్రభుత్వ పెద్దలు బాగానే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎవరైనా పోలవరం అంటే ప్రాజెక్టు నిర్మాణమేనని ప్రజలను కూడా అలాగే నమ్మిస్తున్నారు. ప్రాజెక్టు వలన ప్రయోజనం పొందే వారి గురించే గొప్పలు చెబుతున్నారు. ప్రాజెక్టు కోసం లక్షల ఎకరాల భూమి వదులుకుంటున్న ప్రజల గురించి, వారి న్యాయమైన పరిహారం గురించి, భూమి గురించి, వాళ్ళ కాలనీల వసతుల గురించి, దీనికి అవసరమైన నిధుల గురించి లెక్కలు కచ్చితంగా చెప్పడం లేదు. ఖర్చు అంచనా లేదు. నిర్వాసితులను తక్కువగా చూపించడం, పరిహారం లెక్కలు తప్పు చెప్పడం, చివరకు తక్కువ బడ్జెట్ కేటాయింపులు చేస్తున్నారు. నిర్వాసితులకు పరిహారమే ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రధాన భాగమనే సోయ పాలకుల మాటల్లో, చేతల్లో కనిపించడం లేదు. ప్రకృతి ప్రతి ఏటా వరదలతో అటవీ ప్రాంతాన్ని, ఆదివాసులను నిండా ముంచుతుంది. పాలకులు కూడా నిర్వాసితులను నిలువునా ముంచుతున్నారు.



విభజన చట్టం హామీ మేరకు కేంద్రం నిధులు ఇవ్వాలి. రాష్ట్రం నిధులు రాబట్టాలి. ముందు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి ప్రాజెక్టు పూర్తి చేయాలి. పోలవరం ప్రాజెక్టు ఆదివాసీ నిర్వాసితులకు పరిహారం న్యాయంగా చెల్లించాలి. నిపుణుల కమిటీ వేసి నిజాలు వెల్లడించాలి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిని విచారించి చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టు నిర్మాణం ఖర్చు మొత్తం కేంద్రమే భరించాలి.

ఎంత కష్టం? ఎంత నష్టం?

వి.ఆర్. పురం, కూనవరం, చింతూరు, ఎటపాక, కుక్కునూరు, దేవిపట్నం, పోలవరం, భద్రాచలంతో పాటు, ఒరిస్సా, చత్తీస్‌గఢ్‌లలో సుమారుగా 270 గ్రామాలు, ఈ మొత్తం మండలాలనే ఈ ప్రాజెక్టు ముంచుతుంది. దీనివల్ల గోదావరి, శబరి, వాగులు, వంకలు, కొండలు అడవులు, సారవంతమైన నేలలు, అన్ని రకాల పంటలు, చెట్లు, 1400 మిల్లీమీటర్ల వర్షపాతం, ఔషధ మొక్కలు మొత్తం జీవావరణాన్ని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తుంది. ఎనిమిది వేల రిజర్వ్ అడవులు, సుమారు 270 గ్రామాలు, 2,70,000 మంది నిర్వాసితులు, 650 చదరపు కిలో మీటర్ల షెడ్యూలు ప్రాంతం, లక్ష ఎకరాల భూమి కనుమరుగవుతున్నాయి. ఇంత విధ్వంసంతో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు ఆపాలని ఆలోచనలు, ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఒకరిని తేల్చడం కోసం మరొకరిని ముంచాలా అనే ప్రశ్నలు వచ్చాయి. ప్రాజెక్ట్ మొత్తం పూర్తి చేయడానికి ఎన్ని వేల కోట్ల రూపాయల ఖర్చు అవుతుందో, ఎన్ని దశాబ్దాలు పడుతుందో తెలియదు. నా ఐదేళ్ళ కాలంలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని ఏ పాలకుడు గొప్పలు చెప్పినా వెర్రితనమే.

500 టిఎంసీల భారీ నీటి సామర్థ్యం, సుమారు 180 కిలోమీటర్ల ఎడమ కాలువ ద్వారా తూర్పు గోదావరి నుండి విశాఖ వరకు 150 టిఎంసిల నీరు, కృష్ణా జిల్లాలో సుమారు 500 గ్రామాలకు తాగునీరు, రమారమి 1000 మెగావాట్ల జల విద్యుత్ ప్రయోజనాల కోసం ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు.

ఆదివాసీల భూములంటే అంత అలుసా?

విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని నిర్మాణం కోసం 30 వేల ఎకరాల భూమి ఇచ్చిన రైతుల గురించి గొప్పగా చెబుతారు. గొప్పగానే చెప్పాలి కూడా. మైదాన ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రజల అవసరాల కోసం, రాజధాని రింగ్ రోడ్, రైల్వే లైన్లు, రహదారులు, పేదల ఇళ్ల స్థలాల కోసం, ఆసుపత్రుల కోసం...చంద్రబాబు నాయుడు, జగన్ మోహన్ రెడ్డి ఎకరాకు రూ. ఎన్ని లక్షలు లెక్క కట్టి పరిహారం చెల్లించారు? ఎకరా రూ. నలభై లక్షలు, ఆ పైన సొమ్ముల పరిహారం చెల్లించిన ఈ పాలకులకు ఆదివాసీ అడవి భూములు అంటే అంత అలుసా? ఆదివాసీ అడవి భూములకు రూ. రెండు లక్షల నుండి 5 లక్షల పరిహారం నిర్ణయించి చెల్లిస్తామని చెప్పడం అన్యాయం, అపహాస్యం, వివక్ష కాదా?

రాష్ట్ర ప్రయోజనాల కోసం తరతరాలుగా అనుభవిస్తున్న భూమి, చెట్లను... సంస్కృతి, చరిత్రను...త్యాగం చేస్తున్న ఆదివాసులకు ఎంత పరిహారం ఇవ్వాలి మరి? 20 ఏళ్ల క్రితం నిర్ణయించిన రేట్లే నేడు చెల్లిస్తారా? వీళ్ళందరికీ భూమికి భూమి ఇవ్వగలరా? కోల్పోయిన భూమికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూమిపై అదే ఆదాయం వస్తుందా? ఆర్ అండ్ ఆర్ కాలనీలకు వసతులను ఎప్పటికీ పూర్తి చేస్తారు? 20 ఏళ్లుగా మా భూమి ఎక్కడ? మా నివాసాలు ఎక్కడ? మా బిడ్డల భవిష్యత్తు ఏమిటని ఆందోళన చెందుతున్న ఆదివాసీలకు ఈ పాలకులు ఏం భరోసా ఇస్తారు? ఇదీ ఆదివాసీల ఆందోళన. ఈ ప్రాజెక్టుతో ఒనగూడే ప్రయోజనాల కోసం ఇంతగా త్యాగం చేస్తున్న, కోల్పోతున్న ఆదివాసీలకు భూమి, పునరావాసం, నష్టపరిహారం న్యాయంగా నిర్ణయించాలి. ప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రంలో ఈ ఊసే లేకపోవడంతో తమకు ఇచ్చిన హామీలు నెరవేరుతాయా అని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్యం అనంతరం ఆదివాసీ గూడేలు, జీవన విధానం పరిశీలిస్తే గుండె తరుక్కుపోతుంది.

> **"రాష్ట్ర ప్రయోజనాల కోసం తరతరాలుగా అనుభవిస్తున్న భూమి, చెట్లను... సంస్కృతి, చరిత్రను...త్యాగం చేస్తున్న ఆదివాసీలకు ఎంత పరిహారం ఇవ్వాలి మరి? 20 ఏళ్ల క్రితం నిర్ణయించిన రేట్లే నేడు చెల్లిస్తారా? వీళ్ళందరికీ భూమికి భూమి ఇవ్వగలరా? కోల్పోయిన భూమికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన భూమిపై అదే ఆదాయం వస్తుందా? ఆర్ అండ్ ఆర్ కాలనీలకు వసతులను ఎప్పటికీ పూర్తి చేస్తారు? 20 ఏళ్లుగా మా భూమి ఎక్కడ? మా నివాసాలు ఎక్కడ? మా బిడ్డల భవిష్యత్తు ఏమిటని ఆందోళన చెందుతున్న ఆదివాసీలకు ఈ పాలకులు ఏం భరోసా ఇస్తారు? ఇదీ ఆదివాసీల ఆందోళన. ఈ ప్రాజెక్టుతో ఒనగూడే ప్రయోజనాల కోసం ఇంతగా త్యాగం చేస్తున్న, కోల్పోతున్న ఆదివాసీలకు భూమి, పునరావాసం, నష్టపరిహారం న్యాయంగా నిర్ణయించాలి. ప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రంలో ఈ ఊసే లేకపోవడంతో తమకు ఇచ్చిన హామీలు నెరవేరుతాయా అని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు."**

ఒక ప్రాజెక్టు నిర్మాణం కోసం 30-50 ఏళ్ల కాలం పట్టేటప్పుడు, ప్రజల పన్నుల సొమ్ముతో కట్టేటప్పుడు ఎవరి పాలనలో పూర్తయిందని ఈ పాలకులు గొప్పలు చెప్పుకుంటారు? విభజన చట్టం హామీ మేరకు కేంద్రం నిధులు ఇవ్వాలి. రాష్ట్రం నిధులు రాబట్టాలి. ముందు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి ప్రాజెక్టు పూర్తి చేయాలి. పోలవరం ప్రాజెక్టు ఆదివాసీ నిర్వాసితులకు పరిహారం న్యాయంగా చెల్లించాలి. నిపుణుల కమిటీ వేసి నిజాలు వెల్లడించాలి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిని విచారించి చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్టు నిర్మాణం ఖర్చు మొత్తం కేంద్రమే భరించాలి.

/ వ్యాసకర్త పిడిఎఫ్ ఎమ్మెల్సీ /

అభిప్రాయం



శబ్ద కాలుష్యంతో ప్రాణాపాయం

ఆధునిక పట్టణాలు శబ్ద కాలుష్య కేంద్రాలుగా మారుతున్నాయి.

శబ్ద తీవ్రతను కొలవడానికి డెసిబుల్ (డిబీ) అనే ప్రమాణాలను వినియోగిస్తారు. నివాస ప్రాంతాల్లో సాధారణంగా 50 డిబీ శబ్ద స్థాయి ఉంటుంది. ఐరాస నిర్వచనం ప్రకారం 65 డెసిబుల్స్ శబ్ద స్థాయి దాటితే శబ్ద కాలుష్యానికి దారి తీస్తుంది. శబ్ద తీవ్రత లేదా స్థాయి 85 డెసిబుల్స్ దాటితే హానికారక ప్రతికూల ప్రభావాన్ని చూపుతూ శబ్ద కాలుష్యానికి కారణం అవుతుంది. దీర్ఘకాలం పాటు శబ్ద కాలుష్య ప్రాంతాల్లో జీవించిన మానవులు, జంతువుల వినికిడి వ్యవస్థలు, సాధారణ ఆరోగ్యంపై తీవ్ర ప్రమాదకర ప్రభావాన్ని చూపుతుంది. శబ్ద కాలుష్యంతో హృదయ సంబంధ సమస్యలు, కరోనరీ ఆర్టరీ వ్యాధులు, ప్రవర్తనపై ప్రతికూల ప్రభావం, పిల్లలు/వృద్ధుల్లో శాశ్వత వినికిడి లోపం, చెవులు దెబ్బతినడం, నిద్రా భంగం, పని తీరుపై దుష్ప్రభావం, అధిక రక్తపోటు, పల్స్ రేటు పెరగడం, గుండె పోటు, తలనొప్పి, ఉత్పాదకత కోల్పోవడం, మానసిక ఒత్తిడి పెరగడం, త్వరగా అలసి పోవడం, హృదయ స్పందన పెరగడం, శ్వాస సంబంధ ఇబ్బందులు, ఆందోళన/చికాకు, ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి తగ్గడం లాంటి పలు అనారోగ్య ప్రభావాలు కనిపిస్తాయి.

ఇంట్లో వాడే ఎలక్ట్రానిక్ పరికరాలను తక్కువగా వాడడం, యంత్రాలు వాడిన సందర్భాల్లో తలుపు మూసివేయడం, చెవుల్లో ప్లగ్గులు లేదా దూది వాడడం, సౌండ్ తగ్గించడం, శబ్దానికి దూరంగా ఉండడం, నివాస ప్రాంతాల్లో చెట్లను పెంచడం, పరిమితిలో శబ్దాలను వాడడం, శబ్దాలను గ్రహించే మెషినరీ వాడడం, యంత్రాలకు తరుచుగా గ్రీస్ రాయడం, సైలెన్సర్లను తప్పనిసరిగా బిగించడం, శబ్ద కాలుష్యాన్ని కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం, శబ్ద స్థాయిని తరుచుగా కొలవడం, సౌండ్ ప్రూఫ్ కర్టెన్లు వాడడం, అవగాహన కల్పించడం, సక్రమంగా చట్టాల అమలు, సౌండ్ ప్రూఫ్ నిర్మాణాలు చేపట్టడం, తక్కువ సౌండ్‌తో ఇయర్ ఫోన్లు వాడడం, లౌడ్ స్పీకర్లను నియంత్రించడం లాంటి పలు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరమని భావించాలి శబ్ద కాలుష్యాన్ని నిర్లక్ష్యం చేస్తే శాశ్వత నిశ్శబ్ద సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని తెలుసుకోవాలి. రెండు గంటల పాటు తీవ్రమైన శబ్దాలను విన్న వ్యక్తులు తప్పనిసరిగా 16 గంటలు శబ్దాలు లేని ప్రాంతాల్లో గడపాలి. ఆసుపత్రులు, విద్యాలయాలు, కోర్టులు లాంటి ప్రదేశాలను 'సైలెన్స్ జోన్స్'గా ప్రకటించి ఆచరణలో పెట్టాలి.

పెళ్ళిళ్ళు, జాతరలు, పూజలు, శుభ అశుభ సామాజిక కార్యక్రమాల సందర్భాల్లో అధిక శబ్దాలను వెదజల్లే డిజే (డిస్క్ జాకీ) మోతలతో మానవ, జంతు ఆరోగ్యాలపై సత్వరమే దుష్ప్రభావం కలుగుతుంది. డిజే మోతలను భరించలేక వెంటనే కుప్పకూలిపోయి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలను ఎక్కువగానే చూస్తున్నాం. దేశవ్యాప్తంగా డిజే మోతలు పరిమితులు దాటి పోతుండడం తీవ్ర భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. శబ్దానికి గుండె పోటుకు, చెవికి గుండెకు విడదీయరాని సంబంధం ఉంటుంది. డిజే శబ్దాల మోతలతో గుండె వేగంగా కొట్టుకోవడం, మెదడుపై తీవ్ర ప్రభావం చూపడం, స్ట్రోక్‌లు, మానసిక కల్లోలం, అసహనం/భయం/ఆందోళనలు పెరగడం, ఒత్తిడి, వినికిడి కోల్పోవడం, దృష్టి లోపం, నిద్ర లేమి, మాట తడబడడం, తీవ్రమైన తలనొప్పి, నరాల బలహీనత లాంటి అనారోగ్యాలు కలుగుతాయి. డిజే సౌండ్లతో వన్య ప్రాణులు, సాధు జంతువులు కూడా తీవ్ర అనారోగ్యానికి కారణం అవుతాయి.

సంతోషంగా నిర్వహించుకునే సామాజిక కార్యక్రమాలు మన ప్రాణాలను హరించేలా వుండకూడదు. చావుకు, పుట్టుకకు ఒకే రకంగా డిజే సౌండ్లు వాడుతూ, మన ప్రాణాలను మనమే ప్రమాదంలోకి నెట్టుకుంటున్నాం. నేడు అనుభవించిన శబ్ద కాలుష్యం రేపటి ఆరోగ్యాన్ని హరించవచ్చని తెలుసుకుందాం. మన ప్రాణాలను తీసే తీవ్రమైన సౌండ్లు మనకు వద్దు. శబ్దాలను జీవకోటి ఆరోగ్య ప్రదాతలుగా మార్చుకుందాం. అనవసర శబ్దాలను ఆమడ దూరంలో పెడదాం.

- డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్: 9949700037

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

కవిత్వం

అసలు కారణం

వ్యవస్థలో భద్రత కరువైనప్పుడు
బాధలతో బతుకు బరువెక్కినప్పుడు
ఉపాధి లేక ఆదాయం కానక
పొయ్యిలో పిల్లి తొంగున్నప్పుడు
మిన్నంటిన ధరల వల్ల
అటకెక్కిన తిండి గింజలు
అందక ఉసురు తీస్తున్నప్పుడు
ముసురుకున్న రోగాలు
ఇంటిని వొంటిని గుల్ల చేస్తున్నప్పుడు
ఏం చేయాలో తెలియని అశక్తత...
దారి తెన్నూ కానని అసహాయత...
ఓదార్పును సైతం ఆవిరి చేస్తున్నప్పుడు
దైన్యం నిండిన బతుకుల నుదుట
మరణ శాసనం లిఖిస్తున్నప్పుడు
అప్పుడు మొదలవుతుంది
దొంగ బాబాల చొరబాటు
దాస్యము, దాసోహమూ,
రెంటికీ పడుతుంది అక్కడనే బీజం
నషాళానికి ఎక్కిన మూఢ భక్తి
విచక్షణను మింగేసినప్పుడు
వివేకం చచ్చుబడక చస్తుందా...!
అందుకే నిందించాల్సింది
అమాయక ప్రజల అజ్ఞానాన్ని కాదు
దిగజారిన పాలకుల ఏలుబడిని.

- వి.రాజగోపాల్,
విజయనగరం

ఉక్రెయిన్, ఐరోపాకు ట్రంప్ భయం

విశ్లేషణ

నువ్వెలాంటి వాడివో తెలుసుకోవాలంటే నీ స్నేహితులను చూస్తే చాలు అన్న లోకోక్తి తెలిసిందే. నవంబరులో జరిగే ఎన్నికల్లో ఒకవేళ అధ్యక్షుడిగా ఎన్నికైతే ఉక్రెయిన్ పట్ల డోనాల్డ్ ట్రంప్ వైఖరి ఎలా ఉంటుందో ఉపాధ్యక్ష పదవికి అతగాడు ఎంచుకున్న జెడి వాన్స్‌ను బట్టి చెప్పవచ్చన్న భయాలు ఇప్పుడు వెల్లడౌతున్నాయి. తనకు ఎక్కడ, ఏది లాభమో దాని మీదే అమెరికా పాలకవర్గం కేంద్రీకరిస్తుందన్నది జగమెరిగిన సత్యం. అనేక అంశాల్లో అది అనుకున్నదొకటి అయ్యింది ఒకటి. ఇప్పుడు ఉక్రెయిన్ సంక్షోభంలో కూడా అదే కనిపిస్తున్నది. మూడవ సంవత్సరంలో కొనసాగుతున్న రష్యా సైనిక చర్యను జెలెన్‌స్కీ దళాలు ప్రతిఘటించలేని స్థితిలో మరింతగా పుతిన్ సేనలు ముందుకు పోతున్నాయి. తామిచ్చిన ఆయుధాలు, డబ్బు బూడిదలో పోసిన పన్నీరు కావటం తప్ప ప్రయోజనం లేదని అమెరికా గుర్తించింది. అందుకే అధ్యక్షుడు జో బైడెన్ ప్రతిపాదించిన 61 బిలియన్ డాలర్ల మిలిటరీ సాయాన్ని రిపబ్లికన్ పార్టీ అడ్డుకున్నది. ఓహియో సెనెటర్‌గా ఉన్న జెడి వాన్స్ దీనిలో ముఖ్య పాత్ర పోషించాడు. ఈ కారణంగానే ట్రంప్ గెలిస్తే ఉక్రెయిన్, ఐరోపా యూనియన్‌ను అమెరికా వదలి వేయనుందనే అభిప్రాయాలు వెల్లడౌతున్నాయి. తాను గెలిస్తే కేవలం 24 గంటల్లోనే, అదీ పదవీ బాధ్యతలు స్వీకరించక ముందే పరిష్కరిస్తానని ట్రంప్ ప్రకటించాడు. దీని అర్థం రష్యా షరతులతో వివాదాన్ని ముగించటమే అని పరిశీలకులు భాష్యం చెబుతున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించి రెండు దశాబ్దాల తరువాత వదిలించుకున్న ట్రంప్‌కు అది పెద్ద సమస్య కాదు. అయితే ఆఫ్ఘనిస్తాన్-ఉక్రెయిన్ ఒకటి కాదు. ఉక్రెయిన్ మొత్తం ఐరోపాతో ముడిపడి ఉన్న సమస్య, అందువలన ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాడు.

రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన జర్మనీ దాని మిత్రులూ, గెలిచిన ఫ్రాన్సు, బ్రిటన్ వాటితో చేతులు కలిపిన దేశాలూ కూడా ఐరోపాలో తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాటిని ఆర్థికంగా తిరిగి నిలబెట్టాలి. సోవియట్, తూర్పు ఐరోపా సోషలిస్టు దేశాల నుంచి ముప్పు ఉందనే పేరుతో అమెరికా నాటో కూటమిని ముందుకు తెచ్చింది. దేవుడు నైవేద్యం తినడని పూజారికి తెలిసినంతగా మరొకరికి తెలియదు. అలాగే తాము అమెరికా చేతికి చిక్కామని గ్రహించిన ఐరోపా దేశాలు తమ కాళ్ల మీద తాము నిలవటంతో పాటు అమెరికా పెత్తనాన్ని అడ్డుకొనేందుకు ఐరోపా సమాఖ్యను ముందుకు తెచ్చాయి. అమెరికాతో మిత్ర బేధాలు ఉన్నప్పటికీ దానితో దగ్గరయ్యాయి. అయితే సోవియట్‌ను కూల్చివేసిన తరువాత రష్యాను ముప్పుగా చూపి అమెరికా పాత విధానాన్నే ఐరోపా మీద రుద్దింది. గడచిన మూడు దశాబ్దాల్లో చైనా రూపంలో వచ్చిన నూతన సవాలు ఐరోపాకూ ఎదురైంది. కనుక ఇష్టం ఉన్నా లేకున్నా పరస్పరం చిన్న పాటి వాణిజ్య పోరు సాగిస్తున్న రష్యా, చైనాలకు వ్యతిరేకంగా అమెరికాతో అంటకాగక తప్పటం లేదు. ఈ బలహీనతను సొమ్ము చేసుకోవాలని అమెరికా చూస్తోంది. కొంత మేరకు ప్రస్తుతానికి సఫలీకృతమైంది.



> **"అమెరికాలో ఉపాధ్యక్ష స్థానానికి ఎంచుకున్నవారు తరువాత అధ్యక్ష పదవి అభ్యర్థులు కావటం ఆనవాయితీగా వస్తున్నది. అందువలన జెడి వాన్స్ అభిప్రాయాలను కొట్టిపారవేసేందుకు లేదు. ఈ కారణంగానే అధికారికంగా నిర్ణయమైన తరువాత గతంలో అతగాడేం చెప్పాడనేది ఇప్పుడు తవ్వి తీస్తున్నారు. అమెరికా ప్రాధాన్యత తూర్పు ఆసియా అంటే చైనాపై కేంద్రీకరణ అని మ్యూనిచ్ భద్రతా సమావేశంలో చెప్పాడు. అమెరికా రక్షణ కవచం కారణంగా ఐరోపా స్వీయ రక్షణను విస్మరిస్తున్నదన్నాడు. ఒక దేశంగా ఉక్రెయిన్ ఏమైనా తాను పట్టించుకోను అన్నాడు. నాటో దేశాలు తమ సంక్షేమ చర్యల జాబితాలో ఉండకూడదని, ఐరోపా భద్రతకు తాము లక్షల కోట్ల డాలర్లను సబ్సిడీగా ఇస్తున్నామని చెప్పాడు. ఇంతకు ముందు అధికారంలో ఉన్నపుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఇదే చెప్పాడు."**

అమెరికాలో ఉపాధ్యక్ష స్థానానికి ఎంచుకున్నవారు తరువాత అధ్యక్ష పదవి అభ్యర్థులు కావటం ఆనవాయితీగా వస్తున్నది. అందువలన జెడి వాన్స్ అభిప్రాయాలను కొట్టిపారవేసేందుకు లేదు. ఈ కారణంగానే అధికారికంగా నిర్ణయమైన తరువాత గతంలో అతగాడేం చెప్పాడనేది ఇప్పుడు తవ్వి తీస్తున్నారు. అమెరికా ప్రాధాన్యత తూర్పు ఆసియా అంటే చైనాపై కేంద్రీకరణ అని మ్యూనిచ్ భద్రతా సమావేశంలో చెప్పాడు. అమెరికా రక్షణ కవచం కారణంగా ఐరోపా స్వీయ రక్షణను విస్మరిస్తున్నదన్నాడు. ఒక దేశంగా ఉక్రెయిన్ ఏమైనా తాను పట్టించుకోను అన్నాడు. నాటో దేశాలు తమ సంక్షేమ చర్యల జాబితాలో ఉండకూడదని, ఐరోపా భద్రతకు తాము లక్షల కోట్ల డాలర్లను సబ్సిడీగా ఇస్తున్నామని చెప్పాడు. ఇంతకు ముందు అధికారంలో ఉన్నపుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఇదే చెప్పాడు. నాటో దేశాలు తమ జిడిపిలో రెండు శాతం మొత్తాలను రక్షణ బడ్జెట్లకు ఖర్చు చేయాలని, తాము చేస్తున్నదానికి డబ్బు చెల్లించాలని అన్నాడు. తాజాగా తైవాన్ రక్షణకు గాను తమకు డబ్బు చెల్లించాల్సిందేనని, ఇప్పటి వరకు తాము చేసిన దానికి ఎలాంటి ప్రతిఫలం రావటం లేదన్నాడు. తమకూ బీమా కంపెనీకీ తేడా లేదన్నాడు. అమెరికాతో రాసుకుపూసుకు తిరగాలని చూస్తున్న నరేంద్ర మోడీతో సహా ప్రతి పాలకుడూ గ్రహించాల్సిన అంశమిది. అమెరికాతో వ్యవహారం ప్రతిదీ లాభనష్టాల డాలరు బేరం తప్ప స్నేహమూ, భాగస్వామ్యమూ వట్టి మాటే!

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మెప్మాకు అవార్డుల పంట

- కేంద్ర మంత్రి ఖట్టర్ చేతుల మీదుగా అందుకున్న డైరెక్టరు విజయలక్ష్మి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేర్వేరు రంగాల్లో ప్రతిభ చూపిన మెప్మాకు జాతీయ స్థాయిలో కీలకమైన రెండు అవార్డులు లభించాయి. న్యూఢిల్లీలోని స్టెయిన్ ఆడిటోరియంలో ఇండియా హబిటాట్ సెంటర్లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, సహాయ మంత్రి తోఖాన్‌సాహు, కార్యదర్శి అనురాగ్ జైన్, జాయింట్ సెక్రటరీ రాహుల్ కపూర్ చేతుల మీదుగా విజయలక్ష్మి అవార్డులు అందుకున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేసినందుకు మెప్మా డైరెక్టరు విజయలక్ష్మి అవార్డులు అందుకున్నారు. సిస్టమాటిక్ ప్రొగ్రెసివ్ అనలిటికల్ రియల్‌టైమ్ ర్యాంకింగ్ అవార్డు కూడా వచ్చింది. వీధి వ్యాపారులకు ఆర్థికంగా చేయూత, సాధికారత సాధించడంలో అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు ఫెర్ఫార్మెన్స్ రికగ్నిజేషన్ ఫర్ ఆక్సెస్ అవార్డునూ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మిషన్ మేనేజర్లు ఆదినారాయణ, రంగాచార్యులు, ఎన్ఎన్ఆర్ శ్రీనివాస్, ప్రభావతి తదితరులు అవార్డులు స్వీకరించారు.

జర్నలిస్టుల పట్ల అనుచిత వ్యాఖ్యలు తగవు

- విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాజ్యసభ ఛైర్మన్‌కు ఎపిడబ్ల్యుజెఎఫ్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి వివిధ చానెళ్లు, పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పట్ల అనుచితంగా వ్యాఖ్యలు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎపిబిజెఎ) తీవ్రంగా ఖండించాయి. ఒక రాజకీయ పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యులుగా వుంటూ, వ్యక్తిగత ధూషణలకు పాల్పడటం, కించపరిచే వ్యాఖ్యలు చేయడం, అవమానించేలా మాట్లాడటం తగదని, తక్షణం విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు, ఎపిబిజెఎ రాష్ట్ర కన్వీనర్లు వి శ్రీనివాసరావు, కె మునిరాజ్ గురువారం రాజ్యసభ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేస్తూ లేఖ రాశాయి. మహిళలకు సంబంధించిన వ్యక్తిగత అంశాలను ప్రస్తావించే సమయంలో మీడియా సంయమనంతో వృత్తి గౌరవానికి భంగం కలగకుండా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఘోరం

ఫార్మా ప్రమాద మృతుడి కుటుంబానికి సిపిఎం, సిఐటియు పరామర్శ

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలోని ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించి కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. అచ్యుతాపురం సెజ్‌లోని వసంత కెమికల్స్‌లో బుధవారం రియాక్టర్ పేలి మృతి చెందిన కార్మికుడు ప్రదీప్‌రౌత్ కుటుంబాన్ని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆస్పత్రి మార్చురీ వద్ద లోకనాథం గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలను పట్టించుకోకపోవడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీల్లో ఉన్న లోపాలపై నిరంతరం తనిఖీలు చేయడంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్, ఇతర అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని తెలిపారు. గతేడాది నుంచి నేటి వరకు అచ్యుతాపురం, పరవాడ ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో సుమారు 10 మంది వరకు కార్మికులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఈ ప్రమాదాలకు యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమని, జిల్లా అధికారులు నియమించిన విచారణ కమిటీలు నిర్ధారణకు వచ్చినా పొరపాట్లను సరిచేసే ప్రయత్నం చేయడం లేదన్నారు. ప్రమాద తీవ్రతను తగ్గించే ప్రత్యామ్నాయ వ్యవస్థలు ఏర్పాటు చేయకపోవడం, రక్షణ పరికరాలను కార్మికులకు ఇవ్వకపోవడంతోనే కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి తక్కువ జీతాలకు వచ్చే నైపుణ్యంలేని కార్మికులకు ప్రమాదకర ప్రదేశాల్లో పనులు అప్పగిస్తున్నారని తెలిపారు. వారు నివాసముంటున్న రేకుల షెడ్లు కూడా అధ్వానంగా ఉంటున్నాయన్నారు. కనీస వసతుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు ఉన్నారు.



అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ఆసుపత్రి వద్ద మృతుడు ప్రదీప్‌రౌత్ కుటుంబీకులను పరామర్శిస్తున్న లోకనాథం, తదితరులు



హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

హత్యలు, అత్యాచారాల నియంత్రణకు కఠిన చర్యలు

- హోంమంత్రి అనితకు ఐద్వా విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాలికలు, మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి, ఉపాధ్యక్షులు డి శ్రీనివాసకుమారి, జి అమల, టి శ్రీదేవి హోంమంత్రి అనితను కలిశారు. గుంటూరు, విజయనగరం, నంద్యాల జిల్లాలో బాలికలపై అత్యాచారాలు, హత్యలు జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో పసిపిల్లలు, ఒంటరి మహిళలు, పని ప్రదేశాల్లో మహిళా కార్మికులపై, పేదలు, దళితులు, ఆదివాసీ మహిళలపై ఇటీవల కాలంలో లైంగిక దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హత్యలకు, అత్యాచారాలకు కారణం మత్తుమందు, మద్యపానం వల్లేనని, తక్షణం వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో సోషల్ మీడియా, టివిలు, సినిమాల్లో మహిళలపై అశ్లీలాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు, బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలని, పునరావాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

వైసిపి హయాంలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం : హోంమంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని, చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆమె మీడియాతో గురువారం మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పోలీస్ యంత్రాంగాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుని వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే శాంతిభద్రతలు అదుపులోకి వస్తున్నాయని తెలిపారు. కొన్ని అరాచక శక్తులు అశాంతిని సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా వుండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టిడిపి నాయకులు కూడా సంయమనం పాటించాలని చెప్పారు. రాష్ట్రపతికి, కేంద్ర హోంమంత్రికి రాసే లేఖలో తన బాబాయ్ హత్య కేసు, డాక్టర్ సుధాకర్ హత్యలను ప్రస్తావించాలని వైఎస్ జగన్‌ను కోరారు. డ్రైవర్ సుబ్రమణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన కేసు సహ వివిధ ఘటనలను కూడా ప్రస్తావించాలని అన్నారు. బాలికలు, మహిళలపై అత్యాచార ఘటనలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖలతో స్పెషల్ డ్రైవ్ చేపడతామని తెలిపారు.

107, 108 జిఓలు రద్దు చేయాల్సిందే

- వైద్య ఫీజులపై మాట మార్చొద్దని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అమలవుతున్న 107, 108 జిఓలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కింద రూ.5 లక్షలు, సి కేటగిరి విభాగాలకు రూ.20 లక్షలుగా గత ప్రభుత్వం ఫీజులను ఖరారు చేసిందని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా టిడిపి, జనసేన ఈ ఫీజుల విధానాన్ని వ్యతిరేకించాయని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఈ జిఓలను రద్దు చేసే బాధ్యత తీసుకుంటానని యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక పాత ఫీజుల పద్ధతినే యథావిధిగా కొనసాగిస్తామని ప్రభుత్వం హైకోర్టులో వెల్లడించిందని, ఇది విద్యార్థులను మోసగించడమేనని విమర్శించారు. ఈ జిఓల వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ఆలోచన చేయాలని కోరారు.

ఇంజినీరింగ్ కనిష్ట ఫీజు రూ.43 వేలు

- పది రోజుల్లోనే రూ.3 వేలు పెంచిన ప్రభుత్వం
- ఎంటెక్ ఫీజుల ఖరారు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్ కోర్సుల్లో కనిష్ట ఫీజును రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఇందుకు సంబంధించిన జిఓ 23ను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ గురువారం విడుదల చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి మాత్రమే ఈ ఫీజులు వర్తిస్తాయి. కేవలం 10 రోజుల్లోనే కనిష్ట ఫీజును ప్రభుత్వం పెంచింది. ఈ నెల 7న ఇంజినీరింగ్ కోర్సులకు ఫీజులను ఖరారు చేస్తూ జిఓ 17ను ప్రభుత్వం విడుదల చేసింది. కనిష్ట ఫీజు రూ.40 వేలుగా, గరిష్ట ఫీజు రూ.1,05,00లుగా ఖరారు చేసింది. పది రోజుల్లో కనిష్ట ఫీజును రూ.43 వేలకు పెంచింది. ఈ జిఓ వల్ల సుమారు 120 కళాశాలల్లో ఫీజు పెరగనుంది.

ఎంటెక్ కనిష్ట ఫీజు రూ.50 వేలు

ఎంటెక్ కోర్సులకు ఫీజులను ఖరారు చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ జిఓ 22ను విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 178 ప్రైవేట్ కళాశాలల్లో ఎంటెక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కనిష్ట ఫీజు రూ.50 వేలుగా, గరిష్ట ఫీజు రూ.90 వేలుగా ఖరారు చేశారు. ఈ ఫీజులు ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25)లో అమలవుతాయి. గుంటూరులోని ఆర్‌విఆర్ అండ్ జెసి, విజయవాడలోని పివిపి సిద్ధార్థ, విఆర్ సిద్ధార్థ కళాశాలలు, చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, భీమవరంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్, డిఎన్ఆర్ ఇంజినీరింగ్, నెల్లూరులోని ఆదిశంకర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, నారాయణ ఇంజినీరింగ్, ఒంగోలులోని పిఎసిఇ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, కర్నూలులోని జిపిఆర్ ఇంజినీరింగ్ కళాశాల, కృష్ణా జిల్లాలోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల, పెద్దాపురంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, శ్రీకాకుళంలోని ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలకు గరిష్ట ఫీజు రూ.90 వేలుగా ఖరారు చేశారు.

బడ్జెట్‌పై తర్జనభర్జన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వార్షిక బడ్జెట్‌పై అధికారులు ఇంకా తర్జనభర్జన పడుతూనే ఉన్నారు. ఈసారి కూడా సభలోగానీ, ఆర్డినెన్స్ ద్వారా గానీ ఓటాన్ అకౌంటు పెట్టి రెండు నెలలకు అనుమతి పొంది, సెప్టెంబరులో పూర్తి బడ్జెన్‌ను పెట్టుకోవాలని దాదాపు నిర్ణయించినట్లు తెలుస్తోంది. తుది నిర్ణయం మాత్రం ఇంకా తీసుకోలేదని సమాచారం. ఇదే అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో ఆర్థికశాఖ కార్యదర్శులు గురువారం సమావేశమై చర్చించినట్లు తెలిసింది.

వేట నిషేధ పరిహారం జాబితాపై రీ సర్వే

- ఎన్నికల హామీ మేరకు ఇవ్వాలని నిర్ణయం
- ఈ ఏడాది నుంచే అమలు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి



చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందిస్తున్న పరిహారాన్ని రూ.20 వేలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆ మొత్తాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. దీంతో లబ్ధిదారుల జాబితాపై మరోసారి రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అధికారులు మరోసారి సర్వే పనిలో ఉన్నారు. జాబితా ఒక కొలిక్కి వచ్చిన తర్వాత పరిహారం పెంపుపై మార్గదర్శకాలు వెలువడవచ్చని అధికారులు చెప్తున్నారు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు చేపల వేటపై నిషేధం అమలవుతోంది. ఈ నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ఈ 61 రోజుల పాటు ఏటా రూ.పది వేల చొప్పున పరిహారంగా గత వైసిపి ప్రభుత్వం ఇచ్చింది. దీనికి మరో రూ.10 వేలు కలిపి రూ.20 వేలు ఇస్తామని గత ఎన్నికల్లో టిడిపి హామీ ఇచ్చింది. ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటివరకు పరిహారం సొమ్మును మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయలేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడం, లబ్ధిదారుల సర్వే చాలా ఆలస్యంగా చేపట్టడంతో పరిహారం ఇంకా జమకాలేదు.

రాష్ట్రంలో చేపల వేటపై ఆధారపడి బతుకుతున్న మత్స్యకారులందరికీ భృతి అందించడానికి అనుగుణంగా జాబితాలను సిద్ధం చేయాలని, రీ సర్వే నిర్వహించాలని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ నెల పదో తేదీన అమరావతిలో మత్స్యశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు మరోసారి జాబితాలను తనిఖీ చేస్తున్నారు. దీంతోపాటు సాంకేతిక కారణాలతో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాని పరిస్థితులు గతంలో తలెత్తిన నేపథ్యంలో ఆధార్, బ్యాంకు ఖాతాల పత్రాలను పరిశీలిస్తున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మే రెండో తేదీన మొదటిసారి సర్వే నిర్వహించారు. జూన్ రెండో తేదీ నాటికి ప్రాథమిక జాబితా పూర్తయింది. ఆ జాబితా ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 1,30,128 మంది మత్స్యకారులను సర్వే చేశారు. వీరిలో ప్రాథమికంగా 1,05,387 మందిని అర్హులుగా గుర్తించారు. మత్స్యకార భరోసాకు గత ప్రభుత్వం విధించిన రకరకాల కారణాలతో 24,741 మందిని అనర్హులుగా పెండింగ్‌లో ఉంచారు.


డీజిల్ వాడకం నిబంధనపై నిర్ణయమేమిటో?

మత్స్యకార భరోసా చెల్లింపునకు గత ప్రభుత్వం డీజిల్ వాడకాన్ని మెలిక పెట్టింది. మత్స్యకారుల బోట్లకు ప్రభుత్వం ఏడాదికి లీటరుకు రూ.9 చొప్పున సబ్సిడీతో 300 లీటర్ల డీజిల్‌ను అందిస్తోంది. కనీసం వంద లీటర్లనూ వినియోగించని వారిని అనర్హుల జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. గతేడాది ఈ నిబంధన ఉన్నా మినహాయింపు ఇచ్చింది. ఈ సంవత్సరం దాన్ని అమలు చేయాలని నిర్ణయించి, అందుకనుగుణంగా జాబితాను తయారు చేశారు. అదే అమలైతే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 18 వేల మంది అనర్హులుగా మారనున్నారు. దీనిపై అధికారులు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

ఆ నిబంధనలు యథాతథమేనా?

మత్స్యకార భరోసాకు గత ప్రభుత్వం అనేక నిబంధనలు విధించింది. పరిహారం పొందేందుకు 18 నుంచి 60 ఏళ్ల వయసు, కుటుంబంలో ఒకరికి మాత్రమే సాయం, మత్స్యకార పెన్షన్ పొందుతున్న వారిని వడపోశారు. పల్లం భూమి మూడు ఎకరాలుగానీ, మెట్టు పది ఎకరాలకుగానీ మించి ఉన్న వారిని, నాలుగు చక్రాల వాహనం ఉన్న వారిని, కుటుంబ విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించి వాడిన వారిని అనర్హుల జాబితాలో చేర్చారు. కుటుంబంలో ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులు ఉంటే వారిని అనర్హులుగా పేర్కొంది. కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తుంటే వారికీ పథకం వర్తింపజేయలేదు. టిడిపి కూటమి ప్రభుత్వ ఏర్పాటు తర్వాత నిబంధనల్లో కొంత సడలింపు ఉంటుందని మత్స్యకారులు భావించారు. పరిహారం జాబితాలపై రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం సూచించిందే తప్ప, కొత్త జాబితాలను రూపొందించాలని ఎక్కడా చెప్పలేదు. దీంతో, నిబంధనలు యథాతథంగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

పొదుపు తగ్గుతోంది..



- 46 శాతం కుటుంబాల ఆందోళన
- బడ్జెట్‌లో ఉపశమనం కల్పించాలి
- పన్ను రేట్లను తగ్గించాలి
- లోకల్ సర్కిల్స్ సర్వేలో డిమాండ్

హైదరాబాద్ : దేశంలోని అధిక ధరలతో ప్రజల జీవన వ్యయాలు పెరిగిపోవడంతో పొదుపు శక్తి తగ్గిపోతోంది. సంపాదన తగ్గడం, ఖర్చులు పెరగడంతో పొదుపు సామర్థ్యం తగ్గిపోతోందని 48 శాతం కుటుంబాలు లోకల్ సర్కిల్స్ సర్వేలో ఆందోళన వ్యక్తం చేశాయి. 2023-24తో పోల్చితే ప్రస్తుత 2024-25లో తమ పొదుపు సగటు మరింత తగ్గొచ్చని భయాందోళనలు వ్యక్తమయ్యాయి. త్వరలో ప్రవేశపెట్టనున్న 2024-25 బడ్జెట్‌లో ఉపశమనం లభిస్తుందని వారు ఆశిస్తున్నారు. లోకల్ సర్కిల్స్ దేశంలోని 327 జిల్లాల్లోని 21,000 పైగా మంది అభిప్రాయాలను సేకరించింది. ఇందులో 67 శాతం మంది పురుషులు, 33 శాతం మంది మహిళలు ఉన్నారు.

లోకల్ సర్కిల్స్ సర్వే ప్రకారం.. ఈ ఏడాది పొదుపులో 25 శాతం కంటే ఎక్కువ తగ్గుదల ఉండొచ్చని 15 శాతం కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయి. వారిలో 7 శాతం మంది తమ సంపాదనలో 25 శాతం లేదా అంతకంటే ఎక్కువ తగ్గుదల ఉండొచ్చని అంచనా వేస్తున్నాయి. అధిక జీవన వ్యయం, ఇతర ఖర్చులు పెరుగుతున్నాయి. అదే విధంగా తరచుగా ఆస్తి తనఖా లేదా లిక్విడేషన్, నివాసం, వాహనం కొనుగోలు లేదా విద్య, వ్యక్తిగతం కోసం తీసుకున్న రుణాలు కూడా పొదుపును ప్రభావితం చేస్తున్నాయి.

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను వచ్చే వారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌లో ఆదాయపు పన్ను రేట్లలో తగ్గుదల ఉండాలని లోకల్ సర్వేలో అనేక కుటుంబాలు అభిప్రాయపడ్డాయి. 80సి కింద పన్ను మినహాయింపు పరిమితులను పెంచాలని కోరుకుంటున్నారు. సున్నా పన్ను పొందే ఆదాయ శ్రేణిని మరింత విస్తరించాలని డిమాండ్ చేస్తున్నారు. మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా చేసే వ్యయాలు అయినటువంటి అహారం, పాఠశాల విద్య, అద్దె, రవాణా, కరెంట్ భారాలను తగ్గించాలని కోరుకుంటున్నారు. ఆదాయాలు తగ్గుముఖం పట్టడంపై చాలా మంది ఆందోళన వ్యక్తం చేశారు.


కరోనా కాలం కంటే ఆందోళనకరం

కేంద్ర గణంకాల శాఖ 2024 డేటా ప్రకారం.. 2022-23 నాటికి మూడు సంవత్సరాలలో భారత్‌లో నికర గృహ పొదుపు రూ.9 లక్షల కోట్లకు తగ్గిపోయింది. ఇంతకు ముందు మూడేళ్ల క్రితం ఇది రూ.14.6 లక్షల కోట్లుగా ఉంది. 2020-21 నాటికి జిడిపిలో కుటుంబాల స్థూల పొదుపు సామర్థ్యం 22.7 శాతంగా ఉండగా.. 2022-23 నాటికి 18.4 శాతానికి పడిపోయింది. కరోనా తీవ్ర స్థాయిలో ఉన్న 2020-21లోనూ ప్రజల పొదుపు రూ.23.29 లక్షల కోట్లుగా ఉంది. ఆ తర్వాత భారీగా పడిపోతూ వచ్చింది. 2021-22లో రూ.17.12 లక్షల కోట్లకు తగ్గింది. 2022-23లో రూ.14.16 లక్షల కోట్లకు క్షీణించింది.

ఇన్ఫోసిస్‌లో తగ్గిన 1,908 మంది ఉద్యోగులు

- క్యూ1లో రూ.6,368 కోట్ల నికర లాభాలు

బెంగళూరు : దిగ్గజ టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 7.1 శాతం వృద్ధితో రూ.6,368 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో రూ.5,945 కోట్ల లాభాలు నమోదు చేసింది. కంపెనీ రెవెన్యూ 3.6 శాతం పెరిగి రూ.39,315 కోట్లకు చేరింది. కాగా.. గడిచిన త్రైమాసికంలో ఇన్ఫోసిస్‌లో ఉద్యోగుల సంఖ్య 1,908 తగ్గింది. వరుసగా ఆరో త్రైమాసికంలోనూ మానవ వనరుల్లో తగ్గుదల చోటు చేసుకోవడం గమనార్హం. 2024 జూన్ ముగింపు నాటికి మొత్తంగా 3,15,332 మంది



ఉద్యోగులకు పరిమితమయ్యారు. మార్చి ముగింపు నాటికి ఈ సంఖ్య 3,17,240గా ఉండగా.. ఏడాదిలో నికరంగా 20,962 మంది ఉద్యోగులు తగ్గడం గమనార్హం. కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో కొత్తగా 20వేల మంది ఫ్రెషర్లను తీసుకోనున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది.



సెన్సెక్స్@ 81వేలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో ఆల్‌టైం రికార్డ్‌లను నమోదు చేస్తున్నాయి. సెన్సెక్స్ తొలిసారి 81,000, ఎన్ఎస్ఇ నిఫ్టీ 24,800 మార్క్‌ను అధిగమించాయి. గురువారం ఐటి, ఫైనాన్సీయల్, ఇతర స్టాక్స్ మద్దతుతో మార్కెట్లు పరుగులు పెట్టాయి. బిఎస్ఇ సెన్సెక్స్ ఉదయం ప్రతికూలతలోనే ట్రేడింగ్‌ను ప్రారంభించినప్పటికీ.. మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్ల మద్దతుతో పుంజుకుని చివరికి 627 పాయింట్ల లాభంతో 81,343 వద్ద ముగిసింది. నిఫ్టీ 188 పాయింట్ల లాభంతో 24,801కి చేరుకుంది. ఇంట్రాడేలో 24,837.75 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. సెన్సెక్స్-30లో టిసిఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, ఎన్‌టిపిసి, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.99 శాతం, 1.55 శాతం చొప్పున తగ్గాయి. నిఫ్టీలో ఐటి రంగ సూచీ ఏకంగా 2.2 శాతం పెరిగింది. ఫైనాన్సీయల్ సర్వీసెస్ 0.57 శాతం, ఎఫ్ఎంసిజి 0.96 శాతం, ఆటో 0.37 శాతం చొప్పున రాణించాయి.

ముగ్గురు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం

- కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

ముగ్గురు విద్యార్థినులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం ముదివేడు కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఈ సంఘటన కలకలం రేపింది. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు బుధవారం అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది వెంటనే విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. ముదివేడులోని గురుకుల పాఠశాలలో మదనపల్లెలోని చిన్నతిప్ప సముద్రానికి చెందిన హర్షిత, అను పగుట్టకు చెందిన సంజన, కదిరికి చెందిన రెడ్డి జాహ్నవి 9వ తరగతి చదువుతున్నారు. వీరితో పాటే చదువుతున్న మరో విద్యార్థి మదనపల్లెకు చెందిన యశశ్విత రెండు వారాల కిందట టిసి తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. తోటి స్నేహితురాలు తమతో లేకపోవడంతో చదువుపై దృష్టిపెట్టలేక పోయారు. తాము కూడా ఇంటికి వస్తామని తల్లిదండ్రులకు చెప్పారు. అందుకు వారు ఒప్పుకోకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. బుధవారం సాయంత్రం తమ వద్ద ఉన్న పారాసెటమాల్, డైక్లోఫినాక్ మాత్రలను ఒక్కొక్కరు 10 చొప్పున తీసుకున్నారు. రాత్రి పడుకునే సమయంలో ఒక్కసారిగా వాంతులు కావడంతో పాఠశాలలోని వార్డెన్, స్టాఫ్ నర్స్, తోటి విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వెనువెంటనే విద్యార్థులను మదనపల్లె సర్వజన బోధన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎలాంటి ప్రాణనష్టం లేదని తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన బాషా గురువారం సర్వజన బోధన ఆస్పత్రికి చేరుకొని విద్యార్థులను పరామర్శించారు. కురబలకోట, మదనపల్లె ఎంఇఒలు ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఆ అధికారులను సస్పెండ్ చేయండి : ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో 2021లో తనపై జరిగిన హత్యాయత్నం కేసులో విచారణకు ముందే పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని టిడిపి ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా ఎస్‌పి కార్యాలయానికి ఆయన గురువారం వచ్చారు. ఎస్‌పి సతీష్‌కుమార్‌ని కలిసి తన కేసు పూర్వపరాలను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను చేసిన ఫిర్యాదు మేరకు పోలీసు అధికారులతోపాటు వైఎస్ జగన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. తొలుత పోలీసు అధికారులను సస్పెండ్ చేసి విచారణ ప్రారంభించాలని కోరారు. 307 సెక్షన్ కేసులో డిజి స్థాయి అధికారులు, మాజీ సిఎం ఉండటం ఇప్పటి వరకూ జరగలేదన్నారు. హత్యాయత్నం కేసు నమోదైనప్పుడు అధికారులను సస్పెండ్ చేయాలని తెలిపారు. అప్పటి గుంటూరు కలెక్టర్‌ను కూడా ప్రశ్నించాలని, డాక్టర్ శ్రీకాంతే అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఎందుకు రాశాడో తేల్చాల్సి ఉందని పేర్కొన్నారు. ఆస్పత్రిలో సాక్షిగా వైసిపి నాయకుడు బోరుగడ్డ అనిల్ సంతకం తీసుకున్నారని, వీరంతా అప్పటికే సిద్ధంగా ఉన్నారంటే ఒక కుట్ర ప్రకారమే జరిగిందన్నారు. తన మీద రాజద్రోహం కేసు పెట్టారని, తాను అలాంటి నేరం చేయలేదని స్పష్టం చేశారు.

కబ్జాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

- కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్ (శ్రీసత్యసాయి జిల్లా)

గత ప్రభుత్వ హయాంలో శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలు, అక్రమ కట్టాడాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేలా ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు.

కదిరి పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో సహజ వనరులను అడ్డగోలుగా దోచేశారని, ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, జగనన్న కాలనీల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. గత ఐదేళ్లలో వైసిపి నాయకులు చేసిన భూ కబ్జాలన్నింటినీ వెలికి తీస్తామన్నారు. వీటిన్నింటిపైనా విచారణకు ఆదేశించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పేరు చెప్పుకుని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే తాటతీస్తానని హెచ్చరించారు.

సిఎస్ఐఆర్ నియామకాల్లో అక్రమాలు

- ప్రధాని నేతృత్వంలోని సంస్థపై రిగ్గింగ్ ఆరోపణలు
- దొంగ చేతికే తాళం ఇచ్చిన కేంద్ర సంస్థ
- నిర్వాహకులకు బిజెపితో సంబంధాలు

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నేతృత్వంలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సిఎస్ఐఆర్)లో సెక్షన్ ఆఫీసర్ (ఎస్ఓ), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ) ఉద్యోగుల నియామకం కోసం నిర్వహించిన పరీక్షలో పెద్ద ఎత్తున రిగ్గింగ్, అక్రమాలు జరిగాయంటూ దేశవ్యాప్తంగా తాజాగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియామకాల కోసం జరిపిన పరీక్షల తొలి దశపై వివిధ రాష్ట్రాల్లో పోలీసులు ఇప్పటికే విచారణ ప్రారంభించారు. అయితే ఈ నెల 7న దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో నిర్వహించిన రెండో దశ పరీక్షలో కూడా అవకతవకలు, నిర్వహణ లోపం చోటుచేసుకున్నాయని తాజాగా ఆరోపణలు విన్పిస్తున్నాయి. అనేక పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొని వెళ్లారని, బహిరంగంగా వీడియోలు తీశారని 'ది వైర్' హిందీ పోర్టల్ పరిశోధన జయటపెట్టింది. పరీక్షా కేంద్రాల్లో పెద్ద ఎత్తున శబ్దాలు వినిపించాయి. కలకలం చెలరేగింది. కేంద్రాల్లోకి ఇతరులు కూడా ప్రవేశించి హల్‌చల్ చేశారు. పరీక్ష నిర్వహణలో భారీగా అవకతవకలు జరిగాయని దీనిని బట్టి అర్థమవుతోంది. కొన్ని చోట్ల సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగుల జాడే కన్పించలేదు. సోషల్ మీడియాలో కన్పించిన దృశ్యాలు, వీడియోలను చూస్తుంటే అది ఓ ప్రముఖ ప్రభుత్వ సంస్థ నిర్వహించిన నియామక పరీక్ష మాదిరిగా కన్పించలేదు.



'ఇది సంత కాదు..ఏ బాబా అడ్డానూ కాదు. పరీక్షా కేంద్రం. ప్రధాని నేతృత్వం వహిస్తున్న సిఎస్ఐఆర్ ఎస్ఓ, ఎఎస్ఓ నియామకాల కోసం పరీక్ష నిర్వహిస్తున్న చోటు. సమయం పూర్తయినా పోర్టల్ తెరిచేవుంది. అభ్యర్థులతో పాటు ఇతరులు అక్కడే ఉన్నారు. అభ్యర్థులకు సహకరిస్తున్నారు. బ్లాక్ లిస్టులో ఉన్న 'ఎడ్యుటెస్ట్'కు ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఇదంతా పరీక్షల రిగ్గింగ్ కాదా? ఇవన్నీ అక్రమాలు కావా?' అంటూ అజయ్ మౌర్య అనే ఐఐటి - వారణాసి పూర్వ విద్యార్థి, యుపిపిఎస్‌సి ఫ్యాకల్టీ పోస్టు చేసిన వీడియోలోని దృశ్యాలు ఇవి.

ఉత్తరప్రదేశ్‌లో బ్లాక్‌లిస్టులో పెట్టినా...

కొన్ని చోట్ల పరిస్థితి చేయి దాటిపోవడంతో పోలీసులను పిలవాల్సి వచ్చింది. నియామక పరీక్షలో అవకతవకలేవీ జరగలేదని అప్పటి వరకూ వాదిస్తూ వచ్చిన సిఎస్ఐఆర్ కూడా రెండో దశ తర్వాత నోటీసు జారీ చేసింది. సాంకేతిక సమస్యలపై ఫిర్యాదులు అందాయని, వాటిని పరిశీలించిన తర్వాత అభ్యర్థులకు వెబ్ నోటీసు ద్వారా నిర్ణయాన్ని తెలియజేస్తామని చెప్పింది. ఈ పరీక్షను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఓ కంపెనీ నిర్వహించిందని, దానిని ఇప్పటికే యూపీ ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టిందన్న విషయాన్ని సిఎస్ఐఆర్ విస్మరించింది. తొలి దశ పరీక్షలో ఇబ్బందులు ఎదురైనప్పటికీ అదే కంపెనీ ఆధ్వర్యంలో రెండో దశ పరీక్షను నిర్వహించడం దొంగ చేతికే తాళం అప్పగించినట్లు ఉన్నదని అభ్యర్థులు ఆరోపించారు.

వ్యవస్థాపకుడికి బిజెపితో సంబంధాలు

గుజరాత్ కంపెనీ ఎడుటెస్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బిజెపి మధ్య ఉన్న సంబంధాలపై ది వైర్ హిందీ పోర్టల్ ఆరా తీసింది. ఎడుటెస్ట్ వ్యవస్థాపకుడు సురేష్ చంద్ర ఆర్య ఓ హిందూ సంస్థ అధ్యక్షుడు. ఆయన నిర్వహించే కార్యక్రమాలకు ప్రధాని మోడీ తరచుగా హాజరవుతుంటారు. ఈ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ ఆర్య పేపర్ లీకేజీ కేసులో జైలుకు వెళ్లారు. అయినప్పటికీ ఆ కంపెనీ బిజెపి ప్రభుత్వాల నుండి పరీక్షల నిర్వహణ కాంట్రాక్టులు సంపాదిస్తోంది.

తొలి దశ పరీక్షలో అవకతవకలపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. చీటింగ్ ఆరోపణలపై జైళ్లలో ఉన్న కొందరు అభ్యర్థుల పేర్లు పరీక్ష పాసైన వారి జాబితాలో ఉండడం గమనార్హం. ఈ వ్యవహారంపై ప్రస్తుతం క్యాట్ విచారణ జరుపుతోంది.

పరీక్ష నిర్వహణ ఇలా...

దేశంలోని ఢిల్లీ, ఛండీగఢ్, కోల్‌కతా, లక్నో, పూనే, భోపాల్, హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, గౌహతి నగరాల్లోని 33 కేంద్రాల్లో ఈ నెల 7న రెండో దశ పరీక్ష జరిగింది. దీనిని రెండు షిప్టులుగా (లిఖితపూర్వక సమాధానాలు ఇవ్వాల్సిన పరీక్ష, కంప్యూటర్ నైపుణ్య పరీక్ష) నిర్వహించారు. రాజధాని ఢిల్లీలోని ఓ పరీక్షా కేంద్రంలో మొదటి షిఫ్టు పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.40కి మొదలైంది. దీనిపై కొందరు విద్యార్థులు నిరసన వ్యక్తం చేసి బయటికి వెళ్లిపోవాలని ప్రయత్నించినా పోలీసులు అనుమతించలేదు. రెండో షిఫ్టు పరీక్ష మధ్యాహ్నం 3 గంటలకు మొదలు కావాల్సి ఉండగా గంట ఆలస్యమైంది. పరీక్ష సమయంలో అనేక సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. సమయం పూర్తయినప్పటికీ కొందరు వ్యక్తులు ఓ మహిళా అభ్యర్థికి సాయం చేయడం కన్పించింది. సమయానికి పరీక్ష ప్రారంభం కాకపోవడానికి నీదంటే నీదే కారణమని కేంద్రం యజమాని, సిఎస్ఐఆర్ సిబ్బంది పరస్పరం నిందించుకున్నారు. కొందరు సిబ్బంది తమకు తెలిసిన అభ్యర్థులతో సంప్రదింపులు జరిపారు. ఇదేమిటని ప్రశ్నిస్తే జోక్యం చేసుకోవద్దని హెచ్చరించారు. అనేక పరీక్షా కేంద్రాల్లో సైతం ఇలాంటి దృశ్యాలే కన్పించాయి. పరీక్షకు ఉపయోగించిన సాఫ్ట్‌వేర్ భద్రమైనది కాదని అభ్యర్థులు తెలిపారు. పరీక్ష కోసం వాడిన కంప్యూటర్‌లో పెన్‌డ్రైవ్ పెట్టి మోసం చేయడం తేలిక అని చెప్పారు. కొన్ని పరీక్షా కేంద్రాల్లోకి సమయం దాటినప్పటికీ అభ్యర్థులను అనుమతించారు.

1947లోనే ముస్లింలందరినీ పాక్ పంపించేయాల్సింది !

- కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : అర్థం పర్థం లేకుండా అతిగా మాట్లాడుతూ, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రధాని మోడీ కేబినెట్‌లోని జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ మరోమారు వార్తల్లోకెక్కారు. 1947లో దేశ విభజన సమయంలోనే ముస్లింలందరినీ పాకిస్తాన్‌కు పంపించేసి వుంటే దేశంలో పరిస్థితులు మరో రకంగా వుండేవని ఆయన వ్యాఖ్యానించారు. 'ఈ దేశం దురదృష్టం ఇది. మన పూర్వీకులు 1947లోనే ముస్లింలందరినీ పాకిస్తాన్‌కు పంపి, మతం ఆధారంగా దేశాన్ని విభజించి వుంటే, ఇప్పుడు ఎవ్వరూ కూడా ఇలాంటి ప్రశ్నలు అడిగివుండేవారు కాదు' అని గిరిరాజ్ విద్వేషం వెళ్లగక్కారు. ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడేవారు సనాతన ధర్మంపై సాంస్కృతిక దాడి చేస్తున్నారని ఆరోపించారు. గత రెండు పదవీకాలాల్లోనూ మోడీ ప్రభుత్వంలో పనిచేసిన గిరిరాజ్ సింగ్ తరచుగా ముస్లిం వ్యతిరేక విద్వేషాన్ని వెళ్ళగక్కుతునే వుంటారు. 'ముస్లింలను ఇక్కడ జీవించేందుకు అనుమతించడమే పెద్ద తప్పు. మతం ప్రాతిపదికన దేశాన్ని విభజిస్తే ముస్లింలను ఇక్కడ ఎందుకు వుండనిచ్చేవారు? వారిక్కడ వుండకపోతే ఈ పరిస్థితి వచ్చేది కాదు' అని ఆర్ఎస్ఎస్ పత్రిక పాంచజన్య, సింగ్‌ను ఉటంకిస్తూ పేర్కొంది. ఏ పరిస్థితుల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేసారో ఆ వివరణ అయితే పత్రిక ఇవ్వలేదు.

డెహ్రాడూన్‌లో రెచ్చిపోయిన సంఘ్ పరివార్

- ప్రార్థనా మందిరంపై దాడి

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడున్‌లో సంఘ్ పరివార్ గూండాలు రెచ్చిపోయారు. మైనారిటీ తరగతికి చెందిన ప్రార్థనా మందిరంపైనా, నిర్వాహకులపైనా దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు, బాధితులు కథనం ప్రకారం..దీక్షా పాల్ (35) నివాసంలో ఆయన బంధువులు, ఇరుగు పొరుగువారితో కలిసి కుటుంబ సమేతంగా ప్రార్థనలు చేస్తున్న సమయంలో అక్రమంగా చొరబడిన హిందూత్వ గూండాలు ఈ దాడికి పాల్పడ్డారు. పవిత్ర శిలువను, చిత్రాలను, ఇతర ప్రార్థనా సామగ్రిని ధ్వంసం చేశారు. మత విద్వేష వ్యాఖ్యలతో దూషిస్తూ చితకబాదారు. ఈ ఘటనపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద 11 మంది నిందితులపై నెహ్రూ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

దాడికి పాల్పడిన గూండాలను దేవేంద్ర దోభాల్, బిజేంద్ర థాపా, సధీర్ థాపా, సంజీవ్ పాల్, సుధీర్ పాల్, ధీరేంద్ర ధోబాల్, అర్మాన్ ధోబాల్, ఆర్యమాన్ ధోబాల్, అనిల్ హిందూ, భూపేష్ జోషి, బిజేంద్రగా గుర్తించారు. ఈ ఇంటిలో ఎలాంటి బలవంతపు మత మార్పిడిలు జరగలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఘటనకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే దుండగుల్లో ఎవ్వరినీ ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం గమనార్హం. ఈ దాడిని సిపిఎం కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగ కల్పించిన మత స్వేచ్ఛ హక్కును కాలరాస్తున్న దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది.

ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం

కన్వర్ యాత్ర సందర్భంగా ఉత్తరప్రదేశ్ పోలీసులు తాజాగా ఇచ్చిన ఉత్తర్వులపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కన్వర్ యాత్ర జరిగే మార్గంలో అన్ని హోటళ్ల యాజమానులు తమ పేర్లను ప్రముఖంగా కనబడే విధంగా ప్రచురించాలని ముజఫర్‌నగర్ పోలీసులు ఉత్తర్వులు చేయడం వివాదస్పదంగా మారింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకునే పోలీసులు ఈ ఉత్తర్వులు జారీ చేసారని విమర్శలు వస్తున్నాయి. ఈ ఉత్తర్వులపై సిపిఎం తీవ్రంగా స్పందించింది. 'ఫాసిస్టులతో పోరాడలని చరిత్ర నేర్పిందని అయితే ఫాసిస్టులను బిజెపి-ఆర్ఎస్ఎస్ అనుసరిస్తున్నాయ'ని ఒక ప్రకటనలో సిపిఎం విమర్శించింది. మతపరమైన విభజనను సృష్టించేందుకు యుపిలోని యోగి అదిత్యానాథ్ ప్రభుత్వ సిగ్గు మాలినచర్య అని పేర్కొంది. అలాగే ఉత్తరాఖండ్‌లోనూ ముస్లిం దుకాణ యజమానులను లక్ష్యంగా చేసుకునే యత్నం జరుగుతోందని సిపిఎం విమర్శించింది.

మరోసారి తెరుచుకున్న 'రత్న భండార్'

పూరి : ఒడిషాలో పూరి జగన్నాథ ఆలయంలోని రహస్య గది 'రత్న భండార్'ను మరోసారి తెరిచారు. గురువారం ఉదయం 9:51 గంటలకు గది తెరిచి, విలువైన వస్తువులను లెక్కింపు కోసం తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కి తరలించారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు, తగినంత భద్రతా సిబ్బందిని మోహరించినట్లు పూరి ఎస్‌పి పినాక్ మిశ్రా తెలిపారు. పాములు పట్టేవారిని, ఒడిషా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, అగ్నిమాపక సిబ్బంది ఎటువంటి పరిస్థితిని ఎదుర్కొవడానికైనా సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. 46 ఏళ్ల తరువాత ఈ నెల 14న ఈ గదిని తొలిసారిగా తెరిచిన సంగతి తెలిసిందే. గదిలో ఖజానాకు వెలుపలి ఉన్న వస్తువులను స్ట్రాంగ్ రూమ్‌కి తరలించారు. ఒడిషా ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ బిశ్వనాథ్ రాత్ నేతృత్వంలోని పర్యవేక్షక కమిటీ ఈ గది తెలుపులు తెరిచింది.

జిటి మాల్‌పై చర్యలు

బెంగుళూరు : పంచె కట్టుతో వచ్చారన్న కారణంతో ఫక్కీరప్ప అనే రైతుకు ప్రవేశం నిరాకరించిన బెంగళూరులోని జిటి మాల్‌పై కర్నాటక ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఏడు రోజుల పాటు మాల్‌ను మూసివేయాలని ఆదేశించింది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బి సురేష్ శాసనసభలో గురువారం వెల్లడించారు. ఈ నెల 16న తన కుమారుడుతో కలిసి సినిమా చూసేందుకు మాల్‌కు వచ్చిన రైతును సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడం దేశవ్యాప్తంగా విమర్శలకు దారి తీసిన సంగతి తెలిసిందే.

కాశ్మీర్‌లో ఎదురుకాల్పులు

- ఇద్దరు జవాన్లకు గాయాలు

జమ్ము : జమ్ముకాశ్మీర్‌లో గురువారం ఉదయం మరో ఎన్‌కౌంటర్ జరిగింది. దోడా జిల్లాలోని అటవీ గ్రామంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు గాయపడినట్లు అధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ కొనసాగుతోందని అన్నారు. జడ్డాన్ బాటా గ్రామంలోని కస్టిఘర్ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో సెర్చ్ ఆపరేషన్ నిమిత్తం ఏర్పాటు చేసిన తాత్కాలిక సెక్యూరిటీ శిబిరంపై గురువారం తెల్లవారుజామున 2.00 గంటల సమయంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దోడా జిల్లాలో గత మూడు రోజుల్లో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్ మూడవది. దోడాలోని డెస్సా ప్రాంతంలో సోమవారం ఉగ్రవాదులు జరిపిన దాడిలో నలుగురు జవాన్లు మరణించిన సంగతి తెలిసిందే.

బహుళ రంగాల్లో పరిష్కారాల కేంద్రంగా భారత్

- నీతి ఆయోగ్ వైస్ ఛైర్‌పర్సన్ బెరీ



ఐక్యరాజ్య సమితి : పబ్లిక్ సర్వీస్ డెలివరీ, డిజిటలైజేషన్‌తో సహా పలు రంగాల్లో పరిష్కారాలను అందించే వనరుగా భారత్ రుజువు చేసుకుంటోందని నీతి ఆయోగ్ వైస్ ఛైర్‌పర్సన్ సుమన్‌బెరీ వ్యాఖ్యానించారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లుగా పిలిచే బహుళ జాతీయ కార్పొరేషన్లతో సహా అనేక రంగాల్లో భారత్ తనదైన పరిష్కారాలు చూపుతోందన్నారు. ఐక్యరాజ్య సమితికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. జి-20 అధ్యక్ష బాధ్యతల నిర్వహణలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను పొందుపరచడం ద్వారా పెద్దగా అవకాశాలు లేని తమ ప్రజలకు అంతర్జాతీయ సమాజం ఇచ్చే పవిత్రమైన నిబద్ధత ఇదేనని ప్రకటించిందన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. 'ప్రభుత్వాలు తమ ప్రజలకు ప్రకటించే నిబద్ధతే ఈ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, 21వ శతాబ్దంలో మంచి జీవితానికి ఇదొక తరహా నిబద్ధత' అని ఆయన వ్యాఖ్యానించారు. 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న ప్రధాని మోడీ దార్శనికతపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, 25ఏళ్ళ కాలంలో ఒకే అంశంపై ఏక దృష్టితో కేంద్రీకరించడం ద్వారా ఎంత వరకు సాధించగలమన్నదీ మోడీ ప్రస్తావించారని బెరీ చెప్పారు. జులై 8 నుండి 17 వరకు ఆర్థిక సామాజిక మండలి ఆధ్వర్యంలో ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో సుస్థిరాభివృద్ధిపై ఉన్నతస్థాయి రాజకీయ వేదిక (హెచ్‌ఎల్‌పిఎఫ్) సమావేశాల్లో పాల్గొనేందుకు బెరీ న్యూయార్క్ వచ్చారు. పలు సంక్షోభాలు ముసిరిన వేళ దారిద్ర్యాన్ని నిర్మూలించడం, 2030 ఎజెండాను అమలు చేయడమన్నది ఈ వేదిక ప్రధాన ఉద్దేశ్యంగా వుంది.

నిండు ప్రాణాలను బలిగొన్న హైవేస్ అథారిటీ నిర్లక్ష్యం

- అంకోల ప్రమాదానికి ఎన్‌హెచ్‌ఎఐదే బాధ్యత
- ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్

న్యూఢిల్లీ : కర్ణాటకలోని అంకోల వద్ద ఈ నెల 16న జరిగిన ప్రమాదంలో ఏడుగురు నిండు ప్రాణాలను బలిగొనడానికి జాతీయ రహదారుల అధీకృత సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) నిర్లక్ష్యమే ప్రధానకారణంగా కనిపిస్తోంది. ఈ మేరకు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి అఖిల భారత రహదారుల రవాణా కార్మికుల సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) గురువారం ఒక లేఖ రాసింది. ఈ ప్రమాదానికి ఎన్‌హెచ్‌ఎఐ బాధ్యత వహించి, మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరింది. దేశవ్యాప్తంగా అంకోలా లాంటి ప్రమాదకరమైన చోట్లు జాతీయ రహదారులపై అనేకం ఉన్నాయని, వాటి వివరాలను ఇదివరకే ఫెడరేషన్ అందజేసిందని ఇప్పటికైనా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ కోరింది.

కాగా ప్రమాదం చోటుచేసుకున్న అంకోలాలోని జాతీయ రహదారి 66 సమీపంలో భూమి కుంగిపోవడంతో పక్కనే ఓ స్టాల్ వద్ద టీ తాగుతున్నవారిలో ఏడుగురు మట్టి చరియల్లో చిక్కుకుపోయిన చనిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాంతంలో భూమి పెలుసుగా ఉందని, హైవే నిర్మాణం లోపభూయిష్టంగా ఉందని, ఏక్షణంలోనైనా ఈ ప్రాంతంలో భూమి కుంగిపోయి ప్రమాదాలు చోటుచేసుకునే వీలుందంటూ గతంలోనే కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎఐకి లేఖ రాసింది. అయితే ఈ ప్రతిపాదనలను ఎన్‌హెచ్‌ఎఐ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలోనే గత 16న ప్రమాదం చోటుచేసుకోవడం.. ఏడుగురు నిండు ప్రాణాలు కోల్పోవడం జరిగిపోయాయి. మృతుల్లో ముగ్గురు వివిధ వాహనాల డ్రైవర్లు కాగా, మిగిలిన నలుగురు టీ స్టాల్ నిర్వహిస్తున్న కుంటుబ సభ్యులు.

జాతీయ రహదారులపై ఇలాంటి నిర్మాణాలు వివిధ ప్రాంతాల్లో అనేకం ఉన్నాయని, వీటిని మంత్రిత్వ శాఖ దృష్టికి గతంలోనే ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ తీసుకొచ్చినట్లు తెలిపారు.

అసమ్మతిని అణిచేస్తోన్న మోడీ సర్కార్

- పెన్ ఇంటర్నేషనల్ విమర్శ
- ఐరాస హక్కుల కమిషన్‌కు నివేదిక
- సమాధానం ఇవ్వలేక నీళ్లు నమిలిన ప్రభుత్వ బృందం

న్యూఢిల్లీ : వాక్ స్వాతంత్ర్యంపై లేవనెత్తిన ప్రశ్నలకు భారత ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలపై పెన్ ఇంటర్నేషనల్ అనే అంతర్జాతీయ రచయితల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. భారత్‌లో మానవ హక్కులపై ఐరాస హ్యూమన్ రైట్స్ కమిషన్ ఈ వారంలో సమీక్ష నిర్వహించింది. ఈ సమీక్షలో భారత్‌లో వాక్ స్వాతంత్ర్యంపై పెన్ ఇంటర్నేషనల్ కొన్ని ప్రశ్నలు లేవనెత్తింది. అయితే వాటికి ప్రభుత్వ ప్రతినిధి బృందం సరైన సమాధానాలు ఇవ్వలేకపోయింది. సమీక్ష సందర్భంగా పెన్ ఇంటర్నేషనల్ సంస్థ ఓ నివేదికను అందజేసింది.

భారత్‌లో అసమ్మతి గళాలను మోడీ ప్రభుత్వం అణచివేస్తోందని నివేదిక తెలిపింది. రచయితలు, పాత్రికేయులు, విద్యావేత్తలు, ఇతర విమర్శకులను ఏకపక్షంగా అరెస్టులు చేయడం, విచారణ జరపకుండా సుదీర్ఘ కాలం పాటు నిర్బంధించడం వంటి చర్యలతో చట్టపరంగా వేధిస్తున్నారని వివరించింది. శాంతియుతంగా తమ అభిప్రాయాలు తెలియజేసే వారిని అణగదొక్కేందుకు ప్రభుత్వం న్యాయ వ్యవస్థను ఓ ఆయుధంగా వాడుకోవడం మితిమీరిందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా ప్రభుత్వాన్ని, దాని విధానాలను విమర్శించే వారిపై ఉక్కుపాదం మోపుతున్నారని తెలిపింది. పౌర, రాజకీయ హక్కులపై అంతర్జాతీయ ఒడంబడిక (ఐసిసిపిఆర్) లోని ఆర్టికల్ 19కి ఈ చర్యలు విరుద్ధంగా ఉన్నాయని చెప్పింది.

పెన్ ఇంటర్నేషనల్ లేవనెత్తిన అనేక అంశాలను కమిషన్ సభ్యులు భారత ప్రతినిధుల ముందు ఉంచారు. అయితే పెన్ ఇంటర్నేషనల్ ప్రస్తావించిన అంశాలకు ఆ ప్రతినిధి బృందం సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేకపోయింది. ముఖ్యంగా భావ ప్రకటనా స్వేచ్ఛపై విధిస్తున్న అవాంఛనీయ ఆంక్షలకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక ప్రతినిధి బృందం నీళ్లు నమిలిందని పెన్ ఇంటర్నేషనల్ వ్యాఖ్యానించింది.

ప్రభుత్వ విమర్శకులను అన్యాయంగా విచారించడానికి చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టాన్ని (ఉపా) ప్రభుత్వం ఓ సాధనంగా వాడుకుంటోందని రచయితల సంఘం ఆరోపించింది. ఇందుకు భీమా కోరేగావ్/ఎల్గర్ పరిషత్ కేసును ఉదాహరణగా ప్రస్తావిస్తూ ప్రొఫెసర్ హనీ బాబు, రచయిత వరవరరావు పట్ల అమానుషంగా ప్రవర్తించారని, వైద్య కారణాలు చూపినప్పటికీ వారికి బెయిల్ నిరాకరించారని విమర్శించింది. స్వతంత్ర మీడియా సంస్థ న్యూస్‌క్లిక్‌పై జరిగిన దాడులను కూడా రచయితల సంఘం గుర్తు చేసింది. స్వతంత్ర మీడియాకు సంకెళ్లు వేసేందుకు, ప్రభుత్వంపై ఆన్‌లైన్‌లో చేసే విమర్శలను సెన్సార్ చేసేందుకు ఇప్పటికీ ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయని వివరించింది. ప్రభుత్వంపై అసమ్మతి గళాన్ని వినిపించకుండా అడ్డుకునేందుకు జమ్మూకాశ్మీర్ వంటి ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయాలను నిలిపివేయడాన్ని పెన్ ఇంటర్నేషనల్ తప్పుపట్టింది.

కోటాపై కొనసాగుతున్న ఆందోళనలు

- బంగ్లాదేశ్‌లో ఆగని నిరసనలు
- 19కి చేరిన మృతుల సంఖ్య
- పలువురికి గాయాలు

ఢాకా : 1971 బంగ్లాదేశ్ విమోచన యుద్ధంలో అసువులుబాసిన అమరుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లను నిలిపివేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న విద్యార్థులకు, పోలీసులకు మధ్య ఘర్షణల్లో ఇంతవరకు 19 మంది చనిపోయారు. ఢాకాలోని ప్రైవేట్ యూనివర్శిటీ వద్ద నిరసన తెలియచేస్తున్నవారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలను, రబ్బర్‌బుల్లెట్లను ప్రయోగించారు. దీంతో డజన్ల సంఖ్యలో విద్యార్థులు గాయపడ్డారు. మొబైల్ ఇంటర్‌నెట్ నెట్‌వర్క్‌లను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాల్లో ఘర్షణలు పెచ్చరిల్లాయి. రోడ్లపై, హైవేలపై మానవ హారాలు నిర్మించడం ద్వారా రహదారులను దిగ్బంధించారు. కెనడియన్ యూనివర్శిటీ భవనం కేంపస్ పై కప్పుపై చిక్కుకుపోయిన దాదాపు 60మంది పోలీసు అధికారులను హెలికాప్టర్లు ఉపయోగించి కాపాడారు. ముగ్గురు విద్యార్థులు, రిక్షా డ్రైవర్ గురువారం మరణించారని. వారి శరీరాలపై రబ్బర్ బుల్లెట్ల గాయాలు వున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు. 150మందికి పైగా విద్యార్థులు కువైట్ మోయిత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఢాకాలో ఐదుగురు, సమీపంలోని పట్టణాల్లో మరో ఇద్దరు మొత్తంగా ఏడుగురు మరణించారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ వారం ప్రారంభంలో ఏడుగురు మరణించారు. దీంతో మొత్తంగా ఈ నిరసనల్లో 18మంది మృతి చెందారు. బంగ్లాదేశ్‌లో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చింది. 17 కోట్ల ఆ దేశ జనాభాలో అయిదో వంతు మంది విద్యావంతులైన నిరుద్యోగ యువత ఉంది. ఈ రిజర్వేషన్ సంస్కరణలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలును ఆగస్టు 7న సుప్రీం కోర్టు విచారణ జరపనుంది. అందోళనలతో ఉద్రిక్తంగా మారిన ఢాకాలో అమెరికన్ ఎంబసీని గురువారం మూసివేశారు. ప్రభుత్వ యూనివర్సిటీలను ఇప్పటికే మూసివేశారు.



ఢాకాలోని రాంపుర ప్రాంతంలో నిర్వహించిన ఆందోళనలపై పోలీసుల దాడిలో గాయపడిన అవామీ లీగ్ కార్యకర్త

న్యాయ విచారణకు ఆదేశం

అమరుల కుటుంబాలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల సందర్భంగా జరిగిన అన్ని హత్యలపైన న్యాయ విచారణకు బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా బుధవారం ఆదేశించారు. 1971 బంగ్లా దేశ్ విమోచనా పోరాటానికి నాయకత్వం వహించిన షేక్ ముజిబుర్ రహ్మాన్ కుమార్తె ప్రస్తుత ప్రధాన మంత్రి షేక్ హసీనా అన్న సంగతి తెలిసిందే. రిజర్వేషన్ల వ్యతిరేక పోరాటంలో హత్యలు, లూటీలు వంటి విధ్వంసకర చర్యలకు పాల్పడినవారు ఎంతటివారైనప్పటికీ ఉపేక్షించేది లేదని హసీనా చెప్పారు. కొన్ని స్వార్థపర శక్తులు తమ స్వప్రయోజనాల కోసం ఈ ఉద్యమంలో దూరి హింసను ప్రేరేపించడం విచారకరమని ఆమె అన్నారు. ఈ రిజర్వేషన్ల అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున అందరూ ఓపిక పట్టాలని హసీనా కోరారు. మరోవైపు నిరసనకారులతో చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని న్యాయ శాఖ మంత్రి అనిసుల్ హాక్ ఒక ప్రకటనలో తెలిపారు.

నీట్- యుజి ఫలితాలు 20న వెల్లడించాలి

(మొదటి పేజీ తరువాయి)

రీఎగ్జామ్‌కు ఆదేశిస్తామని గతంలో సుప్రీంకోర్టు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

పరీక్షా ఫలితాలను వెబ్‌సైటులో అందుబాటులో ఉంచాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. నీట్-యూజీ పరీక్షకు సంబంధించి దాఖలైన పిటిషన్లను ఈ నెల 22న తిరిగి విచారిస్తామని తెలిపింది. పరీక్షా కేంద్రాల వారీగా ఫలితాలు ప్రకటించేటప్పుడు విద్యార్థుల వివరాలు కన్పించకుండా చూడాలని సూచించింది.

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ గతంలో పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సామాజిక పరిణామాలను దృష్టిలో ఉంచుకొని నీట్ పరీక్షకు సంబంధించిన పిటిషన్ల విచారణకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందోనని లక్షలాది మంది విద్యార్థులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారని వ్యాఖ్యానించారు.

'దేశంలో ఎన్ని మెడికల్ సీట్లు అందుబాటులో ఉన్నాయి? అభ్యర్థులు నీట్ పరీక్షలో పొందిన కనీస మార్కులు ఎన్ని? ఎంతమంది విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు?' అని న్యాయవాదులను ప్రశ్నించారు. 23 లక్షల మంది పరీక్ష రాస్తే లక్ష మంది మాత్రమే వైద్య కళాశాలల్లో ప్రవేశం పొందగలరని గుర్తు చేశారు. పెద్ద ఎత్తున పేపర్ లీక్ అయిందని తెలితేనే రీ-ఎగ్జామ్‌కు ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఉదంతంపై సీబీఐ కూడా విచారణ జరుపుతోందని, అయితే ఆ సంస్థ అందజేసిన వివరాలను బయటపెడితే దర్యాప్తుపై ప్రభావం పడుతుందని చెప్పారు.

మే ఐదవ తేదీన నీట్-యూజీ 2024 పరీక్షను దేశంలోని 571, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. దీనికి 23.33 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా పత్రం లీక్ అయిందని, పరీక్ష నిర్వహణలో అనేక అవకతవకలు జరిగాయని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. నీట్ ఫలితాల్లో ఏకంగా 67 మందికి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ రావడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. 1,563 మందికి గ్రేస్ మార్కులు కలపడం, ఓఎంఆర్ షీట్లు అందుబాటులో లేకపోవడంపై కూడా విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని, పరీక్షను రద్దు చేయాలని డిమాండ్లు వినవచ్చాయి. అయితే గోప్యతను పెద్ద ఎత్తున ఉల్లంఘించినట్లు ఆధారాలేవీ లభించనందున పరీక్షను రద్దు చేస్తే ప్రతికూల ఫలితాలు వస్తాయని, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని కేంద్రం, ఎన్టీఏ తమ అఫిడవిట్లలో తెలియజేశాయి.

ఇదిలావుండగా వైద్య కళాశాలలు తమ అధికారిక వెబ్‌సైట్లలో సీట్ల వివరాలు పొందుపరచాలని మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎంసీసీ) నోటీసు జారీ చేసింది. యూజీ కౌన్సిలింగ్‌లో పాల్గొనే కళాశాలలు ఈ నెల 20వ తేదీ నుండి ఆ వివరాలను ఎంసీసీ పోర్టల్‌లో ఉంచాలని సూచించింది.

యుపిలో రైలు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

కలుగుతోంది. రెండు రైళ్లను పూర్తిగా రద్దు చేయగా, మరో 11 రైళ్లను దారి మళ్లించారు. ప్రమాదానికి గురైన రైలు ప్రయాణీకుల కోసం ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. కాగా, ప్రమాదంలో మరణించిన వారి సంఖ్యపై సందిగ్ధత నెలకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించారని నార్త్ ఈస్టన్ రైల్వే జనరల్ మేనేజర్ సౌమ్య మథూర్, ఇతర రైల్వే అధికారులు ప్రకటించారు. అయితే ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పఠాక్, గోండా కలెక్టర్ నెహ శర్మ ఈ ప్రమాదంలో నలుగురు మరణించినట్లు మీడియాకు వెల్లడించారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి అదిత్యానాథ్ తీవ్రంగా స్పందించారు. బాధిత ప్రయాణీకులకు తగిన సహాయం అందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ మాట్లాడుతూ ఈ ప్రమాదంపై స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదానికి ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. రైల్వే భద్రతను మోడీ ప్రభుత్వం 'ఏ విధంగా ప్రణాళికాబద్ధంగా ప్రమాదంలో పడేసింది' అనేదానికి ఈ ప్రమాదం ఒక ఉదాహరణ అని ఖర్గే విమర్శించారు.

కాగా, 2024లో ఇది నాలుగో రైలు ప్రమాదం. గత నెలలో పశ్చిమ బెంగాల్‌లోని డార్జింగ్‌లో కంచనగంగ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 10 మంది మరణించగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు.

కాటన్ బ్యారేజ్ వద్ద 10 అడుగుల నీటిమట్టం


ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. మూడు రోజులుగా నిలకడగా ఉన్న నీటి మట్టం గురువారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 10 అడుగులకు చేరింది. ఇన్ ఫ్లో 1.53లక్షల క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 1.43లక్షల క్యూసెక్కులు ఉంది. పంట కాలువలు ద్వారా 8,700క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ (8977935609), రాజమండ్రి ఆర్‌డిఒ కార్యాలయం (0883 2442344), కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం(08812 231488) విద్యుత్తు ఫిర్యాదుల కేంద్రం కంట్రోల్ రూం(1902)లను ఏర్పాటు చేశారు.

నల్లమడను పరిశీలించిన రైతుసంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి సమీపంలో కట్టలు బలహీనపడిన నల్లమడ వాగును జిల్లా నేతలతో కలిసి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాలకు వరద ముంపు బారి నుండి లక్షలది ఎకరాల పంట నష్టాన్ని నివారించే నల్లమడ డ్రెయిన్ అభివృద్ధిపై ప్రభుత్వం అనాదిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. నల్లమడ రైతు సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులను కలిసి 2020లో అప్పటి సిఎం జగన్ దృష్టికి ముంపు సమస్య తీసుకెళ్లి ఆధునికీకరణ పనులు ప్రారంభించటానికి అనుమతి, నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదన్నారు. పర్చూరులో నల్లమడ అడవుల సమీపంలో ప్రారంభమయ్యే నల్లమడ వాగు బాపట్ల మండలం సూర్యలంక సమీపంలోని పోగురు వద్ద సముద్రంలో కలుస్తోందన్నారు. వాగు దిగువ ప్రాంతంలో మరింత వెడల్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడారు. అంతకుముందు బాపట్ల శివారు ఫ్యాంప్ డ్రెయిన్, మూలపాలెం శివారులో మురుగు, పంట కాలువలతోపాటు పిటి చానల్‌ను రైతు నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబుకు వినతిపత్రం అందజేశారు. కాలువలు పరిశీలించిన వారిలో రైతు నాయకులు తల్లపనేని రామారావు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, గోవిందరెడ్డి, కొండయ్య, వి. కృష్ణమూర్తి, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం

ఏడుగురి మృతి

ముంబయి : మహారాష్ట్రలో విషాదం చోటుచేసుకుంది. జాల్నా జిల్లాలో భక్తులతో వెళ్తున్న ఓ టాక్సీ వాహనం అదుపుతప్పి బావిలో పడడంతో ఏడుగురు మృతి చెందారు. 11 మంది ప్రయాణీకులు పండరీపురం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుల్లో జాల్నా జిల్లాకు చెందినవారుగా గుర్తించారు. గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలో వాహనం బావిలో పడ్డట్టు స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఘటనలో మరో ముగ్గురు గాయపడ్డారు. వీరిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-అమలాపురం

కోనసీమ జిల్లా పరిధిలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొరుగు సేవల (అవుట్‌సోర్సింగ్) విధానంలో 8 కేటగిరీలలో తొమ్మిది పోస్టుల భర్తీకి గురువారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ అధ్యక్షతన ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పోస్టు భర్తీకి 21 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. అదే విధంగా ఒక ప్రొటెక్షన్ అధికారి పోస్ట్ భర్తీకి (ఇన్స్టిట్యూషనల్‌కేర్)గాను 35 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆమె తెలిపారు. అదే విధంగా ఒక ప్రొటెక్షన్ అధికారి (నాన్ ఇన్స్టిట్యూషనల్ కేర్) పోస్టుకుగాను 34 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు అలాగే ఒక కౌన్సిలర్ పోస్టుకు 18 మంది దరఖాస్తు చేసుకున్నారని, రెండు సోషల్ వర్కర్ పోస్టుల భర్తీకి 44 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఒక డేటా ఎనలిస్ట్ పోస్టుకు 28 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఒక అసిస్టెంట్ కం డిఈఓ పోస్ట్ భర్తీకి గాను 23 దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఒక ఔట్రీచ్ వర్కర్ పోస్టు భర్తీకి 20 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంట ర్వ్యూలు నిర్వహించిన వారిలో ఐసిడిఎస్ పథక సంచాలకులు ఎం.ఝాన్సీరాణి, సిడబ్ల్యూసి ఛైర్‌పర్సన్ పి.సూర్య ప్రభావతి, జువైనల్ జస్టిస్ బోర్డ్ నెంబర్ తబిత, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసం చాలకులు పి జ్యోతిలక్ష్మీదేవి ఉన్నారు.

శ్రీకాకుళంలో వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ!

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రపంచస్థాయి వసతులు, సౌకర్యాలతో కూడిన అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ అకాడమీని శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం అందిస్తుందని కేంద్ర పౌరవిమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఒలింపిక్ పతక విజేత, జిల్లావాసి కరణం మల్లీశ్వరితో అన్నారు. ఢిల్లీలో గురువారం వారిరువురి మధ్య జరిగిన స్నేహపూర్వక భేటీలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారత మహిళా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించిన రోజులు తనకు ఇప్పటికీ గుర్తున్నాయన్నారు. తెలుగు వారి ఖ్యాతిని, సిక్కోలు గౌరవాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటి చెప్పిన కరణం మల్లీశ్వరి అంటే జిల్లా ప్రజలు ఎంతగానో అభిమానిస్తారని రామ్మోహన్ నాయుడు గుర్తు చేసుకున్నారు. ఢిల్లీ స్పోర్ట్స్ యూనివర్సిటీ తొలి వైస్ ఛాన్సలర్‌గా క్రీడాభివృద్ధికి ఆమె చేస్తున్న కృషిని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే నైపుణ్యంగల వారు తెలుగు రాష్ట్రాల్లో మెండుగా ఉన్నారని, వారిని గుర్తించి సానపడితే అద్భుతాలు సృష్టించవచ్చని కరణం మల్లీశ్వరి తెలిపారు. క్రీడలపై రామ్మోహన్ నాయుడుకు ఉన్న ఆసక్తిని, క్రీడాభివృద్ధికి కేంద్రమంత్రిగా చేస్తున్న ఆలోచనలను ఆమె అభినందించారు. త్వరలోనే శ్రీకాకుళం వస్తానని, క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందడుగు వేస్తానని తెలిపారు.

ఇయు కమిషన్ అధ్యక్షులుగా ఉర్సులా వాన్ డెర్ లేయన్ ఎన్నిక

స్ట్రాస్‌బర్గ్, ఫ్రాన్స్ : యురోపియన్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ కమిషన్ అధ్యక్షురాలిగా ఐదేళ్ళ పదవీకాలానికి రెండోసారి ఉర్సులా వాన్ డెర్ లేయన్ తిరిగి ఎన్నికయ్యారు. యురోపియన్ పార్లమెంట్ సభ్యులు గురువారం ఆమెను ఎన్నుకున్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధం నుండి వాతావరణ మార్పులు, వలసలు ఇలా పలు సంక్షోభాలతో యురోపియన్ యూనియన్ సతమతమవుతున్న వేళ ఉర్సులా రెండోసారి ఎన్నికయ్యారు.



సంక్షోభాల వేళ యూరప్‌కు బలమైన నేత కావాలంటూ ఆమె ప్రసంగించిన నేపథ్యంలో 720 సీట్లు గల పార్లమెంట్‌లో మెజారిటీ సభ్యులు ఆమెకు ఓటు వేశారు. ఇయు నుండి బ్రిటన్ వైదొలగడం, కోవిడ్ మహమ్మారి, ఉక్రెయిన్‌పై రష్యా దాడి వంటి అనేక సమస్యలతో సహా గత ఐదేళ్ల కాలంలో వాన్ డెర్ లేయన్ అనేక సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. లేయన్ క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ భాగస్వామ్య పక్షంగా వున్న యురోపియన్ పీపుల్స్ పార్టీ ఇయు పార్లమెంట్‌లో అతిపెద్ద గ్రూపుగా నిలిచిన నేపథ్యంలో ఈ ఎన్నిక మరింత ఊపునిచ్చింది.

'అవినీతి' నేతలకు ఉద్వాసన

చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం

బీజింగ్ : అవినీతి, అక్రమాలను ఏ స్థాయిలోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని చైనా కమ్యూనిస్టు పార్టీ ఉద్ఘాటించింది. అవినీతి, అక్రమాల నేపథ్యంలో ఇటీవల తొలగింపునకు గురైన విదేశాంగ మంత్రి కిన్ గాంగ్ పార్టీకి చేసిన రాజీనామాను చైనా కమ్యూనిస్టు పార్టీ గురువారం ఆమోదించింది. మాజీ రక్షణ మంత్రి లీ షంగ్ఫూ, మరో ఇద్దరు సైనిక జనరల్స్‌ను కూడా పార్టీ నుండి బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయాలను ధృవీకరించింది. గురువారం ముగిసిన చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఏర్పాటైన నాలుగు రోజుల చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్లీనరీ సమావేశాల ముగింపులో ఈ మేరకు ప్రకటన వెలువడింది. కిన్ స్థానంలో వాంగ్ యిని విదేశాంగ మంత్రిగా తీసుకువచ్చారు. ఆయన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులుగా కూడా వున్నారు. జనరల్ లి షంగ్ఫూ, మరో ఇద్దరు సీనియర్ జనరల్స్‌ను పార్టీ నుండి బహిష్కరిస్తూ పార్టీ పొలిట్‌బ్యూరో తీసుకున్న నిర్ణయాన్ని కూడా ప్లీనరీ సమావేశం ధృవీకరించింది. షంగ్ఫూపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆయనను విచారిస్తున్నారు. అవినీతి, క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన మరో జనరల్ సున్ జినింగ్‌ను కూడా పార్టీనుండి తొలగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సమావేశం ధృవీకరించింది.

నీట్ పేపర్ లీక్ కేసు

నలుగురు ఎంబిబిఎస్ విద్యార్థుల అరెస్టు

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంలో సిబిఐ తాజాగా మరో నలుగుర్ని అరెస్టు చేసింది. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన అధికారులు.. గురువారం నలుగురు ఎంబిబిఎస్ విద్యార్థుల్ని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా బిహార్‌లోని పాట్నా ఎయిమ్స్‌లో చదువుతున్న వారే కావడం గమనార్హం. అరెస్టయిన వారిలో ముగ్గురు (చందన్ సింగ్, రాహుల్ అనంత్, కుమార్ షాను) ఎంబిబిఎస్ మూడో సంవత్సరం చదువుతుండగా.. మరొకరు (కరన్ జైన్) మొదటి సంవత్సరం చదువుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నలుగురు విద్యార్థుల్ని విచారించాల్సి ఉందని ముందుగానే సమాచారం ఇచ్చిన అధికారులు.. ఎయిమ్స్ సీనియర్ ఫ్యాకల్టీ సభ్యుల సమక్షంలో హాస్టల్ గదుల నుంచి తీసుకెళ్లారు. అనంతరం వారి హాస్టల్ గదుల్ని సీల్ చేశారు. వీరిని సిబిఐ అదుపులోకి తీసుకున్నట్లు ఎయిమ్స్ పాట్నా డైరెక్టర్ జీకే పాల్ వెల్లడించారు. డీన్, హాస్టల్ వార్డెన్, డైరెక్టర్ ఓఎస్‌డీ సమక్షంలో వారిని అదుపులోకి తీసుకుందన్నారు. నీట్ పరీక్ష జరగడానికి ముందు జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)కి చెందిన ట్రంక్ పెట్టె నుంచి నీట్ పేపర్‌ను తస్కరించాడన్న కేసులో 2017 బ్యాచ్ ఎన్ఐటీ జంషెడ్‌పూర్ సివిల్ ఇంజినీర్ పంకజ్ కుమార్ అలియాజ్ ఆదిత్యను అరెస్టు చేసిన రెండు రోజుల తర్వాత వీరిని అదుపులోకి తీసుకోవడం గమనార్హం. పంకజ్ బకారోకు చెందినవాడు కాగా.. పాట్నాలో అతడిని అరెస్టు చేశారు.

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత(లు) / కో అప్లికెంట్(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) / సహఅబ్లిగెంట్(లు): 1) జితేంద్ర జైన్, తండ్రి: భుర్మల్ జైన్, డి.నెం. 9-76-14, 2వ అంతస్తు, మహేశ్వరి ఎసి ఫ్యామిలి దాబా పైన, హిందూ హైస్కూల్, కొత్తపేట, విజయవాడ-5200001. **2) శ్రీమతి రింకల్ జైన్, భర్త: జితేంద్ర జైన్,** డి.నెం. 9-76-14, 2వ అంతస్తు, మహేశ్వరి ఎసి ఫ్యామిలి దాబా పైన, హిందూ హైస్కూల్, కొత్తపేట, విజయవాడ-5200001.

విషయం : బ్యాంక్ వారికి శ్రీ జితేంద్ర జైన్ ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 **సెక్షన్ 13(2)** క్రింద **ది.14-05-2018** న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.20-11-2020** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడమైనది.

ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్నా విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖావుంచబడిన ఆస్తి వివరములు : దస్తావేజు నెం.5571/2015 ప్రకారం విజయవాడ, పటమట, అశోక్ నగర్, రఘు గార్డెన్స్ రోడ్, కొల్లు రామదాసు వీధి, పప్పుల మిల్లు రోడ్డు దగ్గర, గద్దె రామమోహన రావు ఇల్లు వెనుక, ఆర్ఎస్.నెం.221/7, డోర్ నెం.74-31/1-19/1 నందు శ్రీ జితేంద్ర జైన్, తండ్రి: భుర్మల్ జైన్‌కు చెందిన మొత్తం 266.20 చ॥గ॥ల విస్తీర్ణములో మొత్తం రెండవ అంతస్తు 66.55 చ॥గ॥ల (అవిభాజ్యపు భాగము) విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఇంటి భాగమునకు సంబంధించిన యావదాస్తి. గూగుల్ కో-ఆర్డినేట్స్: అక్షాంశం: 16.484103 రేఖాంశం: 80.67773, **స్థలమునకుహద్దులు: తూర్పు:** రోడ్డు, **పడమర :** గద్దె అనురాధ యొక్క ఆస్తి, **దక్షిణం:** ముమ్మనేని వినయ్ కుమార్ యొక్క ఆస్తి, **ఉత్తరం:** కాజ సీతారావమ్మ యొక్క ఆస్తి. **ఫ్లాట్‌కు హద్దులు : తూర్పు:** లిఫ్ట్ మరియు ఉమ్మడి వరండా, **పడమర:** మెట్లు మరియు ఉమ్మడి వరండా, **దక్షిణం:** శున్యాకాశము, **ఉత్తరం:** శున్యాకాశము.

స్థలం : విజయవాడ
తేది : 12-07-2024

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత(లు) / కో అప్లికెంట్(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) / సహఅబ్లిగెంట్(లు): 1) మెస్సర్స్ లక్ష్మీ గణేష్ కాటన్స్(ఋణగ్రహీత), శ్రీ వంగా శ్రీనివాసరెడ్డి, డి.నెం.24-38-56/3, ఆర్. అగ్రహారం, ఏటుకూరు మెయిన్ రోడ్, గుంటూరు-522003, ఆంధ్రప్రదేశ్, 2) శ్రీ వంగా శ్రీనివాసరెడ్డి (యజమాని), తండ్రి : శ్రీ నాగరెడ్డి, డి.నెం.4-23, చలంరెడ్డిపాలెం, జొన్నలగడ్డ, గుంటూరు-522034, ఆంధ్రప్రదేశ్, 3) శ్రీమతి మదన మల్లేశ్వరి(హామీదారురాలు/తనఖాదారురాలు), భర్త : వెంకటప్పారెడ్డి, డి.నెం.4-22-68, చైతన్యపురి, 2వ లైను, కొరిటెపాడు, గుంటూరు-522007, ఆంధ్రప్రదేశ్, 4) శ్రీ వెంకటప్పారెడ్డి(హామీదారు), తండ్రి : అంకిరెడ్డి, డి.నెం.4-22-68, చైతన్యపురి, 2వ లైను, కొరిటెపాడు, గుంటూరు-522007, ఆంధ్రప్రదేశ్.

విషయం : బ్యాంక్ వారికి శ్రీమతి మదన మల్లేశ్వరి ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 **సెక్షన్ 13(2)** క్రింద **ది.04-08-2021** న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.29-03-2022** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడమైనది.

ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్నా విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

(ది.20-04-1996 నాటి దస్తావేజు నెం.2360/1996 ప్రకారం) గుంటూరు సిటీ, అమరావతి రోడ్, న్యూ గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోరంట్ల, జ్వరాల హాస్పిటల్ వెనుక, కొరిటెపాడు (గ్రామము), డి.నెం.137/గుంటూరు, ప్లాట్ నెం.45 లోని **శ్రీమతి మదన మల్లేశ్వరి, భర్త : వెంకటప్పారెడ్డికి చెందిన 246.00 చ॥గ॥ల విస్తీర్ణముగల ఖాళీ భూమి(రెసిడెన్షియల్)కి** సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** 30అ॥ల రోడ్డు; **పడమర :** వడ్లమూడి వెంకటేశ్వరరావుకు చెందిన ప్లాట్ నెం.30 ఆస్తి; **ఉత్తరం :** ప్లాట్ నెం.46 లోని ఆస్తి, **దక్షిణం :** ప్లాట్ నెం.44 లోని ఆస్తి.

స్థలం : విజయవాడ
తేది : 10-07-2024

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత(లు) / కో అప్లికెంట్(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) / సహఅబ్లిగెంట్(లు): 1 ఎ) శ్రీ భైరపు తిరుపతి రావు, తండ్రి: భైరపు రాఘవయ్య, డోర్ నెం. 174, ధూళిపాళ్ళ గ్రామం, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522403. **1 బి) శ్రీ భైరపు గోవిందమ్మ, భర్త: శ్రీ భైరపు తిరుపతిరావు,** డోర్ నెం. 174, ధూళిపాళ్ళ గ్రామం, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522403.

విషయం : బ్యాంక్ వారికి శ్రీ భైరపు తిరుపతి రావు ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 **సెక్షన్ 13(2)** క్రింద **ది.10-05-2021** న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.19-08-2021** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడమైనది.

ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్నా విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖావుంచబడిన ఆస్తి వివరములు : ఐటెం నెం.1 : సత్తెనపల్లి యస్ఆర్ఒలో తేది.30-01-2013న రిజిస్టర్డ్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.489/2013 ప్రకారం : పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, ధూళిపాళ్ళ గ్రామం, వార్డు నెం.7, డోర్ నెం. 378-బి నందు భైరపు తిరుపతిరావుకు చెందిన 145.00 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ భూమి మరియు అందులోని బిల్డింగ్‌కు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** తొండపి రోడ్డు, **దక్షిణం:** అభ్యర్థి యొక్క స్థలము (ఐటెం నెం.2) మరియు రాయిడి వీరాంజనేయులు మరియు ఇతరుల మధ్య ఉమ్మడి గోడ, **పడమర:** బజార్, **ఉత్తరం:** తూము నీరు, రాయిడి నాగేశ్వరరావు యొక్క స్థలము.

ఐటెం నెం.1 : సత్తెనపల్లి యస్ఆర్ఒలో తేది.02-04-2015న రిజిస్టర్డ్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.5050/2015 ప్రకారం : పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, ధూళిపాళ్ళ గ్రామం, వార్డు నెం.7, డోర్ నెం. 378-బి నందు భైరపు తిరుపతిరావుకు చెందిన 80.00 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీ భూమికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు:** తొండపి రోడ్డు, **దక్షిణం:** షేక్ చిన మీర్సా యొక్క స్థలము, **పడమర:** రాయిడి వీరాంజనేయులు యొక్క స్థలము, **ఉత్తరం:** ఐటమ్ నెం.1.

తేది: 11-07-2024
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత(లు) / కో అప్లికెంట్(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) / సహఅబ్లిగెంట్(లు): 1) శ్రీమతి సూరవరాజు మధురవాణి (ఋణగ్రహీత), భర్త: ధనుంజయరావు, ఫ్లాట్ నెం. 402, టి.ఎస్.ఆర్. ఎంక్లేవ్, ఎన్‌సిసి హౌస్ దగ్గర, 12వ వీధి, శ్యామల నగర్, గుంటూరు-522006. **2) శ్రీమతి సూరవరాజు మధురవాణి (హామీదారు), భర్త: ధనుంజయరావు,** ఫ్లాట్ నెం. 402, టి.ఎస్.ఆర్. ఎంక్లేవ్, ఎన్‌సిసి హౌస్ దగ్గర, 12వ వీధి, శ్యామల నగర్, గుంటూరు-522006. **3) శ్రీ ధనుంజయరావు (కో-అప్లికెంట్), తండ్రి: సత్యనారాయణరావు,** ఫ్లాట్ నెం. 402, టి.ఎస్.ఆర్. ఎంక్లేవ్, ఎన్‌సిసి హౌస్ దగ్గర, 12వ వీధి, శ్యామల నగర్, గుంటూరు-522006.

విషయం : బ్యాంక్ వారికి శ్రీమతి సురవరాజు మధురవాణి ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్థు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 **సెక్షన్ 13(2)** క్రింద **ది.01-11-2018** న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.02-02-2019** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడమైనది.

ఋణగ్రహీత(లు) / కో అప్లికెంట్(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) / సహఅబ్లిగెంట్(లు): **1) శ్రీ జాన్ రాయలు ఏటుకూరి,** ఫ్లాట్ నెం. జిఎఫ్ఎల్, కొండెల అపార్ట్‌మెంట్స్, మొదటి వీధి, లైన్స్ క్లబ్ హాస్పిటల్ వెనుక, లక్ష్మీపురం, గుంటూరు-522006. **2) శ్రీ ఆవుల శంకరరావు, తండ్రి: ఎ. వెంకటేశ్వర్లు,** డోర్ నెం. 4-471, ఎం.ఆర్.ఓ. ఆఫీసు ఎదురుగా, శర్మ సర్వీస్ స్టేషన్, పెదకాకాని, గుంటూరు జిల్లా- 522509, **3) శ్రీమతి ఆవుల రేవతి లత, భర్త: ఆవుల శంకరరావు,** డోర్ నెం. 15-9-87, 5వ వీధి, వినోభనగర్, గుంటూరు-522002. **4) శ్రీ కాంతిలాల్ పటేల్ పొకర్,** నెం.7-1-68/69/బి1, డి.కె. రోడ్డు, అమీర్‌పేట, హైదరాబాద్. **5) శ్రీ శౌరి రాయలు ఏటుకూరి, తండ్రి:** ప్రకాశం, ఫ్లాట్ నెం. 504, తులసి హైట్స్, డోర్ నెం. 7-39, రామ్ చర్చ్ రోడ్డు, ఏటుకూరు, గుంటూరు జిల్లా, **6) శ్రీ ఏటుకూరి మర్తమ్మ, భర్త: శౌరి రాయలు,** ఫ్లాట్ నెం. 504, తులసి హైట్స్, డోర్ నెం. 7-39, రామ్ చర్చ్ రోడ్డు, ఏటుకూరు, గుంటూరు జిల్లా.

విషయం : బ్యాంక్ వారికి శ్రీ ఆవుల శంకరరావు, శ్రీమతి ఆవుల రేవతి లత, శ్రీ ఏటుకూరి శౌరి రాయలు & శ్రీమతి ఏటుకూరి మర్తమ్మ ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూర్టిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూర్టిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ **13(2)** క్రింద **ది.08-04-2021** న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.16-08-2021** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడమైనది.

ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్నా విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖావుంచబడిన ఆస్తి వివరములు : 1) గుంటూరు యస్‌ఆర్‌ఒ లో ది.18-04-2018 న రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.3659/2018 ప్రకారం : గుంటూరు జిల్లా, బుడంపాడు గ్రామం, అశోక్ లేలాండ్ సర్వీస్ రోడ్డు దగ్గర, డి.నెం. 286-బి నందు **ఆవుల శంకరరావు మరియు ఆవుల రేవతిలత** కు చెందిన 500 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు : తూర్పు:** డొంక రోడ్డు, **పడమర:** ఎం. రమాదేవి యొక్క ఆస్తి, **ఉత్తరం:** ఎ. శంకరరావు మరియు ఎ రేవతి లత యొక్క ఆస్తి, **దక్షిణం:** ఎ. శంకర్ యొక్క ఆస్తి.
2) గుంటూరు యస్‌ఆర్‌ఒ లో ది.18-04-2018 న రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.3660/2018 ప్రకారం : గుంటూరు జిల్లా, బుడంపాడు గ్రామం, అశోక్ లేలాండ్ సర్వీస్ రోడ్డు దగ్గర, డి.నెం. 286-బి నందు **ఆవుల శంకరరావు మరియు ఆవుల రేవతిలత** కు చెందిన 500 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు : తూర్పు:** డొంక రోడ్డు, **పడమర:** ఎం. రమాదేవి యొక్క ఆస్తి, **ఉత్తరం:** ఎ. శంకరరావు యొక్క ఆస్తి, **దక్షిణం:** ఎ. శంకరరావు మరియు ఎ రేవతి లత యొక్క ఆస్తి.
3) గుంటూరు యస్‌ఆర్‌ఒ లో ది.18-04-2018 న రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.3658/2018 ప్రకారం : గుంటూరు జిల్లా, బుడంపాడు గ్రామం, అశోక్ లేలాండ్ సర్వీస్ రోడ్డు దగ్గర, డి.నెం. 286-బి నందు **ఆవుల శంకరరావు మరియు ఆవుల రేవతిలత** కు చెందిన 1000 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు : తూర్పు:** డొంక రోడ్డు, **పడమర:** ఎం. రమాదేవి యొక్క ఆస్తి, **ఉత్తరం:** ఎ. శంకరరావు మరియు ఎ రేవతి లత యొక్క ఆస్తి, **దక్షిణం:** ఎ. శంకరరావు మరియు ఎ రేవతి లత యొక్క ఆస్తి.
4) గుంటూరు యస్‌ఆర్‌ఒ లో ది.15-04-2013 న రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.5000/2013 ప్రకారం : గుంటూరు జిల్లా, ఏటుకూరు, కిట్స్ కాలేజీ రోడ్డు, సాయిబాబా గుడి దగ్గర, డి.నెం.86, ప్లాట్ నెం.10 నందు **ఏటుకూరి శౌరి రాయలుకు** చెందిన 143.33 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు : తూర్పు:** బెల్లపు అంకమ్మకు చెందిన ప్లాట్ నెం.18, **పడమర:** ఆవుల విజయకుమారి చెందిన భూమి, **ఉత్తరం:** చావ వెంకట శివకుమార్ మరియు ఇతరులు, **దక్షిణం:** 18 అ॥ల వెడల్పు రోడ్డు.
5) గుంటూరు యస్‌ఆర్‌ఒ లో ది.07-04-2014 న రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.3688/2014 ప్రకారం : గుంటూరు జిల్లా, ఏటుకూరు, కిట్స్ కాలేజీ రోడ్డు, సాయిబాబా గుడి దగ్గర, డి.నెం.86, ప్లాట్ నెం.10 నందు **ఏటుకూరి శౌరి రాయలుకు** చెందిన 143.11 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు : తూర్పు:** ఇ. మార్తమ్మకు చెందిన ప్లాట్ నెం.11, **పడమర:** 15 అడుగుల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** కొణతం శ్రీనివాసరావు, **దక్షిణం:** ప్లాట్ నెం.9.
6) గుంటూరు యస్‌ఆర్‌ఒ లో ది.06-11-2013 న రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.9622/2013 ప్రకారం : గుంటూరు జిల్లా, ఏటుకూరు, కిట్స్ కాలేజీ రోడ్డు, సాయిబాబా గుడి దగ్గర, డి.నెం.86, ప్లాట్ నెం.11 నందు **ఏటుకూరి మార్తమ్మకు** చెందిన 148.22 చ॥గ॥ల విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలమునకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు : తూర్పు:** 20 అడుగుల వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం.10, **ఉత్తరం:** కొణతం శ్రీనివాసరావు మరియు ఇతరులు, **దక్షిణం:** ప్లాట్ నెం.12.

స్థలం : విజయవాడ
తేది : 10-07-2024
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

यूनियन बैंक Union Bank of India

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత(లు) / కో అప్లికెంట్(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) / సహఅబ్లిగెంట్(లు) : 1) మెస్సర్స్ ది ప్రింట్ హౌస్ (ఋణగ్రహీత/యజమాని) శ్రీ పిళ్ళా రాజేష్, తండ్రి : పి. డైమండ్ రాజు, **డి.నెం.6-11-56, 11/2,** అరండల్‌పేట, **గుంటూరు-522002,** ఆంధ్రప్రదేశ్, 2) శ్రీ పిళ్ళా రాజేష్ (యజమాని), తండ్రి : పి. డైమండ్ రాజు, **డి.నెం.4-16-58/ఎ,** జ్యోతి నివాస్, కేరాఫ్ : జి. ఆనందరావు, భారత్‌పేట, 3వ లైను, **గుంటూరు-522004,** ఆంధ్రప్రదేశ్, 3) శ్రీమతి మీసాల బాంధవి(హామీదారురాలు), భర్త : శ్రీ పిళ్ళా రాజేష్, ఎఆర్‌టి సెంటర్, ఐడిహెచ్, జ్వరాల హాస్పటల్, **గుంటూరు-522001,** ఆంధ్రప్రదేశ్, 4) శ్రీమతి పిళ్ళా నయోమి (హామీదారు/ తనఖాదారు), భర్త : పి. డైమండ్ రాజు, **డి.నెం.6-11-56, 11/2,** అరండల్‌పేట, **గుంటూరు-522002,** ఆంధ్రప్రదేశ్, 5) శ్రీమతి పిళ్ళా నయోమి (హామీదారు/ తనఖాదారు), కేరాఫ్ : యక్కల మాణిక్యాలరావు, **డి.నెం.294,** సాయిబాబా గుడి దగ్గర, సరిపల్లి గ్రామము, గణపవరం మండలం, పశ్చిమగోదావరి **-534201,** ఆంధ్రప్రదేశ్, 6) శ్రీమతి మీసాల బాంధవి(హామీదారురాలు), భర్త : శ్రీ పిళ్ళా రాజేష్, **డి.నెం.4-16-58/ఎ,** జ్యోతి నివాస్, కేరాఫ్ : జి. ఆనందరావు, భారత్‌పేట, 3వ లైను, **గుంటూరు-522004,** ఆంధ్రప్రదేశ్.

విషయం : బ్యాంక్ వారికి శ్రీమతి పిళ్ళా నయోమి ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూర్టిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూర్టిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ **13(2)** క్రింద **ది.29-06-2021** న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.13-05-2022** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడమైనది.

ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్నా విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

(ది.30-07-1994 నాటి దస్తావేజు నెం.2999/1994 ప్రకారం) ఆంధ్రప్రదేశ్, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం, జి.టి.పి. బి.ఇడి కాలేజి రోడ్, మునిసిపల్ ఎంప్లాయిస్ కాలనీ, కె.జి.ఆర్.యల్. గర్ల్స్ హాస్టల్ ప్రక్కన, వార్డు నెం.15, ఆర్.యస్.నెం.507, యల్.పి. నెం.52/1992, ప్లాట్ నెం.29, డోర్ నెం.19-16-117/1 నందు **శ్రీమతి పిళ్ళా నయోమి, భర్త : డైమండ్ రాజుకు చెందిన 260.30 చ॥గ॥ల విస్తీర్ణముగల భూమి మరియు అందులో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ బిల్డింగ్‌కు** సంబంధించి న్యాయసమ్మతంగా తనఖావుంచబడిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం.30 లోని స్థలము - 18.10 మీ॥; **పడమర :** రోడ్ -18.10 మీ॥; **ఉత్తరం :** రోడ్ -12.05 మీ॥; **దక్షిణం :** ఆర్.యస్.నెం.508 లోని భూమి - 12.05 మీ॥.

స్థలం : విజయవాడ
తేది : 10-07-2024
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

यूनियन बैंक Union Bank of India

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత(లు) / కో అప్లికెంట్(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) / సహఅబ్లిగెంట్(లు): **1) శ్రీ గాయత్రి కాటన్ ట్రేడర్స్ (ఋణగ్రహీత/యజమాని), శ్రీ పిన్నిటి శ్రీనివాసరావు, కేరాఫ్ : వీర వెంకటేశ్వర కాటన్ మిల్స్, చిరునామా : ఐపిడి కాలనీ రోడ్, కమ్మ శేషయ్య గ్రౌండ్, ఏటుకూరు రోడ్, గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్, 2) శ్రీ పిన్నిటి శ్రీనివాసరావు (హామీదారు/తనఖాదారు), తండ్రి : సుబ్బారావు, చిరునామా : డి.నెం.4-4-155/ఎ, 5వ లైను, చంద్రమౌళినగర్, గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్, 3) శ్రీ నల్లపనేని రంగారావు(హామీదారు/ తనఖాదారు), తండ్రి : నాగేశ్వరరావు, చిరునామా : డి.నెం.15-18-31, 1వ లైను, మారుతి నగర్, పాత గుంటూరు, గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్, 2) శ్రీమతి బిట్ర శ్రీదేవి(హామీదారు), భర్త : మురళీకృష్ణ, చిరునామా : డి.నెం.4-4-155/ఎ, 6/1 వ లైను, చంద్రమౌళినగర్, గుంటూరు-522001, ఆంధ్రప్రదేశ్, 3) శ్రీ జనపాటి వెంకటసుబ్బయ్య (హామీదారు), తండ్రి : ఆశీర్వాదయ్య, చిరునామా : డి.నెం.4-5-155/ఎ, విద్యానగర్, 3వ లైను, సాయిబాబా గుడి దగ్గర, గుంటూరు-522005,ఆంధ్రప్రదేశ్.**

విషయం : బ్యాంక్ వారికి శ్రీ పిన్నిటి శ్రీనివాసరావు మరియు శ్రీ నల్లపనేని రంగారావు ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూర్టిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూర్టిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ **13(2)** క్రింద **ది.04-02-2018** న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.26-04-2018** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడమైనది.

ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్నా విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

తనఖావుంచబడిన ఆస్తి వివరములు : ఐటమ్-1 : (ది.22-06-2015 నాటి విక్రయ దస్తావేజు నెం.6333/2015 ప్రకారం) : గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ రామచంద్రాపుర అగ్రహారం, డి.నెం.79, పట్టా నెం.1053, బ్లాక్ నెం.09& 10, ప్లాట్ నెం.38, 39 నందు **శ్రీ నల్లపనేని రంగారావుకు** చెందిన 217 చ॥గ॥ల విస్తీర్ణముగల అర్బన్ ఖాళీ భూమికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** పిన్నిటి శ్రీనివాసరావు యొక్క ఆస్తి -69.1 అ॥; **దక్షిణం :** 40 అ॥ల వెడల్పుగల రోడ్డు -28.6 అ॥; **పడమర :** 25 అ॥ల వెడల్పుగల రోడ్డు -67 అ॥; **ఉత్తరం :** రేగుల వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి -29 అ॥.
ఐటమ్-2 : (ది.22-06-2015 నాటి విక్రయ దస్తావేజు నెం.6334/2015 ప్రకారం) : గుంటూరు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ రామచంద్రాపుర అగ్రహారం, డి.నెం.79, పట్టా నెం.1053, బ్లాక్ నెం.09& 10, ప్లాట్ నెం.36, 37, 38 & 39 నందు **శ్రీ పిన్నిటి శ్రీనివాసరావుకు** చెందిన 224 చ॥గ॥ల విస్తీర్ణముగల అర్బన్ ఖాళీ భూమికి సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** కలగాని రమణ యొక్క ఆస్తి -71.2 అ॥; **దక్షిణం :** 40 అ॥ల వెడల్పుగల రోడ్డు -28.6 అ॥; **పడమర :** నల్లపనేని రంగారావు యొక్క ఆస్తి -69.1 అ॥; **ఉత్తరం :** రేగుల వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి -29 అ॥.

స్థలం : విజయవాడ
తేది : 11-07-2024
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

यूनियन बैंक Union Bank of India

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత(లు) / కో అప్లికెంట్(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) / సహఅబ్లిగెంట్(లు): **1) ఐనెడి శ్రీనివాసరావు (ఋణగ్రహీత), తండ్రి: దైవదీనం,** ఫ్లాట్ నెం. 503, 4 వ అంతస్తు, శ్రీ సాయి శోభ అపార్ట్‌మెంట్, గోరంట్ల, కోరెటిపాడు, గుంటూరు. **2) శ్రీ ఐనెడి శ్రీనివాసరావు (తనఖాదారు), తండ్రి: దైవదీనం,** ఫ్లాట్ నెం. 503, 4 వ అంతస్తు, శ్రీ సాయి శోభ అపార్ట్‌మెంట్, గోరంట్ల, కోరెటిపాడు, గుంటూరు. **1) శ్రీమతి ఐనెడి మౌనిక (కో-అబ్లిగెంట్/హామీదారు/తనఖాదారు) డి/ఓ: ఐనెడి శ్రీనివాసరావు,** ఫ్లాట్ నెం. 503, 4వ అంతస్తు, శ్రీ సాయి శోభ అపార్ట్‌మెంట్, గోరంట్ల, కొరెటిపాడు, గుంటూరు. **2) శ్రీమతి ఐనెడి అనిత (కో-అబ్లిగెంట్/హామీదారు/ తనఖాదారు), భర్త: ఐనెడి శ్రీనివాసరావు,** ఫ్లాట్ నెం. 503, 4వ అంతస్తు, శ్రీ సాయి శోభ అపార్ట్‌మెంట్, గోరంట్ల, కొరెటిపాడు, గుంటూరు.

విషయం : బ్యాంక్ వారికి శ్రీ ఐనెడి శ్రీనివాసరావు, శ్రీమతి ఐనెడి మౌనిక మరియు శ్రీమతి ఐనెడి అనిత ఋణపడిన బకాయి వసూలు చేసుకొను నిమిత్తమై సెక్యూర్టిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఆస్తి విక్రయము గురించి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001 వారు సెక్యూర్టిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ **13(2)** క్రింద **ది.01-04-2021** న **డిమాండ్ నోటీసు** ద్వారా మిమ్ములను మాకు చెల్లించవలసిన బకాయి మొత్తము నిర్దేశించిన గడువులోపు చెల్లించమని కోరినను, బకాయి మొత్తం నిర్దేశించిన గడువులోపు చెల్లించుటలో మీరు విఫలమైనారు. ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.05-02-2022** న సదరు చట్టంలోని సెక్షన్ 13(4) లోని 6 / 8వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారములతో అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడమైనది.

ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తమును చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన ఆస్తిని విక్రయించడం అనివార్యమైనది. ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం తేదీ మరియు సమయం ఇ-వేలం నిర్వహించబడే సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరములు విడిగా జారీచేయబడుతుంది.

కాబట్టి, మీరు బ్యాంకుకి చెల్లించాల్సిన మొత్తాన్నా విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు బ్యాంక్ వెచ్చించిన ఖర్చులతో కలిపి చెల్లించినట్లయితే, ఆస్తి అమ్మకంపై తదుపరి చర్య తీసుకోబడదు మరియు మీరు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం తనఖాఆస్తులను విడిపించుకొను హక్కు కలదు.

షెడ్యూల్ ఆస్తి

దిగువ వివరించిన స్థిరాస్తి తనఖా: ఆస్తి: షెడ్యూల్-ఎ: మొత్తం టాట్ పీస్ లేదా ఆస్తి యొక్క పార్శిల్ గుంటూరు జిల్లా, కొరెటిపాడు సబ్ జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, డి.నెం.49 నందు య. 12.66 సెంట్లు మరియు డి.నెం. 50/1 నందు 9.55 సెంట్లు గోరంట్ల గ్రామం, భాగాలుగా ఉన్న ప్లాట్ నెం.6 మరియు ప్లాట్ నెంబర్లు 7,8,9 దీనిలో 844.77 చ.గ.లు "శ్రీ సాయి శోభ" **సరిహద్దులు: తూర్పు:** ఆస్తి ప్లాట్ నెం. 10 కరసాని ముత్యాల రెడ్డి మరియు ఇతరులకు విక్రయించబడింది 70'-0", **దక్షిణం:** కరసాని ముత్యాల రెడ్డి ఇతరులకు విక్రయించారు 109'-0", **పడమర:** ప్లాట్ నెం.6 యొక్క ఆస్తి భాగం 70'-0", **ఉత్తరం:** 30 అడుగుల వెడల్పు రోడ్డు.
షెడ్యూల్-బి: ఒక షెడ్యూల్ స్థలంలో 844.77 చ.గ.ల మొత్తం విస్తీర్ణంలో42.3885 చ.గలు లేదా 35.44 చ.మీ. విస్తీర్ణంలో విభజించబడని మరియు పేర్కొనబడని షేర్ మరియు నాల్గవ అంతస్తులో ఉన్న ఒక సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ బేరింగ్ నెం. 503తో పాటు "శ్రీ సాయి శోభ' 1100 చ.అ. (సాధారణ ప్రాంతాలు మరియు ఒక కార్ పార్కింగ్ ప్రాంతంతో సహా) పునాది వైశాల్యంతో పైన పేర్కొన స్థలం వాటా కోసం నిర్మిస్తున్నారు. సరిహద్దులు: తూర్పు: ఓపెన్ స్కై, దక్షిణం: ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం. 504 మధ్యలో ఓపెన్ స్కై, పడమర: కామన్ కారిడార్, ఉత్తరం: రోడ్డు ఆనుకుని ఉన్న ఓపెన్ స్కై

స్థలం : విజయవాడ
తేది : 10-07-2024
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

యువతిపై దాడి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక

ఉడా కాలనీలో ఈ నెల 16వ తేదీ రాత్రి యువతిపై దాడికి పాల్పడిన వ్యక్తిని న్యూపోర్టు పోలీసులు గురువారం అరెస్టుచేశారు. దీనికి సంబంధించి విశాఖ సిటీ డిసిపి-2 తుహిన్ సిన్హా గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సిద్ధు గతంలో విద్యార్థినిని తరచూ వేధించేవాడని తెలిపారు. దీనిపై ఏప్రిల్ నెలలో గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారని వివరించారు.

పోక్సో చట్టం కింద జైలుకు వెళ్లిన సిద్ధు బయటకు వచ్చి ఈనెల 16వ తేదీన గొంతువానిపాలెం వచ్చి యువతిపై దాడికి ప్రయత్నించాడు. తల్లి అడ్డుకోవడంతో ఆమె చేతికి గాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు ఎసిపి మోసేజ్ పౌల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాలిబాబుతోపాటు, మరి కొంతమంది సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి నిందితుడు సిద్ధును విశాఖ విమల విద్యాలయం వద్ద పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వైసిపి హయాంలో ఐటిడిఎలు నిర్వీర్యం

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఐటిడిఎలను నిర్వీర్యం చేశారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి విమర్శించారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐటిడిఎలో ఒక్క రూపాయి నిధి లేకుండా చేసిన ఘనత వైసిపిదేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని తొమ్మిది ఐటిడిఎల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని వైసిపి పాలకులపై విరుచుకుపడ్డారు. గత ఐదేళ్లలో గిరిజనుల సమస్యలు చెప్పుకోవడానికి గ్రీవెన్స్‌సెల్ కూడా నిర్వహించలేదని విమర్శించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇద్దరు గిరిజన సంక్షేమ శాఖ మంత్రులు పని చేశారని చెప్పారు. నాలుగేళ్లలో ఒక్కసారి కూడా ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించలేదని ఎద్దేవాచేశారు. పది రోజుల్లో పార్వతీపురం ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైసిపి హయాంలో గిరిజన సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారని చెప్పారు. ట్రైకార్ రుణాలు కూడా మంజూరు కాలేదన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పేరిట రూ.250 కోట్ల అప్పు ఉందని, మిగిలిన అన్ని శాఖల రుణాలు తేల్చే పనిలో ప్రభుత్వం ఉందని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే వైసిపి నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నట్లు ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని దుయ్యబట్టారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం ఎన్నో అరాచకాలకు నిలయంగా మారిందని చెప్పారు. ఏకలవ్య పాఠశాలల్లో ఉత్తరభారత దేశానికి చెందిన ఉపాధ్యాయులను నియమించడం వల్ల వారు హిందీలో బోధన చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనే విషయంపై సిఎం చంద్రబాబు నాయుడుతో చర్చిస్తానని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలలో 31 గిరిజన గ్రామాలకు రూ.3 కోట్లతో తాగునీటి పథకాలు మంజూరు చేసినట్లు మంత్రి సంధ్యారాణి చెప్పారు.

అంతుచిక్కని వ్యాధితో మూగజీవాల మృత్యువాత

ప్రజాశక్తి- చింతపల్లి

మన్యప్రాంతంలోని మూగజీవాలు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడుతున్నాయి. తాజాగా పెదబరడ పంచాయతీ కేంద్రంలో మూడు పశువులు మేతకు వెళుతున్న క్రమంలో హఠాత్తుగా కింద పడి ఊపిరాడక మరణించాయి. అప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న పశువులు, అంతలోనే అస్వస్థతకు గురై మృతి చెందడంపై గిరిజనులు కలవరం చెందుతున్నారు. మేతకు వెళుతూ మందలోని మూడు పశువులు ఒక్కసారిగా కిందపడి ఎగశ్వాసతో ఊపిరాడక మృతి చెందాయని వారంటున్నారు. దీనిపై సంబంధిత పశుసంవర్ధకశాఖ అధికారులు దృష్టి పెట్టి, మరిన్ని పశువులు మృత్యువాత పడకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇదే సమయంలో దుక్కిటెద్దులు కోల్పోయిన గిరిజన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పట్టిసీమ నుంచి 1.770 క్యూసెక్కులు విడుదల

ప్రజాశక్తి- పోలవరం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 1.770 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్ గురువారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 16.08 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5 పంపులు ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెలలో ఇప్పటి వరకూ 6.93 టిఎంసిల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

శ్రీవారి సన్నిధిలో కేంద్ర మంత్రి గడ్కరీ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దర్శించుకున్నారు. గురువారం ఉదయం తోమాల సేవలో కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. టిటిడి గడ్కరీని శ్రీవారి శేష వస్త్రంతో జెఇఒ వీరబ్రహ్మం నితిన్ సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ... దేశం అభివృద్ధి చెందాలని, ఆర్థికంగా మెరుగు పడాలని ప్రార్థించినట్లు తెలిపారు.

షిప్‌యార్డ్ సమస్యలపై తపనసేన్‌కు వినతి

ప్రజాశక్తి - విశాఖ

షిప్‌యార్డ్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌కు షిప్‌యార్డ్ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, అధ్యక్షులు బిఎస్ఎన్.రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ విక్టరీ ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. రూ.20 వేల కోట్లు విలువగల 5 ఎఫ్ఎస్-ఎస్ వర్క్ ఆర్డర్స్‌లో 2 ఎఫ్ఎస్ఎస్ షిప్పులను ఎల్ అండ్ టికి ఇవ్వడం సంస్థకి ఆర్థికంగా నష్టం చేకూర్చే చర్య అని పేర్కొన్నారు. పలు కార్మిక సమస్యలనూ వివరించారు. వాటన్నింటినీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్తానని తపన్‌సేన్ తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర నాయకులు ఎం.జగ్గునాయుడు, ఆల్ ఇండియా స్టీల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో - కన్వీనర్ కె.కుమార్ మంగళం పాల్గొన్నారు.

22న మామిడి రైతుల సదస్సు

ప్రజాశక్తి-నూజివీడు టౌన్

ఈనెల 22వ తేదీన సోమవారం ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉద్యాన శాఖ ఆధ్వర్యాన మామిడి రైతులకు నూజివీడు మామిడి పరిశోధన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తెలుసుకొనుటకు ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొంటారని తెలిపారు. రైతు సోదరులు, వ్యాపారులు, ఎగుమతి దారులు పాల్గొని మామిడి సాగులో, మార్కెటింగ్‌లో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తులో తగిన కార్యక్రమం తీసుకొనుటకు సహకరించవలసినదిగా కోరుతున్నారు.



మీకోసం

వెల్లుల్లిని బాగా నూరి గంటకోసారి వాసన పీలుస్తూ ఉంటే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.

జీవన సౌరభం

భయంతో ఏ పనిచేసినా విజయాన్ని సాధించలేము. వివేకంతో చేసే పని సత్ఫలితాన్నిస్తుంది.


భలే భలే వాన



భలే భలే వాన
కురిసింది చాన్నాళ్ళ కు!
మేఘాలన్నీ కలిసి కదిలి జల్లులు చల్లాయి
పచ్చని చెట్లు వానకు తడిసి కళకళలాడాయి
మా బుజ్జి బాతు వాన నీటిలో
రెక్కలు టప టప లాడిస్తూ చిందులు వేసింది..
చల్లగాలికి లేగదూడ గెంతులు వేసింది
కుక్క పిల్ల ఆనందంతో భౌ భౌమని అరిచింది

భలే భలే వాన
కురిసింది చాన్నాళ్ళకు
చెరువులు, వాగులు, వంకలు నీటితో నిండాయి
రైతు మనసులు ఆనందంతో నిండాయి
చినుకుల్లో గొడుగు గిర గిరా తిప్పుతూ
వానా వానా వల్లప్పా పాటలు పాడి
సందడి చేద్దాం రారండి నేస్తాలూ!
భలే భలే వాన
కురిసింది చాన్నాళ్ళకు!

- గేరపాటి భాను వర్ధన్ (భావ శ్రీ), 81065 86997.



దారి చూపండి

పిల్లలూ, గూట్లో ఉన్న కోడి, దాని గుడ్ల దగ్గరకు చేరుకునే దారి చూపించరూ!

నేను గీసిన బొమ్మ



డి.నిషాంత్ గౌడ్,
8వ తరగతి,
రాంపూర్, మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వర్షాకాలం .. జాగ్రత్తగా ఉందాం!

వర్షాకాలం వర్షాలతో పాటు అనారోగ్య సమస్యలనూ మోసుకొస్తుంది. మరి ఇంట్లోని పెద్దల, పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏం చేయాలి? చిన్న చిన్న జాగ్రత్తలతో, చిట్కాలతో మనం ఏవిధంగా సన్నద్ధం కావాలి?



వర్షాకాలం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ కాలంలో అనేక రోగాలు చుట్టుముట్టి బాధిస్తుంటాయి. వర్షాలు పడటంతో దోమలు, ఈగలు వంటి కీటకాల బెడద పెరుగుతుంది. ఇవి వైరల్ ఫీవర్లు, ఇన్‌ఫెక్షన్లు కల్గిస్తాయి. తరచూ జలుబు, దగ్గు వంటివి రావడంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. అసిడిటీ, ఉబ్బరం, అజీర్ణం, గ్యాస్ట్రో ఎంటెరిటిస్, అల్సర్, గ్యాస్ట్రో ఎసోఫాగియల్ రిఫ్లక్స్ డిసీజ్ వంటి గ్యాస్టిక్ సమస్యలు సర్వసాధారణంగా వస్తుంటాయి.

ఆరోగ్యంగా ఉండాలంటే ..

అధిక వర్షాల వల్ల ఫంగస్, బ్యాక్టీరియా, వైరస్‌లు వంటివి గాల్లో వ్యాపిస్తుంటాయి. అందువల్ల వర్షాల్లో తడిచే వారు అనారోగ్యం పాలవుతుంటారు. కొన్ని జాగ్రత్తలు పాటించటం ద్వారా వ్యాధులు రాకుండా ఉండొచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

సమతుల ఆహారం తీసుకోవటం. రోజూ వ్యాయామం చేయటం, జంక్, స్పైసీ, జిడ్డు గల ఆహారాన్ని తక్కువగా తీసుకోవాలి. పెరుగు లేదా మజ్జిగ వంటి ప్రోబయోటిక్స్ కలిగిన పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. అవి మన జీర్ణ వ్యవస్థకు మద్దతు ఇచ్చే బ్యాక్టీరియాను కల్గివుంటాయి. పచ్చి ఆకుకూరల్లో సూక్ష్మక్రిములు లేకుండా చూసుకోవాలి. ప్రేగులకు అనుకూలమైన, తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఎంచుకోవాలి. ముడి కూరగాయలకు బదులుగా ఆవిరి లేదా ఉడికించిన కూరగాయలను తినాలి. తద్వారా బ్యాక్టీరియా, వైరస్‌లను దరిచేరకుండా చూసుకోవచ్చు. కాచి చల్లార్చిన నీటినే తాగాలి.

చర్మం, జుట్టు సంరక్షణ : వర్షానికి తడిస్తే తొలుత ప్రభావం పడేది చర్మంతోపాటు వెంట్రుకల మీదే. తల తడిగా ఉన్నప్పుడు చుండ్రు అధికమవుతుంది. పేలూ పడతాయి. తలలో చుండ్రు రావడం.. ఆ తర్వాత మొహంపై మొటిమలు రావడం జరుగుతుంది. ఇతర ఇన్ఫెక్షన్లు బాధించే అవకాశం కూడా ఉంది. అందుకే తల తడవకుండా గొడుగు లాంటివి ఉపయోగించాలి. తడిసి ఇంటికి వచ్చిన వెంటనే తలస్నానం చేయాలి.

కలుషిత ఆహారం వద్దు : వర్షాకాలంలో ఉండే అధిక తేమ జీర్ణశక్తిని తగ్గిస్తుంది. బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు, విష పదార్థాల వల్ల ఆహారం, నీరు కలుషితమవటంతో వివిధ అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే అవకాశం ఉంది. ఈ అనారోగ్య పరిస్థితులను వర్షాకాలంలో తప్పించుకోవటం అనివార్యమే. వైరస్ వ్యాప్తికి దోహదపడే కలుషిత ఆహారం, చల్లని పదార్థాలను తీసుకోవద్దు.

పరిసరాల పరిశుభ్రత : వర్షాకాలంలో శారీరకంగా, వ్యక్తిగతంగా జాగ్రత్తలు తీసుకోవడమే కాదు. ఇంటి పరిసరాల గురించి కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉండగలుగుతారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడటంతో ఇంట్లో కొన్ని వస్తువులు తేమగా ఉంటాయి. ఎక్కువ తడి, తేమ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

దోమలు, ఈగలు : వానాకాలంలో దోమలు, ఈగలు పెరుగుతాయి. కొన్ని రకాల జ్వరాలు, అంటువ్యాధుల వ్యాప్తికి అవే కారణం. మనం పరిసరాల్లో నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంట్లోగానీ ఇంటి పరిసరాల్లోగానీ దోమలు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఫంగల్ ఇన్ఫెక్షన్లు : వర్షంలో తడిస్తే ఇంటికి రాగానే పాదాలను శుభ్రంగా కడుక్కోవాలి. ఆ తరువాత తడిలేకుండా తుడుచుకోవాలి. వర్షాకాలంలో ఎక్కువగా తడవడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్ సోకే అవకాశం ఉంది. అంటువ్యాధులు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇంటికి రాగానే కాళ్ళను గోరు వెచ్చని నీటితో కడుక్కోవాలి.

ఎక్కువసార్లు బాగా కాచి వడపోసిన నీటిని తాగుతూ ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లోనూ మంచి నీటిని నేరుగా తాగటం మంచిది కాదు. జ్వరం వచ్చి రెండు రోజుల వరకు తగ్గకుండా ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి.

వేడి పదార్థాలను తీసుకోవాలి. వర్షాకాలంలో కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్ తీసుకోకూడదు.

చిన్నారుల పట్ల ఈ జాగ్రత్తలు అవసరం



వర్షాకాలంలో చిన్నారులకు తరచూ జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. వర్షంలో తడవడం వల్ల తరచూ జలుబు, దగ్గు, జ్వరం లాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి. వర్షాకాలంలో చిన్నారులకు వేడి నీటితోనే స్నానం చేయించాలి. తలంటు స్నానం చేయించేటప్పుడు వేడి నీటిలో కొన్ని చుక్కల నువ్వుల నూనె వేయాలి. దీనివల్ల పిల్లల్లో శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. కొంచెం పసుపు, ఉప్పు కలిపిన మిశ్రమాన్ని చిన్నారులతో తినిపించాలి. తర్వాత గోరు వెచ్చని నీరు తాగించాలి. ఇలా చేస్తే జలుబు, దగ్గు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. గొంతు నొప్పి, దగ్గు సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు ఉప్పు, వాము, పసుపు కలిపి వేడి చేసి చిన్న గుడ్డలో కట్టుకోవాలి. దాంతో గొంతుపై నెమ్మదిగా కాపడం పెట్టాలి. ఇలా చేస్తే త్వరగా ఉపశమనం లభిస్తుంది.

పసుపు కొమ్ములు, గోధమలను సమాన మొత్తంలో తీసుకుని వాటిని నూనె లేకుండా దోరగా వేయించాలి. తర్వాత మెత్తని పొడిగా తయారు చేసుకోవాలి. ఈ పొడిని కొంత మొత్తంలో ఉదయం, సాయంత్రం పిల్లలకు ఇవ్వాలి. ఇలా చేస్తే శ్వాసకోశ సమస్యలు, దగ్గు తగ్గుతాయి.

వాము ఒక టీస్పూన్, బెల్లం 4 టీస్పూన్లు తీసుకుని వాటిని మెత్తగా నూరుకోవాలి. ఈ కషాయాన్ని పిల్లలతో తాగించాలి. ఇలా చేయడం వల్ల జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటివి తగ్గుతాయి. ఇన్ఫెక్షన్‌తో ఇబ్బంది పడుతున్న చిన్నారులకు పసుపు, పటికబెల్లం పొడిని బొగ్గు నిప్పుపై వేసి చిన్నారులతో పట్టించాలి. ఇలా చేయడం వల్ల గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.

గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం, తేనె కలిపి పిల్లలతో తాగించాలి. ఇలా రోజుకు రెండు సార్లు తాగిస్తే మంచి ప్రయోజనం ఉంటుంది.

వారానికి కనీసం మూడు నాలుగు సార్లు ఆకుకూరలు తింటే ఎంతో మంచిది. ఉడకబెట్టిన సెనగలు, వేరుసెనగలు, అల్సందలు మొదలైన వాటిని వారానికి రెండు మూడుసార్లు స్నాక్‌లా తింటే మంచిది. వారానికి నాలుగసార్లు తెల్ల నువ్వుల ఉండలు, పల్లీ ఉండలు, సున్నుండలు తింటే వంటికి ఎంతోబలం.

సీజనల్‌గా దొరికే పండ్లను వారానికి రెండు మూడుసార్లు తింటే ఆరోగ్యం బాగా మెరుగుపడుతుంది. నానబెట్టిన బాదంపప్పును స్నాక్‌లాగా తినొచ్చు.

జీడిపప్పు, పిస్తాపప్పు వంటివి కూడా మంచిదే. కానీ పరిమితంగా మాత్రమే తినాలి.


ఉసిరికాయ, తానికాయ, కరక్కాయలను త్రిఫలాలు అంటారు. వీటితో త్రిఫల చూర్ణం తయారుచేస్తారు. వీటిలో విటమిన్-సి, ఫైటో కెమికల్స్, ఫైటో న్యూట్రియంట్స్, పాలీఫినాల్స్, అసెన్షియల్ ఆయిల్స్ ఉంటాయి. పోషకాల కంటే ఇందులో ఔషధ గుణాలే ఎక్కువ. ఈ చూర్ణాన్ని సమాన పరిణామంలో తీసుకుంటే ఉపయోగకరం



తేజస్ 'ఉరుకు పటేల'


'హుషారు' చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయమైన తేజస్ కంచర్ల ప్రస్తుతం 'ఉరుకు పటేల' అనే సినిమా చేస్తున్నారు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'గెట్ ఉరికిఫైడ్' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. ఈ ఫస్ట్ లుక్‌తో పాటు చిత్ర వివరాలను తాజాగా మేకర్స్ తెలియజేశారు. ఇది గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రమని ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా తెలుస్తోంది.

సిద్ధు 'తెలుసు కదా' న్యూ లుక్



సిద్ధు జొన్నలగడ్డ నెక్స్ట్ ప్రాజెక్టు 'తెలుసు కదా'. ఈ చిత్రంలో రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఆగస్ట్ 5, 2024న హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. షెడ్యూల్ గురించి మరిన్ని వివరాలు త్వరలో విడుదలవుతాయి. ఈ చిత్రం కోసం సిద్ధు స్టైలిష్ లుక్ లోకి మారిపోయారు. అందుకు సంబంధించిన లేటెస్ట్ స్టిల్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ చిత్రం పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి 30వ చిత్రం. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు.

26నే 'ఆపరేషన్ రావణ్'




రక్షిత్ అట్లూరి కథానాయకుడిగా రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్రలో చేస్తున్న సినిమా 'ఆపరేషన్ రావణ్'. ఈ సినిమాను ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. వెంకట సత్య తెరకెక్కించారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా రూపొందింది. సంగీర్తన విపిన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆగష్టు 2న ఈ సినిమాని విడుదల చేద్దాం అనుకున్నారు. అయితే వారం రోజుల ముందుగా.. అంటే జులై 26వ తేదీనే ఈ చిత్రం రిలీజ్ కాబోతుందని సమాచారం.. రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, తమిళ నటుడు విద్యా సాగర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

అక్టోబరు 31న 'అమరన్'



శివకార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం 'అమరన్'. సాయి పల్లవి కథానాయికగా చేస్తున్నారు. ఈ చిత్రం నుండి చిత్రబృందం తాజాగా ఓ అప్‌డేట్ ఇచ్చింది. అక్టోబర్ 31న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ అండ్ సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రాజ్‌కుమార్ పెరియసామి రచన, దర్శకత్వం చేశారు. కాశ్మీర్ నేపథ్యంలో శివ్ అరూర్, రాహుల్ సింగ్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని 'మేజర్ వరదరాజన్' చాప్టర్ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



'స్త్రీ 2' ట్రైలర్ విడుదల

బాలీవుడ్ నటులు రాజ్ కుమార్ రావు, శ్రద్ధా కపూర్, పంకజ్ త్రిపాఠీ ప్రధాన పాత్రల్లో వచ్చిన 'స్త్రీ' చిత్రానికి 'స్త్రీ 2' పేరుతో సీక్వెల్ రాబోతోంది. అమర్ కౌశిక్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఆగష్టు 15న ఈ చిత్రం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. త్రాజాగా మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. తమన్నా ఓ స్పెషల్ సాంగ్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.

ట్రోలింగ్‌పై చర్యలు తీసుకోవాలి



సోషల్ మీడియాలో నటులపై వస్తున్న ట్రోలింగ్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీకి 'మా' అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. అసోసియేషన్ తరపున శివబాలాజీ, రాజీవ్ కనకాల, సీనియర్ నటుడు శివకృష్ణ డీజీపీని కలిశారు. నటీనటులపై అసభ్యకరమైన ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐదు యూట్యూబ్ ఛానళ్లను నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు 25 యూట్యూబ్ ఛానళ్లను టెర్మినేట్ చేశామని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. అసోసియేషన్ పరిధిలో సైబర్ క్రైం టీమ్‌ను పెట్టుకున్నామని తెలిపారు. సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయబోతున్నామని కూడా వెల్లడించారు. ఈ అంశంలో డీజీపీ సానుకూలంగా స్పందించారని సైబర్ సెక్యూరిటీ వింగ్లో స్పెషల్ సెల్ దీని మీద ఫోకస్ పెడుతుందని చెప్పారని 'మా' సభ్యులు వెల్లడించారు.

8వ టైటిల్‌పై హర్మన్‌ప్రీత్ గురి

- నేటినుంచి మహిళల ఆసియాకప్
- భారత్ × పాకిస్తాన్ జట్ల మధ్య తొలిపోరు
- రాత్రి 7.00గం॥లకు



దంబుల్లా(శ్రీలంక): ఆసియాకప్ మహిళల క్రికెట్‌కు రంగం సిద్ధమైంది. టి20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నమెంట్‌లో భారత్ ఏడుసార్లు విజేతగా నిలిచింది. 2004నుంచి ఇప్పటివరకు 8సార్లు టోర్నమెంట్ జరగ్గా.. భారత్ ఏకంగా ఏడుసార్లు టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2022లో మాత్రమే రన్నరప్‌గా నిలిచింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళలజట్టు అన్ని విభాగాల్లోనూ పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా మహిళలతో సొంతగడ్డపై జరిగిన సిరీస్‌లో ఘన విజయం సాధించిన ఉత్సాహంతో టోర్నీ బరిలోకి దిగుతోంది. యుఎఇ-నేపాల్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో 2024 ఆసియాకప్ మహిళల టి20 క్రికెట్ సంగ్రామం ప్రారంభం కానుంది. అదేరోజు సాయంత్రం భారత్-పాకిస్తాన్ మహిళల జట్ల మధ్య మరో మ్యాచ్ జరగనుంది. మొత్తం 8జట్ల మధ్య జరిగే ఈ మెగా సంగ్రామంలో గ్రూప్ లీగ్ దశ ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరనున్నాయి. 26న సెమీస్, 28న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

167కోట్లు నష్టం: ఐసిసి

అమెరికా-వెస్టిండీస్ వేదికలుగా జరిగిన టి20 ప్రపంచకప్ నిర్వహణతో అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) భారీగా నష్టపోయింది. భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌కు స్టేడియం ప్రేక్షకులతో పూర్తిస్థాయిలో నిండినా.. మిగిలిన మ్యాచ్‌లను చూసేందుకు ప్రేక్షకులు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో ఐసిసి ఏకంగా రూ.167కోట్లు నష్టపోయినట్లు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. బేస్‌బాల్ అమితంగా ఇష్టపడే అమెరికన్లు క్రికెట్‌ను పెద్దగా ఆదరించకపోవడమే ఐసిసి నష్టాలకు కారణంగా తెలుస్తోంది. ఈ అంశంపై కొలంబో వేదికగా శుక్రవారం జరిగే వార్షిక సర్వసభ్య సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఈ అంశం తొమ్మిది పాయింట్ల ఎజెండాలో లేకపోయినప్పటికీ 'పోస్ట్ ఈవెంట్ రిపోర్ట్'గా టి20 ప్రపంచ కప్ నష్టంపై చర్చించనున్నారని కథనం. బిసిసిఐ సెక్రటరీ జై షాను ఐసిసి ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అంశంపైనా చర్చ జరగనుంది.

జట్లు..

భారత్: హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), హేమలత, రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, శ్వేత సెహ్రావత్, స్మృతి మంధాన, దీప్తి శర్మ, సాజీవన్ సజన, రీచా ఘోష్, ఉమా ఛెత్రీ(వికెట్ కీపర్లు), అరుంధతి రెడ్డి, శోభన, మేఘ్నా సింగ్, పూజ వస్త్రాకర్, రాధా యాదవ్, రేణుకా సింగ్, శికా ఇషికా, శ్రేయాంక పాటిల్, తనుజ కన్వార్.

పాకిస్తాన్: నిదా ధార్(కెప్టెన్), ఫరోజా, జావేద్, సిద్రా అమీన్, అలియా రైజ్, ఒమిమా సొహైల్, శ్రేదా అరోబ్, మునీబా, నజిహా(వికెట్ కీపర్లు), దినా బేగ్, సద్రా సద్ధు, సాదియా ఇక్బాల్, తస్మియా రుబాబ్, తుబా హసన్.

ధీనిధికి 14, బొప్పన్నకు 44

పారిస్ ఒలింపిక్స్



పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ ఈసారి అత్యధిక పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో భారత్ నుంచి 2024 ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే అతి పిన్న వయస్కురాలిగా స్విమ్మర్ 14ఏళ్ల ధీనిధి ధేసింగు నిలువగా.. అతిపెద్ద వయస్కుడిగా టెన్నిస్ ప్లేయర్ రోహన్ బొప్పన్న నిలిచాడు. రోహన్ బొప్పన్న వయస్సు 44ఏళ్లు. దీంతో పతకాలకోసం అత్యుత్తమ క్రీడాకారులు పారిస్ ఒలింపిక్స్ బరిలో దిగుతున్నారు. వీరిద్దరి మధ్య 30ఏళ్ల అంతరం ఉంది. మహిళల 200మీ. ఫ్రీస్టైల్ విభాగంలో ధీనిధి ఒలింపిక్స్‌లో అరంగేట్రం చేయనున్నారు. ఆమె 2023 స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో 2నిమిషాల 04.24సెకన్లలో గమ్యానికి చేరి జాతీయ రికార్డును బ్రేక్ చేసింది. ఆ తర్వాత ఈషా సింగ్(19) షూటింగ్ విభాగంలో భారత్ తరపునుంచి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన మరో అతి పిన్న వయస్కురాలిగా నిలిచారు. ఆర్చరీ మహిళల రికర్వు విభాగంలో భజన్ కౌర్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచారు. ఈ క్రమంలో 2024 ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి ప్రాతినిధ్యం వహించే అథ్లెట్లలో అతి పిన్న వయస్కుడిగా. నిలువగా.. అతిపెద్ద వయస్కుడిగా రోహన్ బొప్పన్న(టెన్నిస్) 44ఏళ్లు ఉన్నారు. ఈనెల 26నుంచి ఆగస్టు 11వరకు పారిస్ ఒలింపిక్స్ జరగనున్న సంగతి తెలిసిందే.

టి20 కెప్టెన్‌గా సూర్యకుమార్

- వన్డేల్లో కెఎల్ రాహుల్, శ్రేయస్‌కు చోటు
- శ్రీలంక టూర్‌కు జట్టును ప్రకటన

ముంబయి: శ్రీలంక పర్యటనకు వెళ్లే జట్టును భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) గురువారం ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బిసిసిఐ సెలెక్షన్ కమిటీ శ్రీలంకలో పర్యటించే టి20 జట్టుకు కెప్టెన్‌గా సూర్యకుమార్, వన్డేలకు రోహిత్ శర్మ సారథ్యం వహించనున్నారు. వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు. కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ తిరిగి వన్డేల్లో చోటు దక్కించుకోగా.. రియాన్ పరాగ్‌కు తొలిసారి వన్డేల్లో చోటు దక్కింది. ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణా అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయనున్నాడు. హెడ్‌కోచ్‌గా గౌతం గంభీర్ వ్యవహరించనుండగా.. ఈనెల 27నుంచి శ్రీలంకతో మూడు టి20లు, మరో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ తలపడనుంది.

టి20 జట్టు: సూర్యకుమార్(కెప్టెన్), శుభ్‌మన్(వైస్ కెప్టెన్), జైస్వాల్, రింకు సింగ్, రియాన్ పరాగ్, పంత్, సంజు(వికెట్ కీపర్లు), హార్దిక్, దూబే, అక్షర్, సుందర్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, ఖలీల్ అహ్మద్, సిరాజ్.

వన్డే జట్టు: రోహిత్(కెప్టెన్, శుభ్‌మన్(వైస్ కెప్టెన్), కోహ్లి, కెఎల్ రాహుల్, రిషబ్ పంత్(వికెట్ కీపర్లు, శ్రేయస్, దూబే, కుల్దీప్, సిరాజ్, సుందర్, అర్ష్‌దీప్, రియాన్ పరాగ్, అక్షర్, ఖలీల్ అహ్మద్, హర్షిత్ రాణా.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68